శ్రీరామకృష్ణ మిషన్ (సేవాసంస్థ): తదాదర్శములు: కార్యావళి

అనువాదకులు:

కీ. శే. కందుకూరు మల్లికార్జునంగారు

ప్రప్రథమమున శ్రీరామకృష్ణమిషన్ ఎట్లు స్థాపింపబడినదియు, ఆ సంస్థయొక్క ఆదర్శములు, అది కావించుచున్న సేవాకార్యావళియు నిందు వివరముగ దెలుపబడియున్నవి.

54 పుటలు — వెల: 50 పైసలు

దేవీ మాహాత్మ్యము

అనువాదకులు:

కీ. శే. కందుకూరు మల్లికార్జునంగారు

మార్కండేయ పురాణాంతర్గతమగు దేవీమాహాత్మ్యము భక్తులెల్లరు అవశ్యము పఠింపదగిన దివ్యగ్రంథము. పాఠకుల సౌకర్యార్థము శ్లోకములు పెద్దఅక్షరములతో ముద్రింపబడియున్నవి. ప్రతి శ్లోకమునకు తేటతెల్లమగు తాత్పర్యము గలదు.

పారాయణము చేయగోరు భక్తుల యుపయోగార్థము గ్రంథాదియందు చండికాధ్యానము, అర్గలాస్తోత్రము, కీలకస్తోత్రము, దేవీకవచమును, గ్రంథాంతమున అపరాధక్షమాపణస్తోత్రమును, దేవీసూక్తమును పొందుపఱచియున్నాము.

ఈ గ్రంథమును శ్రద్ధాభక్తులతో పారాయణముచేయు భక్తులకు శ్రీదేవీకృపాకటాక్షవీక్షణప్రసారము తప్పక కలుగును.

170+24 పుటలు — దివ్యమగు ద్వితీయ ముద్రణము — వెల: రూ. 2-50

అడ్రెసు: మేనేజరు, శ్రీ రామకృష్ణమఠము, మైలాపూరు, మద్రాసు-4

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటము ౨౭ ౧౯౭౦ - జూలై : సాధారణ - ఆషాఢము సంచిక ౧

విషయసూచిక

ఫోన్ : 71231 శ్రీ రామకృష్ణ ప్రభ పోస్టు బాక్సు : 635

1. 1970 జూలై నుండి శ్రీరామకృష్ణప్రభ ఇరవైఏడవసంపుటం జరుగుతూ ఉంది.
2. చందావివరాలు : ఇండియాలో రూ. 5-00 ; విదేశాలలో రూ. 7-00. విడిసంచిక 50 పైసలు.
3. చందాదారులు జాబులలో తమచందాదారుసంఖ్యను చిరునామాను స్పష్టంగా వ్రాయాలి.
4. సంచిక అందకపోతే వారంరోజులలో తెలియజేయాలి.
5. మేము ప్రచురించిన తెలుగుగ్రంథాలలో అనేకములు శ్రీరామకృష్ణప్రభ చందాదారులకు తక్కువవెలకు అందజేయబడును. వివరాలకు ఈ క్రింది చిరునామాకు వ్రాయండి.
6. శ్రీరామకృష్ణప్రభ ప్రముఖసంస్కృతీకేంద్రాలలో ప్రచారంలో ఉన్న ఆధ్యాత్మికవిజ్ఞానపత్రిక. అడ్వర్టైస్మెంట్లకు చక్కని ప్రాపకం. రేట్లకు వ్రాయండి.
7. సమీక్షకు గ్రంథాలు పంపేటప్పుడు రెండేసి ప్రతులు పంపాలని గ్రంథకర్తలకు, ప్రకాశకులకు మా ప్రార్థన.

తక్కిన వివరాలకు ఈ చిరునామాకు వ్రాయండి :—

మేనేజరు : శ్రీరామకృష్ణప్రభ ఆఫీసు, శ్రీరామకృష్ణమఠం, మద్రాసు - 4.



వాహినీ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్

మద్రాసు-26

వారి

అభినందనములతో



ఫోన్ : 71231 పోస్టు బాక్సు : 635

మా మాసపత్రికలు

వేదాంతకేసరి

తత్త్వశాస్త్ర - మత - సంస్కృతివిషయికంగా 1914-వ సంవత్సరంనుండి నడపబడుతుండే ఆంగ్ల మాసపత్రిక.

సాలు చందా : ఇండియాలోను, సింహళంలోను 6 రూపాయలు; ఇతర విదేశాలలో 3 డాలర్లు, లేదా 14 షిల్లింగులు.

శ్రీ రామకృష్ణ విజయం

మత - సాంస్కృతికవిషయికంగా 1921-వ సంవత్సరమునుండి ప్రచురింపబడుతున్న తమిళ మాసపత్రిక.

సాలు చందా : ఇండియాలో ర్సూ 5 లు, సింహళము ర్సూ 7 లు.

శ్రీ రామకృష్ణ ప్రభ

1944-వ సంవత్సరంనుండి ప్రచురింపబడుతూ విశ్వోపజీవ్యమైన ఆధ్యాత్మిక విజ్ఞానామృతమును వెదజల్లే తెలుగు మాసపత్రిక.

సాలు చందా : ఇండియాలో ర్సూ 5 లు, సింహళము ర్సూ 7 లు.

1. చందాదారులు ఉత్తరప్రత్యుత్తరాలలో తమ 'చందాదారు సంఖ్య' నుదాహరిస్తూ విలాసాలను స్పష్టంగా వ్రాయాలి.
2. పత్రిక అందకపోతే నెల రెండవ వారాంత్యానికి మాకు తెలుపాలి.
3. చందాదారులకు మేము ప్రచురించిన గ్రంథాలలో కొన్ని తగ్గింపు ధరలకు అందజేస్తాం. వివరాలకు క్రింది విలాసానికి వ్రాయండి.
4. ప్రముఖ సంస్కృతి కేంద్రాలలో ప్రచారంలో ఉన్న యీ ఆధ్యాత్మిక విజ్ఞాన పత్రికలు అడ్వర్టైస్మెంట్లకు చక్కని ప్రాపకాలు. రేట్లకు వ్రాయండి.
5. సమీక్షకు గ్రంథాలు పంపేటప్పుడు రెండేసి ప్రతులు పంపవలసినదని గ్రంథకర్తలకు ప్రకాశకులకు మా ప్రార్థన.
6. ప్రజారంజకములైన మత - తత్త్వశాస్త్ర - సంస్కృతివిషయిక స్వతంత్ర వ్యాసాలను రచయితలు అందజేస్తే సంపాదకులు కన్నుల కద్దుకొని ప్రచురిస్తారు.
7. పత్రిక స్పెసిమెన్కాపి కోరేవారు 75 పైసల పోస్టేజి పంపాలి.

ఇంకా వివరాలు కావలసినవారు :

మేనేజరు, శ్రీ రామకృష్ణ మఠం, మైలాపూరు, మద్రాసు-4

అనే విలాసానికి వ్రాయండి.



'అఖిలవిభు శరణొందుము, యీ క్షణంబ యతనికృప నీదు ననుభూతి కందు వత్స'

—శ్రీ శారదామణి.

శ్రీరామకృష్ణ ప్రభ

సంపుటము ౨౭ } ౧౯౭౦ - జూలై :: సాధారణ - ఆషాఢము { సంచిక ౧

వాల్మీకిస్తుతి

ఉ. ఏ కవిజిహ్వఁ దోఁత్తి నటియించె సరస్వతి పాదనూపురో
ద్రేకరుశంరుశార్భటులు దిక్కులఁ బిక్కటిలంగ, నే శుభ
శ్లోకునిమానసాబ్జమున శోభిలెఁ దారకహంస, మట్టి వా
ల్మీకిమహర్షిశేఖరు నమేయగుణాకరు నాశ్రయించెదన్.

—కంకంటి పాపరాజు.

క. పుట్టఁపుఁ బుట్టెడువేళం, దిట్టపునునుసచ్చిపుట్టతేనియచవితోఁ
బుట్టె నన, నమృత ముట్టెడు పుట్టనిసువు సత్కవిత్వమును పర్ణింతున్.

— తెనాలి రామకృష్ణుడు.

శా. శ్రీరామాయణకావ్యసారలలితశ్రీకల్పశాఖాగ్రమం
దారూఢస్థితిఁ బొల్చి భాసురజనాహ్లాదంబుగా మాధురీ
చారుప్రౌఢిమ 'రామ రామ' యనుచున్ సమ్యగ్వచోవైఖరుల్
మీరం బల్కు పికంబు నాఁబరఁగు వాల్మీకిం బ్రశంసించెదన్.

—మల్లికార్జునభట్టు.

చ. సరసిజగర్భనిర్మితలసచ్ఛతకోటివిశాలరాఘవే
శ్వరచరితంబు లోకహితసంగతి నిర్వదినాల్గువేలుగా
వరుస రచించినట్టి మునివల్లభు, నాదికవీంద్రు, యోగవి
స్ఫురితు, విరించనాంశభవుఁ, బుణ్యుఁ బ్రచేతసపుత్త్రుఁ గొల్చెదన్.

—గోపీనాథము వేంకటకవి.

మారుతి నుతి

సీ. తరుణార్కకబళనోద్ధతిఁ జూపె నెవ్వాఁడు రుచులచే ఫలమోహరుచులచేత,
సకలంకరామముద్రికఁ బూనె నెవ్వాఁడు శయముచే హృత్కుశేశయముచేత,
మున్నీరు పల్వలంబుగ దాఁటె నెవ్వాఁడు జవముచే గుణగుణార్జవముచేత,
నక్షశిక్షప్రౌఢి నలరారె నెవ్వాఁడు రణముచే నియమధారణముచేత,
ధరణి నెవ్వాఁడు దానవద్విరదదళన విహృతిఁ దనకేసరికిశోరవృత్తిఁ దెలిపె
నతని మత్కావ్యకవ్యవాగమృతఘటన మంజులస్వాంతు హనుమంతు మదిఁ దలంతు.

— రామరాజభూషణుడు.

సీ. శైశవంబుననె భాస్కరు మ్రింగె నితనితేజమున కేఘనుఁ డింక సదృశుఁ డనుచు
హనుతటోద్ధతి వజ్ర మడఁచె నీతనితనుద్రఢిమ కే మిఁకఁ బోల్పఁ దగునటంచు
నురుధాటిఁ గడలిలో మెఱసె నీతనిగభీరతకు నెయ్యది యింకఁ బ్రతియటంచు
వాలాగ్రమున గిరుల్ వ్రాల్చె నీతనిధైర్యసంపద కిఁక నేవి సాటి యనుచు
జానకీరామచంద్రు డేశౌర్యవంతు పటుగుణస్ఫూర్తు లప్పటప్పటికి నెంతు,
రా మహాశాంతు నతిదాంతు నరికృతాంతు నతులమతిమంతు హనుమంతు నభినుతింతు.

— కంకంటి పాపరాజు.

సీ. రామనామాంకితరత్నముద్రిక యిచ్చి జనకజప్రాణ మే ఘనుఁడు నిలిపె
మైథిలీవరశిరోమాణిక్య మర్పించి కడిమి నెవ్వాఁడు రాఘవుని బ్రోచె
బ్రతికించె నెవ్వాఁడు పరమదివ్యౌషధీదానంబుచే సుమిత్రాతనూజుఁ
బూని యెవ్వాఁడు రామునిరాక యెఱిఁగించి భరతశత్రుఘ్నుల బ్రతుకఁజేసె
సమరమున మూర్ఛ నొందిన సకలకపులఁ బ్రాణము లొసంగి యేమహాబలుఁడు మనిచె
నట్టి పరమోపకారి జితాఖిలారి నద్భుతవిహారి సామీరి నభినుతింతు ॥

— గోపీనాథం వేంకటకవి.

ఉ. దండము చండముష్టిహతి దండితదానవచక్రవర్తికిన్
దండము వేదచోదితవిధానసమర్చితరామమూర్తికిన్
దండము భానుసూనుసముదంచితసైన్యచయాగ్రవర్తికిన్
దండము భర్జితాశ్రితజనప్రకరార్తికి నీకు మారుతీ.

— కొటికలపూడి కోదండరామకవి

శ్రీ రామ మంగళము

సీ. దండకావనజనస్థానమం దెవ్వాఁడు ఖరదూషణాదిరాక్షసులఁ దునిమె,
నెలయించి కొనిపోవ నెవ్వాఁడు పోనీక తఱిమి మారీచుమస్తకము ద్రుంచె,
నగములఁ బఱపించి నడవఁగా జలరాశిఁ గట్టించె నెవ్వాఁడు కపులచేతఁ,
గలన రావణకుంభకర్ణాదుల వధించి కాచె నెవ్వాఁడు లోకత్రయంబు,

గీ. నవ్విభీషణవైరనిర్యాతనుండు రామచంద్రుండు శరణార్థిరక్షకుండు
ప్రజలు వొగడ నాచంద్రతారకముగా నయోధ్య సుఖలీలఁ బాలించుచుండు గాత.

—పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు.

రామునకు నతి

సీతాసతి తెచ్చుటకై
దుష్టరాక్షసు ద్రుంచి
కోసల నేలిన గుణోత్తము
భద్రాద్రిపు నిన్ను ప్రార్థింతు మదిఁ
శరణాగతత్రాణ
సిరితో నేగి కరిని గాచితివి,
పాండుసుతుల పాంచాలిని బ్రోచితి,
ప్రహ్లాదనారదాదుల పరిరక్షించితి, వౌ,
పురుషోత్తమ, లక్ష్మీపతి. పురుహూతవినుత,
లోకకల్యాణమును ప్రసాదించు పుండరీకాక్ష,
నీమహిమల వాల్మీకి విరచించె నేమో!
నీశైశవాదుల దశరథాదులు తెలిసిరేమో!
నీశౌర్యమును సుగ్రీవప్రముఖులు శిరసా వహించి రేమో!
నీమాయ నెఱుగ బ్రహ్మేంద్రాదులకైన నగునా?
శక్యమా సామాన్యులకు? మాఅమ్మజానకమ్మ కెఱిగి
ఆమెమూలమున నిన్నాశ్రయించికొందు నీ దయను,
ఘనులగు దైవతముల కరుణామూర్తివి,
అపరాధసహస్రములను అపరిమితాఘముల నొనర్చితిఁ.

—శ్రీ మండలపర్తి ఉపేంద్రశర్మగారు.



ఇతిహాస శ్రేష్ఠము

బిడ్డక్షేమమునకు తల్లి ఎటుల సాధకురాలో సకలప్రాణుల క్షేమమునకు 'శాస్త్రము' ఆలాగు సాధకము. ఏయేపనులు చేసిన మేలు కలుగునో వానిని చేయుడనియు, ఏయేపనులు చేయకుండిన మేలు కలుగునో వానిని చేయకుడనియు శాస్త్రము శాసించును. చేయుమనెడి శాసనమునకు విధియనియు చేయకుడను శాసనమునకు నిషేధమనియు పేరు. శాస్త్ర నియమములు విధినిషేధముల రూపములో నుండును.

''ఇవి యివి కర్తవ్యములు, ఇవియివి అకర్తవ్యములు'' అని బోధించుట సకల సారస్వతమునకును ఉమ్మడిలక్షణము. విధి నిషేధములను కఱపు పద్ధతిలో భేదము లుండును, ఆభేదములనుబట్టి వాఙ్మయమున శాఖలేర్పడును. (1) ప్రజలక్షేమముకోరి ప్రభువు వారిని ''ఈ యీ పనులను చేయుడు, ఈ యీ పనులను మానుడు'' అని శాసించుచుండును. 'చేయుడు' 'మానుడు' అని మాత్రము చెప్పునే కాని ఎందుకు చేయవలెనో ఎందుకు మానవలెనో కారణమును ప్రభువు చెప్పడు. కారణమును ప్రజ లడుగరు, అడుగరాదు, 'ఎందుకు చేయవలె' 'ఎందుకు మానవలె' అని యడుగుట అవినయము. మన క్షేమమును కోరియే ప్రభువు మనల నాజ్ఞాపించుచుండునని నమ్మియుండుట ప్రజలధర్మము. అట్లు నమ్మి వారు ప్రభుని యాజ్ఞలను తలదాల్చి నెఱవేర్చి యోగక్షేమము లొందుచుందురు. వేదశాసనములు ప్రభుశాసనములవలె నుండును. 'సత్యంవద' 'నిజముపల్కు' మనును వేదము. ఏల పలుకవలెనో వేదము చెప్పదు. 'సత్యాన్న ప్రమదితవ్యం' 'సత్యముపట్ల పొరపడకు' మనును వేదము. పొరపడిన నేమో, ఏల పొరపడకుండవలెనో వేదము చెప్పదు. కావున వేదములను ప్రభుసమ్మితము లన్నారు. (2) ధర్మము ననుష్ఠించి శ్రేయమొందిన వారి చరిత్రములను, ధర్మమును ధిక్కరించి అధర్మప్రవణులై నశించిన వారి చరిత్రములను మిత్రుడు తెల్పిన రీతిలో దెలిపి కథారుచులచే రంజింపజేసి చదువరులను ధర్మధీరులనుగను అధర్మ భీరువులనుగను జేయునవి యితిహాసపురాణములు. వీనిని సుహృత్సమ్మితము లన్నారు. (3) శృంగారాది రస సంపదచే చదువరులకు రక్తిగొలిపి తాము దిద్దువడుచున్నట్లు వారికి తెలియకుండగనే, వారిని ధర్మసారులుగను అధర్మదూరులుగను రూపొందించునది కావ్యవాఙ్మయము. దీనిని కాంతా సమ్మితమన్నారు. (1) వేదములు శబ్ద ప్రధానములు, (2) ఇతిహాసపురాణము లర్థ ప్రధానములు (3) కావ్యము రసప్రధానము - అను రీతిలోను తారతమ్యమును గుర్తించుట కలదు.

ఇతిహాసపురాణములను గైకొందము, శ్రీమద్రామాయణ శ్రీమహాభారతములను ఇతిహాసము లనియు, 'సర్గము ప్రతిసర్గము వంశము మన్వంతరము వంశానుచరితము' అను అయిదు లక్షణములచే లక్షితములైన బ్రాహ్మపాద్మ వైష్ణవాదులు పదునెనిమిదియు పురాణము లనియు పేర్కొనుట మన దేశాచారము. ఇతిహాసము లిట మన కిప్పుడు ప్రకృతములు. 'ఇతిహాస' మనగా 'హిస్టరి' అనియు శ్రీరామాయణ మహాభారతము లందలి కథలు కల్పితములు కావని చెప్పుట కాధారములు లేవనియు కావున వానిని చరిత్ర (హిస్టరి) గ్రంథములుగా గొనుట ఛాందసమనియు పలుకు విమర్శకులతో కలహమునకు మేము కడంగబోము. కాని ఆ రెండు గ్రంథములను ఇతిహాసము లని పేర్కొను సంప్రదాయమును తలదాల్పక విడువము.

ఈ యితిహాసములు రెంటిలో శ్రీమద్రామాయణము దేవీ వైభవమును దెల్పున దనియు శ్రీమహాభారతము దేవుని (శ్రీకృష్ణుని) వైభవమును దెలుపున దనియు దాక్షిణాత్య శ్రీ వైష్ణవ మహాచార్యులలో నొకరగు శ్రీ లోకాచార్యులవారు శ్రీవచనభూషణ మనెడి గ్రంథమున దెలిపి యున్నారు. వాల్మీకియే శ్రీరామాయణమును 'సీతాయాశ్చరితం మహత్' అనియు శ్రీవేదవ్యాసుడే మహాభారతమును 'నారాయణ కథా మిమా' మనియు పేర్కొని యుండగా ఇతరులను చెప్పనేల?

శ్రీరామకృష్ణప్రభ ఇరువదియేడవ సంపుటమున నీ తొలిసంచిక శ్రీమద్రామాయణమునకే పూజాకుసుమముగా సమర్పితము. కావున, దాని మేలుములనే ఇంచుక తలపోసికొందము. ఆ యితిహాసములో వచ్చు మగవారును మహిళలును నిత్య మహోజ్జ్వలమూర్తులు. ప్రియసుతు నెడబాసిన క్షణముననే ప్రాణముత్క్రమించు నంతటి పితృప్రేమకు దశరథ మహారాజు లక్ష్యము. మగవారిని సైతము మరులు గొలుపు మేనిచక్కదనమునకు, సకల కల్యాణ గుణగణములకు, సత్యవ్రతమునకు, శరణాగత సంరక్షణ నియతికి, పితృభక్తికి, పితాజ్ఞాపరిపాలన దీక్షకు, పతితపావన ప్రభావమునకు శ్రీరామచంద్రుడు లక్ష్యము. 'అహంచ రాజ్యంచ రామస్య' "నేనును రాజ్యమును శ్రీరాముని సొమ్ములము. నన్ను ఏలవలసినవాడు రాజ్యమును ఏలవలసినవాడు శ్రీరాముడే. రాజ్యము నన్నేలిన నెట్లుండునో నేను రాజ్యము నేలిన అట్లే యుండు" ననిన భరతునకు సాటి ఏడీ? శ్రీరామ సేవచేతనే తన జీవితమున ప్రతి క్షణమును సార్థకపఱచుకొన్న వాడు లక్ష్మణుడు. భరత సేవచేతనే తన జీవితమున ప్రతి క్షణమును సార్థకపఱచుకొన్నవాడు శత్రుఘ్నుడు. భగవత్పరిచర్యకు అంకితమైన లక్ష్మణుని జీవితమును భక్తపరిచర్యకు అంకితమైన శత్రుఘ్నుని జీవితమును విశ్వోపజీవ్యములైన పరమాదర్శాలు. రామాయణ మొక మహామాల, అందు నాయకరత్నము హనుమంతుడు. శ్రీ రామాశ్రయ భాగ్యము నధిగమించిన ధన్యులు సుగ్రీవుడును విభీషణుడును.

ఇక నిందు ప్రస్తుతలైన మగువలను పరికింతము : తన కాధారుడుగ నుండుటకై కొడుకును కనును లోకమున సామాన్యురాలగు తల్లి. లోకాధారుడుగ లోకసంరక్షకుడుగ నుండుటకై కొడుకునుగన్న ధర్మవీరమాత కౌసల్య. భగవత్సేవయు భక్తసేవయునే జీవిత పరమార్థములని స్వాచరణలో చూపిన మహాపురుషులను లక్ష్మణ శత్రుఘ్నులను కని సమర్పించిన ధన్యురాలు సుమిత్ర. శ్రీరాముని ప్రాణమునకు ప్రాణమనిపించుకొన్న భవ్య జీవియు లోకోత్తర గుణోత్తరుడు నగు భరతునిగన్న తల్లి కైకేయి. శ్రీరాముని పట్టాభిషేకమునకు విఘ్నకర్త్రినిగా ఈమెను దూషించువారు ఆ నోటితోనే ఈమెను 'భరతమాత' అని పేర్కొన్నంతనే మున్ను దూషించిన యపచారమునకు తా ముద్దేశింపకే అమోఘ ప్రతిక్రియచేసినవార గుదురు. ఇక సీతాదేవి మహిమకు శ్రీ వివేకానందస్వాముల యీ క్రింది వాక్యములనుమించిన ప్రతిపాదకములుండవు :– "ఆదర్శ భారతీయతకు సీత ఉత్తమోదాహరణము...మంచికిగాని పవిత్రతకుగాని విశుద్ధికిగాని భారతీయ మహిళాధర్మమునకుగాని సీత పెట్టినది పేరు...క్షమాశీల, సర్వంసహా, సదా విశ్వాసపూర్ణ, సదా పరమసాధ్వి" రాతిని నాతిగజేయు శ్రీరామపాదరజఃప్రభావమునకు ప్రఖ్యాపకము అహల్యాచరిత్ర–తారయు మండోదరియు 'నివాసవృక్షస్సాధూనామాపన్నానాం

శరాగతిః' 'వ్యక్తమేషమహాయోగీ పరమాత్మా సనాతనః' అని శ్రీరాముని పరమాత్మగా సాక్షాత్కరించుకొన్నవారు.

సాహిత్యదృష్టితోను ఆధ్యాత్మికధర్మదృష్టితోను భారతీయ సంస్కృత్యన్వేషకదృష్టితోను జూచినను రామయణాద్వితీయత తేటతెల్లమగును. శ్రీరామచరిత్రమున భాస కాళిదాస భవభూతి జయదేవ మురారి ప్రముఖ సంస్కృత మహాకవులు ఎంతయు ఆసక్తులై దాని మెఱుగులను తమ రచనలందు ప్రకటించియున్నారు. తెలుగు సారస్వతమునను మంత్రిభాస్కర-తిక్కనసోమయాజి - ఎఱ్ఱాప్రెగ్గడ గోనబుద్ధారెడ్డి-కంకంటి పాపరాజు మొల్ల మున్నగువారు రామకథాసుధారసపానమును మనకు సమకూర్చియున్నారు. భారతదేశమందును పెక్కు విదేశములందును బహుభాషలలోని కీ యితిహాసశ్రేష్ఠము అనూదితమై యున్నది, కథలుగ, బుఱ్ఱకథలుగా, గద్యపద్యమిశ్రశ్రవ్యదృశ్యకావ్యాలుగా. అందఱికీ మోజు రామకథ మీఁదేనా అను ఆ శంకకు కవులు చెప్పుకొన్న సమాధానాలు వినుడు—

"యదిక్షుణ్ణం పూర్వై
రితిజహాతి రామస్యచరితం
గుణై రేతావద్భిర్జగతి
పునరన్యోజయతికః?"

"అందఱును చెప్పుచున్నకథనే మనమును చెప్పుటయా అని రామకథను వదలుకొందుమేని రామునివంటి కల్యాణగుణసంపన్నుడు మఱొక్కడేడీ" అన్నాడు భట్టమురారి.

స్వసూక్తీనాం పాత్రం
రఘుతిలకమేకం కలయతాం
కవీనాం కో దోషః?
స్సతుగుణగణానా మవగుణః;
మి
రపరగుణలుబ్ధై రివజగ
త్యసావేకశ్చక్రే
సతత సుఖసంవాసవసతీః.

"కవులందఱు తమ సూక్తులకు రఘుతిలకు నొక్కనే పాత్రీకరించుచున్నారు, ఇందు వారి తప్పేమి? అది (శ్రీరాముని కల్యాణ) గుణముల అవగుణమే. ప్రతిగుణమును తక్కినగుణముల మీఁది మోజుచేతంబోలె శ్రీరామునందే నెలకొనియున్నది" అన్నాడు జయదేవుడు.

వెలయఁగ నీ కథ విను ధ
న్యులు తక్కినకథలు వినఁగనొల్లరు,
మదిఁ, గా
కులరొదలు విన రుచించునె
కలకంఠధ్వనులు విన్న కర్ణంబులకున్?

అన్నాడు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు. కంకంటి పాపరాజు 'రాఘవేశ్వరుచారిత్రము నెందఱెన్నిగతులన్ వర్ణించినం గ్రాలదే' అని సమర్థించుకొన్నాడు.

శ్రీకృష్ణుడు గీతాశాస్త్రమును ప్రవర్తింప జేసినట్లు శ్రీరాముడే గ్రంథమును ఉపదేశించి యుండలేదు కాని శ్రీమద్రామాయణమున అయోధ్యాకాండప్రముఖఘట్టాలలో ఆయన నోట వెలువడిన సుభాషితరత్నములు విరళములైనను సరళములు, సోపమానములయ్యును నిరుపమానములు.

ముఖ్యముగ ఆంధ్రదేశప్రజలకు శ్రీరామభక్తి హెచ్చు. త్యాగరాజు రామదాసు మున్నగు వాగ్గేయకారుల రామపరములైన పాటలు సుప్రసిద్ధములు. రాజనీతి దండనీతి పాఠములు శ్రీరామాయణమున మెండుగ నున్నవి.

అన్నిటికంటె ముఖ్యమైన దిందు ప్రతిపాదితమైన ప్రపత్తి:—[1] 'సకృదేవ ప్రపన్నాయ' ఒక్కసారి శరణు జొచ్చినవారికి సకలభూతములబారినుండియు అభయమిచ్చుట నావ్రత'మనెను. శ్రీరాముడు [2] శరణు అడిగించుకొనుటకై వేచియుండక, పాపులు శుభులు అను భేదము పాటింపక అందఱిని కనికరింపవలె నన్నది సీతమ్మ.

పైని ప్రస్తావితములైన వైభవప్రాముఖ్యములఫలితముగా శ్రీరామయణమునకు ఇతిహాసశ్రేష్ఠమను ఖ్యాతి గలిగినది.

ఆదికవి - వాల్మీకి

శ్రీ పోలూరి హనుమజ్జానకీరామ శర్మగారు

1. మానవజాతిచరిత్ర ఒకమహాసముద్రము వంటిది. అప్పుడప్పుడు ధర్మాధర్మపక్షములు రెండు ప్రబలి యొకానొకజాతిని కవ్వముగా నొనర్చి దానిని మథించుచుండును. ఆ మథనమున మొదట నావిర్భవించునది అపారజన వినాశరూపమైన మహాసంగ్రామము. అది హాలాహలమువంటిది. కాని దాని వెన్నంటి అమృత కుంభమువలె మహాకావ్యము ఆవిర్భవించును. ప్రపంచ వాఙ్మయమున మహేతిహాస పూర్వకములుకాని మహాకావ్యములు కన్పింపవు. శ్రీమద్రామాయణమే ఇందులకు మొదటి దృష్టాంతము. త్రేతాద్వాపరసంధియందు భార్గవ రాముడు క్షత్రియవంశములను నిర్మూలించెను. అది యదనుగ రావణుని నాయకత్వమున రాక్షసులు చెలరేగిరి. వారిని రఘురాముడు నిర్మూలించెను. ఈ మహావిప్లవములను ప్రతిబింబించుచు రామాయణ మావిర్భవించెను.

2. ఈ కావ్యావిర్భావమునకు, సీతారాముల జీవిత సంఘటనలకు నవినాభావసంబంధము కలదు. జనాపవాదమునకు వెఱచి శ్రీరాముడు సీతను వాల్మీకియాశ్రమప్రాంతమున వదలి రమ్మని లక్ష్మణున కాజ్ఞాపించెను. లక్ష్మణుం డట్లు సీతను వదలిపెట్టి వెళ్లెను. మునిబాలకులు వచ్చి ఎవరో యొక స్త్రీ విలపించుచున్నదని చెప్పంగా వాల్మీకిమహర్షి తపోలబ్ధమైనదృష్టితో సీత తనయాశ్రమప్రాంతమున పరిత్యజింపబడెనని గ్రహించి యామె యున్నచోటికి పరుగు పరుగున నేగి ఆమెనోదార్చి, "తపోలబ్ధమైన దృష్టితో నీవు పాపరహితవని నేను తెలిసికొనుచున్నాను. నీవు ఇచ్చట సంకోచము లేక విశ్వాసముతో నుండుము. నీవిప్పుడు నారక్షణము నొందితివి." అని పలికెను.

అపాపాం వేద్మి సీతే త్వాం
తపోలబ్ధేన చక్షుషా
విస్రబ్ధా భవ వైదేహి
సాంప్రతం మయి వర్తసే॥

(ఉత్తరకాండ-సర్గ. 49 శ్లో. 10)

ఈ మాటలవలన సీతాదేవియొక్క యోగక్షేమముల భారమంతయు తనపై నున్నట్లు

---

1. సకృదేవప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే, అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ.

2. పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవఙ్గమ, కార్యం కరుణ మార్యేణ నకశ్చిన్నాపరాధ్యతి.

వాల్మీకి స్పష్టమొనరించెను. వాల్మీకికి సీతారాముల జీవితవిశేషములు క్రొత్తవికావు. సీతారాములు మొదట వనవాసమునకు బయలుదేఱి వచ్చినప్పుడు చిత్రకూటమునొద్ద వారికి స్వాగతమొసంగినవాఁడు వాల్మీకియే. సీతారామలక్ష్మణులు ఆశ్రమము నిర్మించుకొని ఆయనచెంత కొంతకాలము ఉండిరి. భరతుఁడు వచ్చుట, రాముఁడు రాజ్యము నిరాకరించి అతనికి పాదుకల నొసంగుట, మొదలగువాని నన్నింటిని వాల్మీకి చూచుచునేయుండెను, తర్వాత జరిగిన రావణసంహారాది వృత్తాంతమును కూడ ఆయన వినుచునేయుండెను. కావున సీతారాములు పరమధార్మికులైన యుత్తమదంపతు లనుటలో నాయనకెట్టి సంశయమును లేదు. అదియునుఁగాక లక్ష్మణుఁడు చెప్పినట్లుగా వాల్మీకి దశరథునకుఁ బ్రియమిత్రుఁడు.

రాజ్ఞో దశరథ స్యైవ
పితుర్మే మునిపుంగవః
సఖా పరమకో విప్రో
వాల్మీకి స్సుమహాయశాః॥
(ఉత్తరకాండ-సర్గ-47. శ్లో. 16-17)

వాల్మీకికి పెద్దబాధ్యతయే ఏర్పడెను. భర్తకు దూరమై పుట్టినింటికిఁ జేరిన పుత్రికనుజూచి నప్పుడు తండ్రికి కలుగు ఆవేదనలవంటి పరితాపమే వాల్మీకికిని కలిగినది. సీతాదేవిని మరల నెట్లు శ్రీరామునొద్దకుఁ జేర్పవీలగునా యను చింత ఆయనకుఁ బ్రబలమయ్యెను. వారివియోగమునకు మూలమైన జనాపవాదమును తొలగించుట ఎట్లో ఆయనకుఁ దోఁపలేదు. ఇది యిట్లుండఁగా నామె కుశలవులను ప్రసవించెను. ఈ సంఘటనముతో నీసమస్య యింకను జటిలమయ్యెను. ఇప్పుడు సీతాదేవివిషయము మాత్రమే కాక యామె బిడ్డలభవిష్యత్తును గూర్చికూడ ఆయన ఆలోచింపవలసివచ్చెను. ఆమెశీలమునే శంకించిన జనులు ఆమె బిడ్డలను రామునిపుత్రులనుగా, రాజ్యార్హులనుగా నంగీకరింతురా యనునది పెద్దసమస్య. ఆయన ఈ సమస్యలతో వేగుచుండఁగా నారదమహర్షి ఆయనయొద్దకు వచ్చెను. అప్పుడు సంక్షుభితమైన యంతరంగముతో వాల్మీకి, "ఇపప్పుడీ లోకమున గుణవంతుఁడెవఁడు? వీర్యవంతుఁడెవఁడు? ధర్మజ్ఞుఁడు, కృతజ్ఞుఁడు, సత్యవాక్పరిపాలకుఁడు, దృఢవ్రతుఁడైన వాఁడెవఁడు? ఎవఁడు గొప్పచరిత్రఁ గలవాఁడు? సర్వభూతహితుఁ డెవ్వఁడు?" అని యీ విధముగా ప్రశ్నించెను. (బాలకాండ-సర్గ-1, శ్లో. 2-3)

ప్రజలు సీతారాములఁగూర్చి సందేహించుచున్నారుగదా! మఱి రామునికన్నను గుణవంతుఁడు, ధర్మజ్ఞుఁడు, ధార్మికుఁడు నిప్పుడు లోకమున మఱియొకఁడు గలఁడా అను ఆవేదనమే యీ ప్రశ్నయందు కన్పించుచున్నది. నారదుఁడు వాల్మీకియొక్క సంశయమును తొలగించుచు రామునికన్న గుణవంతుఁడు ధార్మికుఁడు మఱియొకఁడు లేఁడని దృఢముగాఁ జెప్పుచు నాయన చరిత్రమును సంగ్రహముగాఁ జెప్పి వెడలిపోయెను.

౩. ఇట్లు రామునిచరిత్రమును నారదుని వలనవినిన వాల్మీకికి, రాముఁడు పరమధార్మికుఁడే యను నిశ్చయ మేర్పడినను సీతాదేవియొక్కయు, కుశలవులయొక్కయు భవిష్యత్తును గూర్చినసమస్యకు సమాధానము లభింపలేదు. ఈయాలోచనముతో సతమతమగుచునే ఆయన భరద్వాజుఁడను శిష్యునితోఁగూడి మాధ్యాహ్నికస్నానమునకై తమసానదీతీరమునకుఁ బోయెను. ఆయన అచ్చటి జలమును జూచి ఇట్లనెను, "భరద్వాజా, నిర్మలమైన ఈ తీర్థమును జూడుము, ప్రసన్నమైన జలము గల

దిదై మంచిమనుష్యుని మనస్సువలె రమణీయముగ నున్నది.''

అకర్దమిదం తీర్థం
భరద్వాజ నిశామయ
రమణీయం ప్రసన్నాంబు
సన్మనుష్య మనో యథా॥

(బాలకాండ-సర్గ. 2 శ్లో. 5)

ఆయన ఆ సమయమున నిర్మలమైన సీతారాముల చిత్తవృత్తులనుగూర్చి, శంకాకలుషితమైన ప్రజల చిత్తవృత్తులనుగూర్చి భావించు చుండుటవలననే యిట్టియుపమాన మాయనకు స్ఫురించెనని చెప్పవచ్చును. ఆ సమయముననే బోయవాఁడొకఁడు జంటగానున్న క్రౌంచములలో మగపక్షినిసంహరించెను. ఆడుపక్షి విలపింపఁజొచ్చెను. అదిచూచిన వెంటనే యాయన హృదయము కారుణ్యముతో ద్రవించెను. ఆ చిత్తవృత్తి బోయవానిని చూచినంతనే కోపముగాఁ బరిణమించి శాపముగా శ్లోకరూపము నందెను. ఆయన వాని నిట్లు తిట్టెను. ''కామమోహితమైయున్న క్రౌంచమిథునమునందొక దానిని నీవు చంపితివి. కావున నీవు చిరకాలము మనవు.''

మా నిషాద ప్రతిష్ఠాం త్వ
మగమ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచమిథునా దేక
మవధీః కామమోహితమ్॥

(బాలకాండ-సర్గ. 2 శ్లో. 15)

4. శ్లోకరూపముగ నీవాక్యము వెలువడినంతనే, ''నే నేమి యిట్లంటిని?'' అని వాల్మీకికే చింతకలిగెను. ఆయన దానినిగూర్చి ఆలోచించి శిష్యునితో నిట్లుచెప్పెను. ''పాదములు కలిగి, ప్రతిపాదమునందును అక్షరములసంఖ్య సమానమై తంత్రీలయాన్వితముగ శోకార్తుఁడనైన నానుండి వెలువడిన యీవాక్యము శ్లోకమే యగునుగాని, మఱియొకటి కాదు.''

పాదబద్ధో౽క్షర సమః
తంత్రీలయ సమన్వితః
శోకార్తస్య ప్రవృత్తో మే
శ్లోకో భవతు నాన్యథా॥

(బాలకాండ-సర్గ. 2-శ్లో-18)

వేదములలో ఛందస్సులు ప్రసిద్ధములే, వానికసలు 'ఛందస్సులు' అనుపేరును గలదు. అందువలన ఛందోబద్ధమైన వాక్యము క్రొత్తవిషయముకాదు. కాని వేదములకు భిన్నముగ, లౌకిక విషయములందు సాధారణవ్యక్తులు ఛందోబద్ధముగ రచించుట క్రొత్తవిషయమే. కావుననే వాల్మీకికి, భరద్వాజునకు, తరువాత ఆశ్రమవాసుల కందఱకును నూతనమైన యీ శ్లోకావిర్భావము విస్మయమునే కలిగించెను. వాల్మీకి శిష్యునితో ఆశ్రమమునకు తిరిగివచ్చిన తరువాత ఆవృత్తాంతమును గూర్చియే ఆలోచించు చుండఁగా, చతుర్ముఖుఁడాయనను చూచుటకు వచ్చెను. వాల్మీకి ఆయన నర్ఘ్యపాద్యాదికముల నర్చించెను. అట్లు లోకపితామహుఁ డర్చితుఁడై తనయెదుటఁ గూర్చుండి యుండఁగా వాల్మీకి క్రౌంచములవృత్తాంతమునే స్మరించుచుఁదానుచెప్పిన శ్లోకమునే తలంపఁ జొచ్చెను. అది గమనించి బ్రహ్మదేవుఁడు నవ్వుచు నిట్లు లనియెను. ''నీవు రచించినది శ్లోకమే. ఇందాలోచింపవలసిన దేమియులేదు. నా సంకల్పమువలననే నీయం దిట్లు సరస్వతి యావిర్భవించినది. ధర్మాత్ముఁడు, భగవంతుఁడునైనరాముని చరిత్రమును సమగ్రముగ కావ్యముగ రచింపుము. నీకు నిప్పటికిఁ దెలియని దంతయు స్పష్టముగఁ గోచరము కాఁగలదు.

కావ్యమున నీవచనమేదియును అనృతము కాదు.''

(బాలకాండ-సర్గ. 2-శ్లో. 31-25)

5. అట్లానతిచ్చి చతుర్ముఖుఁడు వెడలి పోయిన తరువాత వాల్మీకిమహర్షి శ్రీరాముని చరిత్రమును స్మరించుచు తననుండి యావిర్భవించిన శ్లోకమువంటి శ్లోకములతో దానిని కావ్యముగ రచింపవలెనని నిశ్చయించుకొనెను. పిమ్మట నాయన శుచియై ప్రాచీనాగ్రములైన దర్భలయందు కూర్చుండి ప్రాంజలియై బ్రహ్మప్రసాదరూపమైన బుద్ధ్యతిశయము సాధనముగ సీతారామాదులచరిత్రము నుగూర్చి ఆలోచింప మొదలిడెను. అట్టి యోగస్థితియం దాయనకు వారి చరిత్రయంతయు కరతలామలకమయ్యెను. అట్లు ప్రత్యక్షమగుచున్న యా వృత్తాంతమంతయు నేడు కాండములుగ, నైదువందల సర్గములతో, నిరువదినాలుగువేల శ్లోకముల గ్రంథమును రచించెను.

6. ఈ సందర్భమున చతుర్థ సర్గారంభమున నొక శ్లోకముకలదు. ''రాజ్యమునుపొందిన రాముని చరిత్రమును సమగ్రముగ నద్భుతమైన పదసన్నివేశముతో మహార్థయుక్తముగ భగవంతుఁడగు వాల్మీకిమహర్షి రచించెను.''

ప్రాప్త రాజ్యస్య రామస్య
వాల్మీకి ర్భగవానృషిః
చకార చరితం కృత్స్నమ్
విచిత్రపద మర్థవత్ ॥

(బాలకాండ-సర్గ. 4-శ్లో-1)

దీనినిబట్టి రావణసంహారానంతరము రాముఁడయోధ్యారాజ్యమును _రిపాలించుచుండగా వాల్మీకి ఈకావ్యమును రచించెననుట స్పష్టము. 'ప్రాప్తరాజ్యస్య' అను పదమున మఱియొక విషయమును ధ్వనించుచున్నది. శ్రీరాముఁడు పదునాలుగేండ్లు వనవాస మొనర్చుచు రాక్షసుల సంహరించి తిరిగి రాజ్యమును పొందుట ఒకయెత్తు. ప్రజలలో మహారాణినిగూర్చి అపవాదము ప్రబలిన పిమ్మట ఆమెను దూరమొనర్చుకొని మరల ప్రజారంజకుఁడై రాజ్యమును పాలించుట మఱియొకయెత్తు. మొదటిదానికన్నను రెండవసందర్భమే చాల గడ్డైనది. వనవాసమునుండి తిరిగి వచ్చినప్పుడు శ్రీరామునికొఱకు భరతుఁడు రాజ్యమును సిద్ధముగానే యుంచెను. దాని నాయన స్వీకరించుటలో సమస్యయేదియును లేదు. కాని రెండవసారి జనాపవాదము ప్రబలినపిమ్మట సీతాదేవిని దూరమొనర్చుకొని ప్రజానురంజనరూపముగ రాజ్యమును నిలుపుకొనుటయే మిగుల ప్రశంసార్హము. ప్రాణాధికప్రియురాలగు వైదేహిని దూరమొనర్చుకొని మహావిరహవ్యథావివశుఁడయ్యును స్వధర్మమైన రాజ్యపరిపాలనమును నిలుపుకొనియున్న శ్రీరాముని చరిత్రమును రచించితినని వాల్మీకిమహర్షి 'ప్రాప్తరాజ్యస్య' అనుపదమున ధ్వనింపఁజేయుచున్నాఁడు.

7. కావ్యమును రచించుట ఒకయెత్తు; దానిని లోకమున ప్రకటించుట యెత్తు. కావ్యమును పూర్తిగావించిన వాల్మీకి మహర్షి, ''దీని నెవరు లోకమునఁ బ్రచార మొనర్పఁగలరు'' అని చింతింపఁజొచ్చెను. సరిగా నాసమయమునకే కుశలవులు వచ్చి ఆయన పాదములకు ప్రణమిల్లిరి. వారు అప్పటికే వేదములందు పరినిష్ఠితులు; మంచి కంఠస్వరము కలవారు. కావున వారిని చూడఁగనే వాల్మీకి వీరే తన కావ్యప్రచారమునకు సమర్థులని నిశ్చయించి వెంటనే వారికి ఆ కావ్యము వాచోవిధేయ మగునట్లు నేర్పెను.

8. ఇచ్చట వాల్మీకి, రామాయణకావ్యము నకు రెండువిశేషణముల నుపయోగించెను. అది సీతాదేవియొక్క మహనీయమైన చరిత్ర యనియు, పౌలస్త్యవధమనియు ఆయన పేర్కొనెను.

కావ్యం రామాయణం కృత్స్నం
సీతాయా శ్చరితం మహత్
పౌలస్త్యవధ మిత్యేవ
చకార చరితవ్రతః॥

(బాలకాండ-సర్గ-4 శ్లో. 7)

భూషణ వ్యాఖ్యానమున శ్రీ గోవిందరాజ మిశ్రులు పేర్కొనినట్లుగ, "రామాయణ కావ్యము అప్రధానముగ రామచరితమును వర్ణించుచు, ప్రధానముగ సీతాచరితమునే ప్రతిపాదించుచున్నది."

"[ఇదంచ రామచరిత ప్రతిపాదనం అప్రాధాన్యేన, ప్రాధాన్యేన తు సీతాచరిత మేవ ప్రతిపాద్యతే ఇత్యాహ కృత్స్నం సీతాయాశ్చరిత మితి, కృత్స్నం రామాయణం సీతాచరిత పరమ్]

దీనినిబట్టి వాల్మీకిమహర్షి కావ్యమును రామునిచరిత్రముగ రచించుచున్నను, ఆయన మనస్సున ప్రధాన ప్రతిపాద్యముగ మెదలు చున్న విషయము సీతాదేవియొక్క చరిత్రమే యనుట స్పష్టము. రామునిచరిత్రము వాచ్యమగుచో సీతాదేవి చరిత్రము వ్యంగ్య మన్నమాట. ప్రజలీకావ్యమును విని సీతాదేవి ఎట్టి కష్టములు పొందినదో, అట్టికష్టములయందును తనశీల మహత్త్వము నెట్లు నిలుపుకొన్నదో, సకలదేవతా సమక్షమున అగ్నిపరీక్ష నొందిన తరువాతనే శ్రీరాముఁడామె నెట్లు స్వీకరించెనో చక్కగ గ్రహింపవలయుననియే ఆయన యాకాంక్ష. శ్రీరాముఁడు, సభాముఖమున, ఈకావ్యమును వినవలసినదని సభ్యులను కోరుచు చెప్పిన మాటలు గమనింపఁదగియున్నవి. "పార్థివలక్షణాన్వితులైన యీ మునిబాలకు లిరువురును కుశీలవులు. వీరు మహాతపస్వులు. ఈ కావ్యము నాకును శ్రేయస్కరమని చెప్పుచున్నారు. ఇట్టి మహానుభావమైన యీచరితమును మీరును గ్రహింపుఁడు."

ఇమౌమునీ పార్థివలక్షణాన్వితౌ
కుశీలవౌ చైవ మహాతపస్వినౌ
మమాపి తద్భూతికరం ప్రచక్షతే
మహానుభావం చరితం నిబోధతం॥

(బాలకాండ-సర్గ. 4 శ్లో. 35)

రాముఁడు తన చరిత్రమునుగూర్చి మహానుభావమైనది యని చెప్పుట వింతగానే యున్నది. రాముఁడు ఆత్మప్రశంసఁ గావించుకొనునా? పరమోదాత్తుఁడైన శ్రీరామునియందు నిది యసంభవము. అందువలన నాయనదృష్టి యందును, రామాయణము స్థూలముగ తన చరిత్రముగ కన్పించుచున్నను, సీతాదేవి చరిత్రమే ఇందు ప్రధానముగ ప్రతిపాదింపఁబడుచున్నది. కావున కావ్యమును రచించిన వాల్మీకికి, దానిని సభలో పాడించిన శ్రీరామునకును, మహాజనులందఱును సీతాదేవి మహత్త్వమును గుర్తింపవలయు ననియే ఆకాంక్ష.

9. ఇట్లీకావ్యమును రాముఁడు పెక్కుదినములు వినెను. ఒకదినమున కథాసందర్భము ననుసరించి, సీతాదేవి కుశలవులను కనెను అను ఘట్టమును కుశలవులే గానమొనర్చిరి. వెంటనే రామునకు మరల నొక సమస్య యేర్పడెను. కుశలవులు రాజపుత్రు లగుటచే రాజ్యమునకు వారసులు. సీతాదేవి పతివ్రతగ, మహారాణిగ ప్రజలచే నంగీకరింపఁబడినప్పుడే

వారు రాజ్యమునకు వారసు లగుదురు. ఇది ప్రజలకు సంబంధించి వెంటనే నిశ్చయింప వలసినకార్యము. కావుననే రాముఁడు, సీతాదేవి ప్రజలసమక్షమున శపథము గావింపవలెనని వాల్మీకిమహర్షికి వార్త నంపెను. ఆయనయు నంగీకరించెను. మఱునాఁడే శపథమునకై మహాసభ యేర్పాటుచేయఁబడెను.

10. మఱునాఁడు వాల్మీకి సీతను సభకు పిలుచుకొనివచ్చి రాముని సమీపించి, ''నీవు లోకాపవాదమునకు వెఱచి పవిత్రురాలైన యీమెను పరిత్యజించితివి. నాయాశ్రమసమీపమున వదలిపెట్టఁబడుటచే నీమె నాచేత నాదరింపఁబడినది. ఈ కుశలవులు నీకుమారులు. నేను సత్యమును చెప్పుచున్నాను. నేను ప్రచేతసునకు పదియవకుమారుఁడను. అనృతము నెప్పుడును స్మరించి యెఱుఁగను. వేలకొలఁది సంవత్సరములు తపస్సుచేసితిని. ఈ సీతయందు దోషమే యున్నచో నేనాతపఃఫలమును పొందకుందునుగాక. ఈమె పరిశుద్ధురాలనియే నేను గ్రహించితిని. అయినను లోకాపవాదభీతుఁడవైన నీకొఱకీమె మరల శపథము చేయఁగలదు.

(ఉత్తరకాండ సర్గ 96 శ్లో. 15 నుండి 22)

అప్పుడు రాముఁడు ప్రాంజలియై వాల్మీకితో నిట్లనెను. ''అయ్యా, తమ వాక్యములందు నాకు విశ్వాసము కలదు. వెనుక దేవతల సన్నిధానమున శపథము చేసిన తరువాతనే నే నీమెను స్వీకరించితిని. అయినను లోకాపవాద భీతుఁడనై ఆమెను పరిత్యజించితిని. ఈ విషయమున తమరు నన్ను క్షమింపవలయును. ఈ కుశలవులు నాకుమారులు అనియు నెఱుఁగుదును. అయినను సీతాదేవి లోకమునకు పరిశుద్ధురాలుగ ప్రకాశించినచో సంతోషింతును''

(ఉత్తరకాండ సర్గ 97 శ్లో. 2 నుండి 5)

11. సీతాదేవి శపథముచేయు నని కుతూహలముతో దేవతలు, మహర్షులు, యక్షరాక్షసపన్నగులు, మొదలుగా నసంఖ్యాకులైన జనులు అచటికి చేరుకొనిరి. వారినందఱను చూచి కాషాయవాసిని యైన సీతాదేవి తల వంచుకొని ప్రాంజలియై, ''నేను మనోవాక్కాయకర్మల రాముని దప్ప మఱియొకని భావించి యెఱుఁగనేని నాకు భూదేవి మార్గ మొసంగును గాక!'' అని ముమ్మారు శపథముఁ గావించెను.

(ఉత్తరకాండ సర్గ 97 శ్లో. 13 నుండి 16)

ఆమె శపథము గావించుచుండగనే రసాతలము నుండి దివ్యమైనన సింహాసనము పైకి వచ్చెను. భూదేవి సీతను కౌఁగిలించుకొని అందు కూర్చుండఁ బెట్టుకొని రసాతలమునకుఁ గైకొని పోయెను. ఈ సంఘటనమునకు ఎల్లరును విస్మితులైరి. శ్రీరాముఁడు పరమ దుఃఖితుఁడై భూదేవిపై కోపించి, సీతను మరల తన కొసంగకున్నచో సర్వనాశ మొనరింతునని పలుకఁజొచ్చెను. అప్పుడు బ్రహ్మదేవుడు ఆయనను శాంతింపఁజేసెను.

12. కావ్యపఠనమువలననే సీత, కుశలవులును శ్రీరాముని యొద్దకు మరల చేరుట సంభవించెను. కాని అక్కడ సమావిష్టులైన మహాజను లెల్లరును ఆశించినట్టుగా సీతాదేవి శ్రీరామునితో మరల సహవాసమును పొందలేదు. శపథము చేయునప్పుడు తన్ను రసాతలమునకుఁ గొంపొమ్మని సీత భూదేవిని ప్రార్థించునని ఎవ్వరును ఊహింపలేదు. వారందఱును, శపథము మహత్త్వము వలన భూదేవి ప్రత్యక్షమై సీతారాములకు మరల సహవాస మేర్పఱచుననియే తలంచిరి. శ్రీరాముఁడును అట్లే యాశించెను. అందువలననే ఆయనకు సీతానిర్గమనమున మహాదుఃఖము కలిగెను. ఈ కావ్యము నారంభించినప్పుడు వాల్మీకియైనను ఈ పరిణామమును

ఊహించియుండఁడు. అందువలననే సర్వము నెఱిఁగిన బ్రహ్మదేవుఁడు శ్రీరాము నోదార్చుచు విష్ణుస్వరూపమును స్మరింపవలసినదని, సీతాదేవికిని, ఆయనకును స్వర్గలోకమున మరల సమాగమ మేర్పడఁగల దనియు బోధించెను. ఆ లోకపితామహునిదృష్టియందు సీతారాముల యీ వియోగము చాల అప్రధానమైనది. సీతారాములచరిత్ర అశేష ప్రజానీకమునకు పర్వతములు, నక్షత్రములు నిలుచు పర్యంతము ధర్మప్రబోధకమై యుండుటయే, ఆయనదృష్టిలో నీ కావ్యమునకు పరమప్రయోజనము. అది సీతాదేవియొక్క-శపథముచే భూదేవి ప్రత్యక్షమై యామెను రసాతలమునకు గొంపోవుటవలన సిద్ధించెను. దీనివలన సీతారాముల పరమ ధార్మికత్వము అత్యద్భుతముగ నిరూపింపఁబడినది. వారి చరిత్రమును వియోగాంతముగ చూచుచున్న ప్రజలహృదయము కరుణముచే ద్రవించెను. అట్లు ద్రవించిన మనస్సునందు సీతారాముల చరిత్ర చెరగని ముద్రగ నంకితమయ్యెను. కావ్యము సుఖాంతమే యగుచో లోకము వారిని గూర్చి అంత గాఢముగ భావించి యుండ రేమో! కరుణరసమునకు గల యీ సామర్థ్యము మఱి యేరసమునకును లేదు. కావుననే లోకపితామహుఁడు ఈ కావ్యము కరుణముననే పుట్టి, కరుణముననే ముగియవలె నని సంకల్పించినట్లు తోఁచును. ఆయన కావ్యారంభమునందును కావ్యముయొక్క- ముగింపు నందును కన్పించుట గమనింపఁ దగియున్నది. రావణసంహారమే ప్రయోజనముగ శ్రీరాముని చరిత్ర, విష్ణుదేవుఁడవతరించుసమయముననే ఎట్లు సమాలోచన పూర్వకముగ నిశ్చయింపఁ బడినదో, అట్లే పితామహుఁడు, ఆదికావ్యమైన యీ రామాయణము యొక్క- ఆదిమధ్యాంతములను, స్వరూప స్వభావములను ముందుగనే నిశ్చయించి తద్రచనమున వాల్మీకిమహర్షి ని సాధనమాత్రునిగ నియోగించెను. ఈయభిప్రాయము నాయన, "నా సంకల్పమువలననే నీయందిట్లు సరస్వతి యావిర్భవించినది" అను మాటలలో స్పష్టమొనరించెను. దీనినిఁబట్టి నారదాగమనమే కాక క్రౌంచవృత్తాంతము కూడ ఆయన సంకల్పానుసారముగనే జరిగిన దని మనము గ్రహింపవలసి యున్నది. అనఁగా ఆయన వాల్మీకియందు కవిత్వమును కరుణరసమునం దావిర్భవింపఁ జేసి, యాయనచేత రామాయణమును కరుణరసాత్మకముగనే నిర్వహింపఁ జేసె నన్నమాట.

13. ఆయన ఈ కావ్యమునుగూర్చి రామునితో చెప్పిన మాటలు గమనింపఁదగియున్నవి. "కావ్యములలో నుత్తమమైనది, నీవు విన్నది అయిన యీ కావ్యమే నీకు ఇఁకముందు కర్తవ్యమైనదానిని చక్క-ఁగా బోధింపఁగలదు. నీవు పుట్టినప్పటినుండియు పొందిన సుఖదుఃఖముల వృత్తాంతమును, ఇఁక ముందు జరుగనున్న దానినికూడ వాల్మీకి ఇందు రచించెను. ఈ యాదికావ్య మంతయును నీయందే ప్రతిష్ఠితమై యున్నది. రాఘవుఁడైన నీకన్న నన్యుఁడు కావ్యములలో యశము నందుట కర్హుఁడు కాఁడు"

ఏత దేవ హి కావ్యం తే
కావ్యానాం ముత్తమమ్ శ్రుతమ్
సర్వం విస్తరతో రామ
వ్యాఖ్యాస్యతి నసంశయః॥

జన్మప్రభృతి తే వీర
సుఖదుఃఖోపసేవనమ్
భవిష్య దుత్తరం చేహ
సర్వమ్ వాల్మీకినా కృతమ్॥

ఆదికావ్య మిదం రామ,
త్వయి సర్వం ప్రతిష్ఠితమ్
నహ్యన్యోఽర్హతి కావ్యానాం
యశః

(ఉత్తరకాండ-సర్గ-98 శ్లో. 16, 17, 18)

చతుర్ముఖుఁడు, "కావ్యములలో నుత్తమ మైనది" అని చెప్పి వెంటనే "ఇది ఆది కావ్యము" అని చెప్పుట వింతగఁ దోఁచును. ఇది కావ్యములలో నుత్తమ మన్నప్పుడు, అప్పటికి కొన్ని కావ్యము లుండినఁగదా నిది వానిలో నుత్తమమగుట? అట్లైనచో నిది యాదికావ్య మెట్లగును? కావున 'ఉత్తమ కావ్య' మనఁగా ఇది యిఁక ముందు రచింపఁబడు సకల కావ్యములయందును శ్రేష్ఠమైనదిగా నుండు ననియే చతుర్ముఖుని యభిప్రాయముగ మనము గ్రహింపవలసి యున్నది. కాని రామాయణమందే నృత్యములు, గీతములు, నాటకములు, మొదలగునవి యచ్చటచ్చట ప్రస్తావింపబడియున్నవి. మఱి ఆ గీతములలో, నాటకములలో కవిత్వమే లేదా? అట్లైనచో నిది ఆదికావ్య మెట్లగును? వాల్మీకిని ఆదికవి యని ఏల చెప్పవలయును? ఇచ్చట ఒక విషయమును గమనింపవలసియున్నది. ఆద్యత్వము కేవలము కాలముచే నేర్పడదు. రామాయణ రచనకుఁ బూర్వము ఏవేని కొన్ని గీతముల వంటి రచనము లున్న వనుకొన్నను అవి ఆది కావ్యములు కావు: వానిని రచించిన వారును ఆదికవులు కారు. ఏది స్థిరముగ నిల్చి అనంతర కవుల కందఱకును కావ్యరచనమున మార్గదర్శకము కాఁగలదో అట్టి కావ్యమే ఆదికావ్యమగును; తత్కర్తయే ఆదికవి యగును. మొదటిసారి ఈ కావ్యమును వినిన మహర్షులు ప్రశంసించుచు చెప్పినమాటలలో నీ విషయమే వ్యక్తమగుచున్నది. వా రి ట్లనిరి. "వాల్మీకిచే రచింపఁబడిన ఈ చరిత యాశ్చర్యముగ నున్నది. యథాక్రమముగ సమాప్తమైన ఈ కావ్యము కవులకు పరమమైన యాధారముగ నున్నది."

ఆశ్చర్యమిద మాఖ్యానం
మునినా సంప్రకీర్తితమ్
(శ్లో. 26)

పరమ్ కవీనా మాధారమ్
సమాప్తం చ యథాక్రమమ్॥
.(శ్లో. 27)

బాలకాండ-సర్గ. 4.

రామాయణమునకు పూర్వము గీతముల వంటి రచనము లేవైన నుండినను వానికి నిట్టి సామర్థ్యము లేదు. కావుననే యవి కాలగర్భమున కలిసిపోయినవి. వ్యాసభాసకాళిదాసాది మహాకవుల కెల్లరకును మార్గదర్శకమగుటచే నిది ఆదికావ్య మయ్యెను; వాల్మీకియు నాదికవి యయ్యెను.

14. ఆదికవియైన యీ మహర్షి చరిత్రమును గూర్చి మనకంతగా తెలియవచ్చుటలేదు. ఈయన మొదటిపేరు ఋక్షుఁడు; భృగు మహర్షి వంశమున ప్రచేతసునకు పదియవ కుమారుఁడుగ జన్మించెను. ఈయన పెక్కువేల సంవత్సరములు నిశ్చలముగ తపస్సు చేయుటచే ఈయనకు చుట్టును పుట్ట పెరిగెను. తరువాత గొప్పవర్షము కురిసి ఆ పుట్ట కరిగిపోయి దాని నుండి ఈయన వెలువడుటవలన నీయనకు వాల్మీకియనియు పేరు కలిగెను. వర్షాధిదేవత యగు వరుణునకును ప్రచేతసుఁడను నామము కలదు. అందువలనకూడ నీయన ప్రాచేతసుఁడయ్యెనని కొందఱందురు. ఈ మహర్షిని గూర్చి

రామాయణతిలకము, శిరోమణి, భూషణము అను మూఁడు వ్యాఖ్యలయందును ఇంతకన్నను విశేషము లేమియు కన్పించుటలేదు. ఇప్పుడు వాల్మీకిచరిత్రగ ప్రసిద్ధమైయున్న బోయవాని వృత్తాంతమును ఈ వ్యాఖ్యాతలలో నెవ్వరును పేర్కొనకుండుట గమనింపఁదగియున్నది.

15. మహాకవిశ్రేష్ఠుఁడు విశ్వకవియునైన యీ మహర్షి తనయందు నింత కవిత్వశక్తి కల దని, అది యావిర్భవించునంతవఱకును ఎఱుఁగనే ఎఱుఁగఁడు. శ్లోకరూపమున కవిత్వము ఆవిర్భవించిన తరువాతకూడ నాయన యొక కావ్యమును రచింపవలయునని తలంపలేదు. చతుర్ముఖుఁడు వచ్చి లోకోత్తరచరిత్రుఁడగు శ్రీరాముని చరిత్రమును కావ్యమునుగ వ్రాయుమని యాదేశించినతరువాతనే యాయన కావ్యరచనకు పూనుకొనెను. శ్రీరాముఁడు మూర్తీభవించిన ధర్మము. వాల్మీకిమహర్షి వేదవేదాంగధర్మతత్త్వనిధానము. అందువలన రామాయణకావ్యము సకలవేదధర్మతత్త్వప్రతిపాదకముగ రూపొందినది. ఈ కారణముననే, ''వేదవేద్యుఁడగు పరమపురుషుఁడు దశరథాత్మజుఁగా జన్మింపఁగా, వేదమే సాక్షాత్తుగా వాల్మీకిముఖమున రామాయణముగ ప్రభవించెను'' అని లోకమున ప్రఖ్యాతి కలిగినది. వాల్మీకిమహర్షి ఈ కావ్యమును కుశలవులకు నేర్పునప్పుడు ఈ యభిప్రాయమే వ్యక్తమగుచున్నది. వేదములయందలి ధర్మతత్త్వములను ప్రకాశింపఁజేయుటకొఱకే ఆ మహర్షి కుశలవులకు ఈ కావ్యమును నేర్పెను.

వేదోప బృంహణార్థాయ
తా వగ్రాహయత ప్రభుః॥

బాలకాండ-సర్గ. 4 శ్లో. 6)

కావున ఈ కావ్యమునకు ధర్మతత్త్వప్రబోధరూపమైన లోకహితమే పరమప్రయోజనము ధర్మతత్త్వప్రతిపాదకమై లోకహితమైనదియే మహాకావ్యమగును; తత్కర్తయే మహాకవి యగును.

శ్రీమద్రామాయణ ప్రాశస్త్యము

శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు

శ్రీమద్దివ్యమునీంద్రచిత్తనిలయం సీతామనోనాయకం
వల్మీకోద్భవ వాక్పయోధిశశినం స్మేరాననం చిన్మయం
నిత్యం నీరదనీలకాయమమలం నిర్వాణసంధాయినం
శాన్తం నిత్యమనామయం శివకరం శ్రీరామచంద్రంభజే॥

యఃకర్ణాంజలి సంపుటై రహరహస్సమ్యక్పిబ త్యాదరాత్
వాల్మీకేర్వదనారవిన్దగళితం రామాయణాఖ్యంమధు
జన్మవ్యాధి జరావిపత్తిమరణై రత్యన్తసోపద్రవం
సంసారంసవిహాయ గచ్ఛతిపుమాన్ విష్ణోఃపదంశాశ్వతమ్॥

అని హిందువులచేత నిరంతరము ధ్యానింప బడుచున్న శ్రీమద్రామాయణ ప్రాశస్త్యమును గూర్చి కొన్ని గ్రంథములే వ్రాయవచ్చును. ఎంతవ్రాసినను ఇంకను వ్రాయుటకు మిగిలియే యుండును, ఎంతవ్రాసినను తనివియుతీరదు. ఇట్టిది సంస్కృత వాఙ్మయమందేగాక, భారతీయ వాఙ్మయములందేగాక ప్రపంచవాఙ్మయమందే విశిష్టస్థానమలంకరించి యున్నది. కవిత్వమందేమి, కథామార్గమందేమి నీతిమార్గోపదేశమందేమి ప్రపంచమునకొక ఆదర్శమై భక్తిమార్గమందు అన్నిటిని మించిన తారకరాజమై యలరారుచున్నది. ఈవిషయమునంతయు ఇట్లు మూడుభాగములుగా పరిగణించి సంగ్రహముగా వ్రాయుచున్నాను — కథామార్గము, కావ్యమార్గము భక్తిమార్గమునని.

1. కథామార్గమందు రామాయణము గృహస్థాశ్రమధర్మమును, లోకనీతిని రాజనీతిని సదాచారమును, సత్ప్రవర్తనమును మానవస్వభావమును స్త్రీధర్మమును అతి విపులముగా బోధించుచున్నది.

2. కావ్యమార్గమందు ఆదికావ్యమై తర్వాతి రచయితలకెల్ల ఆదర్శమై శిక్షకమై యొప్పారుచున్నది. రామాయణమునుండియే కాళిదాసాదికవులు నేర్చుకొనిరి.

3. భక్తిమార్గమున శ్రీరామనామము తారకమంత్రము. శ్రీరాముడు శ్రీమన్మహావిష్ణువు నవతారము. అట్టి మహాపురుషుని చరిత్రమును భక్తితో పఠించువారికి ఇంతింతయనరాని పుణ్యమని పురాణములు చాటుచున్నవి. పూర్తిగా రామాయణమును పఠించినను కొద్దికొద్దిగా అందలి భాగములను పఠించినను ఒక్కొక్కదానికిని ఒక్కొక్క ఫలము, కార్యసిద్ధి మానసిక శాంతియు పెద్దలు అనుభవించి చెప్పియున్నారు. హిందువుల కందఱికిని, వీరు వారనక శైవవైష్ణవాది భేదములకు చోటీయక, నిత్యపారాయణ గ్రంథముగా సకలానిష్టనివారకముగాను, ఐశ్వర్యప్రదముగాను నున్నది.

ఇందలి యొక్కొక్క భాగమునకును వివరణము వ్రాసి ఉదాహరణములు చూపుచు రచించినయెడల అదియే యొక పుణ్యకార్యముగా కూడ భావింపదగును.

1. కథామార్గమందు :

వేదములలో పురాణములలో భారతభాగవతములలో ఎన్నికథలో కలవు కాని వేదములు ఎల్లవారికి అందవు, అర్థము కావు. పురాణములు బహువిషయ బోధకములై గ్రంథబాహుళ్యాదులచేతను భిన్నవిషయ బోధకతచేతను సామాన్యులను సూటిగా ఒక లక్ష్యముమీద బుద్ధిని నిలుపునట్లు చేయక సమాధిని చెదరగొట్టుచున్నవి. మహాభారతమును ప్రౌఢబుద్ధులకే గోచరించును. భాగవతము ఎంత భక్తిని బోధించి భగవంతుని యవతారములను భక్తుల మహిమను ఉద్ఘాటించినను వస్త్వైక్యము లేనందున లక్ష్యమునకు తప్పిపోవుచున్నది. అట్లుగాక పూర్తిగా గుఱిగా చదివి, ధ్యానించి అనుభవించుటకు రామాయణమందలి కథయు, కథలోని వస్త్వైక్యమును అనుకూలించినట్లు మిగిలినవి అనుకూలింపవు. 'సుఖాత్ అల్పధియామపి' అన్నట్లు మందబుద్ధులకుగూడ, పండితులకేగాక పామరులకు గూడ, వృద్ధులకేగాక బాలురకు గూడ, పురుషులకేగాక స్త్రీలకుగూడ–ఇంతేల వీరువారనక హైందవేతరులకుగూడ సులభగ్రాహ్యమై, చర్విత చర్వణముగుకోలది నవనవోన్మేషమై బుద్ధికి ప్రకాశమిచ్చి ఆనందము కలిగించుచున్నది.

కావ్యమెవరెంత చక్కగా రచించినను దాని ప్రయోజనము నెఱవేఱవలయునుగదా. అట్టి ప్రయోజనములలో ఉపదేశమును ముఖ్యమైనదిగా మనవారు పాటించినారు. అది అతి సుకుమారముగా కాంతాసమ్మితముగా నుండవలయు నన్నారు. పిల్లలుకూడ కథలువిన్నట్లు ఆజ్ఞలను నీతులను వినరు. కథామార్గమున నీతిని బోధించుట చక్కెరపూసి చేదుమందిచ్చుటవంటిది. వట్టి చేదుమందు ఆరోగ్యకరమేమైనను చాలమంది త్రాగరు. కథ అట్టి చక్కెరవంటిది. కావుననే ఆ మహానుభావుడెవడో "యఃకర్ణాంజలి సంపుటైః" అన్నశ్లోకమున రామాయణాఖ్యం మధువని దీనిని తేనెకు పోల్చినాడు. కష్టసుఖములు మానవులకు సహజములు. 'మేలుచేయువాడు మేలునుపొందును కీడుచేయువాడు కీడుపొందు' అన్నది కథలో చక్కగా చెప్పవచ్చును. శ్రోతలు కథలు వినునప్పుడు తమ చరిత్రములనుకూడ ఆయా సందర్భములలో స్మరించుచుందురు. రామాయణమును ఆదర్శపురుషుడైన శ్రీరామునియొక్కయు అట్లే పతివ్రతాలలామమైన సీతాదేవియొక్కయు చరిత్రముగా వాల్మీకి చిత్రించినాడు. ఇక్కట్టులలో ఎట్లు మెలగవలయునో ఎట్లు నడుచుకొనవలయునో కథ తెల్పునట్లుగా కవి నిబంధించినాడు. ఇది పాత్ర పరిశీలనచే తెలియును.

దశరథుడు చక్రవర్తి. ఇతనిలో రాజధర్మమును, పితృవాత్సల్యమును, సత్యవాక్యపరిపాలమును కవి ప్రదర్శించినాడు. లోకపాలనమును ధర్మముతప్పక నెఱవేర్చుటయేగాక కైకేయికిచ్చిన మాటను కాపాడుకొనినాడు. కుమారుని తననోటితో నడవికి పొమ్మనలేక బాధపడినాడు. రాముడన్ననో ధర్మబద్ధుడు. తనహృదయము నెఱిగి ఎట్టి అడ్డమును పలుకక అడవికి బయలుదేఱి తండ్రి సత్యమును కాపాడెను. ఎదురుతిరిగి యుండరాదా, ఆక్షేపించియుండరాదా, లేదు. రాజ్యముకన్న ధర్మమేగొప్పది.

రామాయణమందు కైకేయీపాత్ర కీలకస్థానము నాక్రమించుచున్నది. ఆమె వరము లడుగనిచో కథయే లేదు. ఆమెలో తప్పేమి? అది స్త్రీస్వభావము. ఉత్తమక్షత్రియాంగన, రాముని హృదయపూర్వకముగా ప్రేమించినట్టిది, ఆతని ఆధిక్యము నెఱిగినట్టిది, కౌసల్యయందెంతో గౌరవము గలది, రాముని యభిషేకవార్తవిని సంతోషించినట్టిది, నిష్కపటి మంథర దుర్బోధనలచేతగదా దుర్బుద్ధియైనది. అందఱును మంచివారే, సందర్భములనుబట్టి చెడ్డవారగుదురనుటను కవి తెల్పినాడు. తన కుమారునికి రాజ్యమడిగి ఆతడు దానిని వలదని తన్ను దూషించినప్పుడు తెల్లబోయినది. కుమారుని హృదయము నెఱిగియుండిన అడిగియుండదేమో! సమయమునకు భరతుడు లేకపోవుటయు కథ పెరుగుట కవకాశమిచ్చినది. ఆతనిగుఱించి ఎవరును ఆలోచించినట్లు కానరాదు. రాజ్యమును సంతోషముతో గ్రహించునని అందఱు తలంచినట్లున్నారు. ఎంత పొరపాటు! వాల్మీకి స్త్రీపాత్రచిత్రణములో కైకేయిని చిత్రించి కాళిదాసునకే గురువనిపించుకొన్నాడు.

సీతాదేవి ఆదర్శగృహిణి. భర్తచిత్తవృత్తిననువర్తించినది. సీతయే కైకేయీస్థానమందుండినయెడల ఆవరములను అడిగియుండదు. వరములుగావు, తన సంతోషముగాదు తనకు కావలసినది భర్తయొక్క ఆనందము. తన్ను భర్త త్యజించినందులకు చింతింపలేదు, లోకనిందకు చింతించినది. తనలో దోషములేదని ఋజువుచేసి నిష్క్రమించినది. కౌసల్యాసుమిత్రాదులలో సామాన్యగుణములేగాని విశే

పాంశములకు తావులేదు. కాని వారుకూడ ఎదురుతిరుగ లేదు. లోకముతో పాటు చింతించిన వారుమాత్రమే. మిగిలినపాత్రలంతయు ఆదర్శ ప్రాయములుగా నుండియు మానవస్వభావోచితములుగా నున్నవి. రాముని తర్వాత అంతటివాడు భరతుడు. అంత సులభముగా అప్రయత్నముగా తనకబ్బిన రాజ్యమును అన్నమీది భక్తిచే అనుభవింపక అన్నకొఱకే కాపాడినాడు.

రావణునియందు వాల్మీకి ప్రతినాయకుని గుణములను భావి నాటకకర్తలకెల్ల ఆదర్శ ప్రాయముగా వర్ణించినాడు. ఎంతటివాడు! ఎంత సుగుణసంపత్తి యుండియేమి, ప్రమాదమునకు లోనైనచో వధ్యుడేగదా. అట్లే వాలియు. లక్ష్మణభరతులలో ఎంతభేదము కలదో విభీషణకుంభకర్ణులలో అంత కలదు. వీరిరువురును సహోదరప్రేమకలవారే. ధర్మబద్ధులుగాను సందర్భోచితముగాను మెలగినారు. మూఢులుకారు, ప్రాజ్ఞులు. ఒకడు అన్నను వదలలేదు; ఇంకొకడు భగవంతుని శరణుజొచ్చినాడు. కుటుంబములలో సౌభ్రాత్రము ఎన్నిభంగులో రామాయణము చూపుచున్నది. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు, రావణకుంభకర్ణవిభీషణులు, వాలిసుగ్రీవులు, కుశలవులు, ఎంత వ్యత్యాసము, స్నేహము తోడి అభిప్రాయభేదములు, భీతితోడి కలయికలు, కపటమెఱుగని ప్రవర్తనలు, దుష్ప్రవర్తకునియందనుతాపము, తనప్రార్థనను త్రోసిపుచ్చినందులకు దుఃఖము – ఇట్లు త్రోసిపుచ్చరాని ఇఱుకటములు, తప్పరాని పరిణామములు–ఈవిధముగా నిత్యజీవనమునకును మానవస్వభావమునకును, దైవనిర్ణయమునకును ప్రతిబింబమనదగి రచింపబడినది రామాయణము.

2. కావ్యమార్గమందు :

రామాయణము ఆదికావ్యము. ఇది రచనకు వ్రాయునట్టి వక్కణకు సంబంధపడినట్టిది. ఎట్లు వ్రాయవలయును, ప్రారంభమెట్లు, విషయవిభజనమెట్లు, వర్ణనాంశములెట్లు, ఏయే రసమునకు ఏయే వృత్తము నుపయోగించిన మనోహరముగా నుండును, పదములకూర్పెట్లు–ఇత్యాదుల నాలోచించి వ్రాయవలసినది కావ్యము. ఛందస్సు అనాది. ఛందస్సనగానే వేదము. అనుష్టుప్పు వేదములలోనే కలదు. కాని మూడుపంక్తులు. అట్టి ఛందములో అప్రయత్నముగా నొక సన్నివేశములో, తన నోట నాలుగుపంక్తుల శ్లోకము వెడలుటయు, అందులకు తానును సమకాలికులును ఆశ్చర్యపడి, తాను కావ్యనిర్మాణాసక్తుడై, ఎవరి చరిత్రము వ్రాయుదునా యని తలంచి—

"కోన్వస్మిన్ సాంప్రతంలోకే
గుణవాన్ కశ్చవీర్యవాన్
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ
సత్యవాక్యో దృఢవ్రతః
చారిత్రేణచకోయుక్త
స్సర్వభూతేషు కోహితః
విద్వాన్ కః కస్సమర్థశ్చ
కశ్చైకప్రియదర్శనః,
ఆత్మవాన్ కోజితక్రోధో
ద్యుతిమాన్ కోఽనసూయకః
కస్య
జాతరోషస్య సంయుగే,
ఏతదిచ్ఛామ్యహంశ్రోతుం
పరంకౌతూహలంహిమే
మహర్షేత్వం సమర్థోసి
జ్ఞాతుమేవం విధంనరమ్"

అని నారదమహర్షి నడిగెను. అందులకు నారదుడిచ్చినబదులు, సీతారాములవర్ణనయు చూడగా, ఏకావ్యమందుగాని నాయికా నాయకు లిట్లుండవలయునను నొకభావమో దానిననుసరించి నియమమో సంప్రదాయమో నాటికే కుదిరినట్లు తేటపడుచున్నది. శ్రీరాముడు ఆదర్శపురుషుడు ఏకపత్నీవ్రతుడు. అది నాయకలక్షణము.

ఈ కావ్యము ఆఱుకాండలుగా విభక్తము. 24000 శ్లోకములు, 500 సర్గలు. కావ్యరచనలో కాండములు, పర్వములు, లంబకములు ఇత్యాదులు గలవు. వేదములు సంహితలు, శాఖలు, అనువాకములు ప్రపాఠకములు, అర్థములు పనసలుగా విభక్తములు. పురాణములు సంహితలు, ఖండములు పిటకములుగా విభక్తములు. భారతము శతపర్వములు, తర్వాత పదునెనిమిదిపర్వములు. అమరము రామాయణమువలె కాండలుగా విభక్తము. ఈవిధముగా కవులు వ్రాయుచుండిరి. తమిళములోని పెరుంగదైయనబడుబృహత్కథానువాదము ఆఱుకాండలు; లంబకములును తరంగములును కాశ్మీరపండితులవి. కాళిదాసాది కవులు కాండములనువదలి సర్గములను మాత్రము గ్రహించిరి. మహాభారతముకూడ కావ్యమే. కావ్యవిభజన ఎట్లెట్లు జరిగెనో ంచిన వినోదముగా నుండును. కావుననే విన్నకోట పెద్దనాదులు—

"సర్గబంధంబు కావ్యంబు సంస్కృతమునఁ
బ్రాకృతంబున నాశ్వాసభాసురంబు,
నాటకములెల్ల నంకసనాథకములు
గద్యముచ్ఛ్వాసలంబకాం కంబయంద్రు."

ఉల్లా 4-7

అని వ్రాసినారు. ఇందు అందఱును వాల్మీకిని అనుసరించినవారే,

తర్వాత అష్టాదశ వర్ణనాదులు—

"పురవారాశి మహీధరర్తు శశభృ
త్సూర్యోదయోద్యానపు
ష్కరకేళీ మధుపాన మోహన వియో
గక్షేమయాన స్వయం
వరపుత్రోత్సవ మంత్రదూత్య రణ దో
ర్వైరిక్రాంతి సంకీర్తనా
కరమష్టాదశ వర్ణనాన్వితము త
త్కావ్యంబు భవ్యంబిలన్"

ఈ పదునెనిమిదియు కాళిదాసాదులు వాల్మీకినుండి గ్రహించి పెంపొందింపగా దండ్యాదులు అనుశాసించిరి. గ్రంథగుణదోషములకు జూచి త్యానౌచిత్యజ్ఞానమునకు, ఎన్నిటికో పూర్వకవులు రామాయణమునుండి ఎంతో గ్రహించిరి. ఒక కాలమున కావ్య స ప్రారంభము చేయునప్పుడు రామాయణముతో ప్రారంభించెడువారట. బిల్హణ చరిత్రమందు మదనాభిరామనృపతి తనకుమార్తెకు యామినీపూర్ణతిలకకు సంగీత విద్యానిపుణకు సాహిత్య విద్యాభ్యాసము చేయించుటకు బిల్హణకవిని నియమించెను. ఆతడు రామాయణముతో ప్రారంభించెను.

"తత్రాగత్యనరాధిపః శుభదినే
సమాత్యా బుధాః
దృష్ట్వాతాం స్వసుతాంచ బిల్హణకవిం
శీఘ్రం సమానాయయత్
వాగ్దేవీపరిపూజనం ప్రథమతః
కృత్వాచరామాయణ
ప్రారమ్భంకృతవాన్ సబిల్హణకవిః
సానుగ్రహః సత్కృతః"

దీనింబట్టి విద్యాప్రారంభదశయందే రామాయణమును చదివించుచుండిరని తెలియుచున్నది. ఒకవేళ నిది బాలరామాయణమైనను కావచ్చును.

పైగా ఈకావ్యమందే కవిమహిమ చెప్పబడినది. మదనాభిరామ నృపతి పండితులను పిలిపించి ఇట్లడిగెను—

"బుధా, యూయంసర్వే
ననుమమసుతాం కావ్యనిపుణాం
రసాలంకారజ్ఞాం కురుత
నితరాం ప్రీతమనసః"

అందులకు వారిట్లనిరి—

"రసజ్ఞానైవస్త్రావయ,
ముత్తరసజ్ఞాస్తుకవయః"

అందులకు మరల రాజు 'కవిత్వం కింనాస్తి!' అని యడుగగా వారేమిచెప్పిరో చూడుడు. 'ప్రవిశతికథం ఛాన్దసకులే?' తర్వాత,

"నైవవ్యాకరణజ్ఞమేతి పితరం,
నభ్రాతరం తార్కికం,
దూరాత్ సంకుచితైవ గచ్ఛతి
యథాచణ్డాలత శ్ఛాన్దసాత్,
మీమాంసానిపుణం నపుంసకఇతి
జ్ఞాత్వానిరస్యాదరాత్
కావ్యాలంకరణజ్ఞమేవ కవితా
కన్యావృణీతేస్వయమ్'

అనిపలికి బిల్హణుని ఎఱుకపఱిచినారు. అట్టి కవితాకన్య 'మానిషాద' శ్లోకరూపమున ఏ మహాత్ముని వరించినదో, ఎవనికావ్యము కవికుల గురువునకే ఆదర్శమాయెనో ఆతనికావ్య ప్రాశస్త్యమును గుఱించి చెప్పుట సముద్రమునకు ఏతము వేయుటవంటిది. చూచి,చదివి అనుభవింపవలసినదే. అది మధురము, మధురాక్షరము. కవితాశాఖ నధిరోహించిన వాల్మీకి కోకిలకూజనము.

3. భక్తిమార్గమందు:

"చరితం రఘునాథస్య
శతకోటి ప్రవిస్తరం
ఏకైకమక్షరం ప్రోక్తం
మహాపాతక నాశనమ్."

శ్రీరామప్రాతిపదిక
మవశేనాపి సంగృణన్
ముక్తిం ప్రాప్నోతిమనుజః;
కింపున ర్బుద్ధి పూర్వకమ్"

ఇదే వాల్మీకిచరిత్ర. వాల్మీకి తొలుత ఋషిగాదు. ఆయనపేరును అదికాదట. భృగువంశమందు జనించినందున భార్గవుడనియు, ప్రచేతసుని పుత్రుడగుటచే ప్రాచేతసుడనియు, నామధేయము. రత్నాకరుడనియు అధ్యాత్మరామాయణమునందున్నది. బ్రాహ్మణుడుగా జనించియు వ్యాధజీవితము గడపి దారిదోపిడి చేయుచుండ సప్తర్షులు తారసిల్లి శ్రీరామమంత్రోపదేశము చేయగా, ఆ నామమునే నోరు తిరుగనందున వారు 'మరా' యన, నట్లే జపించుచుండెనట. తనచుట్టు పుట్ట (వల్మీకము) పెరిగినందున వాల్మీకియై, ఋషియై, కవియై, 'నానృషిః కురుతేకావ్యమ్' అన్నట్లు నారదోపదేశమున రామాయణకవి యాయెను. ఇదంతయు నామజః మహిమయని పెద్దలు నిర్ణయించినారు. ("శ్రీరామజపమహిమ ప్రకాశకో భగవాన్ వాల్మీకిః...కశ్చిన్నిషాదః సప్తర్ష్యుపదేశేన రామనామజపన్ వనేతస్థౌ. తత్కాలాత శరీరే వల్మీకమభూత్, తతఃకతిపయకాలేగతే సప్తర్ష య స్తద్వనమేత్య కిరాత తపస్స్థానమితి తత్రాగత్య వల్మీకందృష్ట్వా కిరాతాహ్వానం

చక్రుః... రామనామ జపమహిమ ప్రాప్తముని భావో వాల్మీకిరితి ప్రథితోఽభూదితి పద్మపురాణే)

అంతేగాదు పారాయణయోగ్యము సంస్కృత రామాయణమే. దాని యనువాదమో, అనుసరణమో, సారమో పనికిరాదు.

"సంస్కృతం రామచరితం
పరిత్యజ్యనరాధమః
పరభాషాన్తరకృతం
మృగతృష్ణా జలంపిబేత్"

కించ- "పరభాషాన్తరకృతం
కథంతరతిపాపధీః
క్షున్నివృత్తిర్భోజనేన
వినాతత్కథయాకథమ్ ?"

ఇట్టిలయన్న, ఇందు గాయత్ర్యక్షరములు గలవు. అవి 24. మొత్త మిరువదినాలుగు వేల శ్లోకములలోను ఒక్కొక్క వేయికిని మొదటి దాని అందలి యక్షరములలో నొకటి వరుసగా వచ్చునట్లు రచింపబడినది ఈ కావ్యము. 'అస్య చాధికారిణా స్సదాజప్యం రామాయణమేవేతి దర్శయితుం గాయత్ర్యర్థోఽత్ర ప్రతిపాద్యతే.- తథాహి, బాలకాండే వేదప్రసిద్ధ జగత్ప్రసూతి హేతుభూత భగవత్స్వరూప వర్ణనాత్తత్స వితృశబ్దార్థః, అయోధ్యాకాండ కిష్కింధా కాండయో ర్గుణగణ వర్ణనాద్వరేణ్యశబ్దార్థః, అరణ్యకాండే తేజోమయ శరీరవర్ణనాత్ భర్గశ్శబ్దార్థః, సుందరకాండే దివ్యమంగళ విగ్రహ లక్షణ వర్ణనాద్దేవ శబ్దార్థః. యుద్ధకాండేధీమహి శబ్దార్థః శరణాగత్యుక్తేః, ఉత్తరకాండే ముక్తి ఫలకీర్తనాత్తృతీయపాదార్థః ఇతి...

సకలశ్రుతి సారభూత గాయత్రీ మహామంత్ర వర్ణనిబద్ధత్వేన నిఖిలమంత్ర సారభూతత్వాదేతస్య శ్రీరామాయణస్య అహరహర్నియమతఃపఠనే ద్విజశబ్దవాచ్యాః . తేషుచ బ్రాహ్మణాది చాతుర్వర్ణ్యేషుశఠా అగురుభక్తా అవిష్ణుభక్తా అనీశ్వరభక్తా శ్చంచలచిత్తా అనృతవాదినః కృతఘ్నా ఆతతాయినః అనియమవ్రతినః అన్యవ్రతనిష్ఠా వేదనిందకాభృతకాధ్యాపకా భృతకాధ్యాయినః ఘాతుకాః పిశునా స్తస్కరా అభిశస్తా దుష్టా ఇత్యాదయో నియమతః పఠనేశ్రవణేచ నాధికారిణః"

ఇందువలననే భారత భాగవతాదులకన్నను లోకములో రామాయణమే ఎక్కువగా పారాయణము చేయబడుచున్నది. బ్రహ్మాండపురాణమందు రామాయణము నిఖిలశ్రుత్యర్థ ప్రతిపాదకమని కలదు. రామాయణ లేఖకునకు గొప్ప ఫలముకలదు—

"భక్త్యారామస్య యే చేమాం
సంహి కమ్
లిఖంతిచ మహాత్మాన
స్తేషాంవాస స్త్రివిష్టపే"
యు. కాం. స. 131 శ్లో. 124.

తత్త్వసంగ్రహ రామాయణమందు—

"రామాయణస్య గ్రం
యేలిఖన్తి మహీతలే
తేషాం దేవి మయాసార్థం
నివాసః పరమాత్మని."

ఇంకను పఠనాదులకు యోగ్యాయోగ్య వారాదులు, మాసనిర్ణయము, మాధ్యనిషేధము, దేశము, ఆచార్యలక్షణము, స్త్రీ వినువారెట్లు వినవలయును ఇత్యాదులన్నియు పరంపరగా వచ్చునట్టివి పురాణములు చెప్పుచున్నవి. అద్వైతులు విశిష్టాద్వైతులు ద్వైతులు వారివారి సంప్రదాయముల ప్రకారము భక్తితో పారాయణము నేటికిని చేయుచున్నారు. పలు

వురు పూర్వము రామాయణ పుస్తకదానము చేయుచుండిరి.

ఇందు ఒక్కొక్క కాండకును ప్రత్యేకముగా ఫలములు చెప్పబడియున్నవి. రాములవారి తర్వాత ఆంజనేయుడు ఉపాస్యదైవము. పలువురు తాముద్దేశించిన కార్యములసిద్ధికై సుందర కాండమును పారాయణము చేయుచున్నారు.

ఇట్టి యీ మహాగ్రంథము దేశాంతర ఖండాంతరములకు వ్యాపించినది. అనంతరకవుల కావ్యములలో రసానుగుణములైన మార్పుల నందినది బహునాటకకర్తలచే భిన్నరీతుల రచితమై ప్రదర్శితమగుచుండినది. చిత్రలేఖ నాదులకును శిల్పములకును ఎక్కి ఊరూరను వీథివీథిలోను రామాయణ కథాభాగములు చిత్రింపబడినవి. ప్రతియింటియందును విగ్రహములు వెలసినవి. ఊరూర దేవాలయములు కట్టబడినవి. ఇట్లు రామాయణ ప్రభావము భారతదేశమందు భారతిజాతిమీద వేళ్లుపాతి నిలిచి భారతీయులను రక్షించుచున్నది. మున్ముందును రక్షింపగలదు.

రామాయణంపై యోగదృష్టి

విద్యాభాస్కర శ్రీ యల్లంరాజు సుబ్బారావుగారు

ఉత్తమసాహిత్యగ్రంథాల్లో పాఠకుల్లో జ్ఞానుల నాకర్షించే ఘట్టాలు ఎన్నో ఉంటాయి. రామాయణకావ్యంకూడా ఇలాంటిదే. రామాయణకావ్యాన్ని ఎందఱో మహనీయులు ఎన్నో కోణాల్లో పరిశీలించి సమీక్షించారు. ఈ సమీక్షలవల్ల సాధకుల శ్రమతోబాటు ఎన్నో ఆణిముత్యాలు బయటపడ్డాయి.

రామాయణమంటే రామునికథగా ప్రశస్తికెక్కింది. అయనం అంటే పథము. యోగుల దృష్టిలో రామ పూర్వతాపనిఉపనిషత్తులో రామశబ్దం ఇలా నిర్వచింపబడింది—

'రామపదే నాసౌ పరబ్రహ్మాభిధీయతే'
'ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా'

అందుచేత భక్తులసౌలభ్యంకోసం పరబ్రహ్మ రామరూపంలో సాక్షాత్కరించాడని యోగుల నిర్వచనం. ఆలాగే సీతోపనిషత్తులో 'సీతా భగవతీ జ్ఞేయా, మూలప్రకృతిసంజ్ఞితా' అని పేర్కొనబడింది. సీత అంటే పరమాత్మయొక్క మూలప్రకృతి, మాయ. యోగమంటే ఆ మాయావరణాన్ని ఛేదించి పరమాత్మలో లీనం కావడమే.

యోగులదృష్టిలో రామాయణం ఒకవిశిష్టమయిన ఉపాసనాగ్రంథం. వారిదృష్టిలో రాముడు పరమాత్మ; ఆయన జన్మించిన అయోధ్య మనస్సు; సీతయే జీవాత్మ ఐదు జ్ఞానేంద్రియాలు ఐదుకర్మేంద్రియాలస్వరూపమే దశకంఠుడయిన రావణుడు. ఇతని చేతిలోనే సీత బంధింపబడింది. రావణుని చెరనుండి బందీరూపమయిన జీవాత్మకు (సీతకు) వాయునందనుడయిన హనుమంతునిసాయంతో విముక్తి జరుగుతుంది. ఈ హనుమంతుడే యోగము. ప్రాణాయామంద్వారా 24 వేల శ్లోకాలు కలిగిన వాల్మీకిరామాయణమనే

గాయత్రీ మంత్రోపాసనద్వారానే యోగ రూపుడయిన హనుమంతుడు జీవాత్మరూప మయిన సీతను చెరవిడిపించగలిగాడు. గాయత్రీ మంత్రానికి మూలమయిన 24 అక్షరాలే వాల్మీకిరామాయణంలో 24 వేల శ్లోకాలుగా మారాయి. వాల్మీకి రామాయణమంటే గాయత్రీమంత్రోపాసనయే.

బహుళంగా ప్రచారంలో లేని ప్రమాణాలవల్లకూడా ఈ రహస్యం వెల్లడిఅవుతుంది. అధ్యాత్మరామాయణంలో ఆనందరామాయణంలో వాల్మీకిజీవితచరిత్ర వర్ణించబడింది. తొలిజన్మలో వాల్మీకి స్తంభుడనే బ్రాహ్మణుడు. ఈయన 'శకల' అనేపట్టణంలో నివసించేవాడు. ఈయనకు భార్యయు మఱొకవేశ్యయు ఉండేవారు. ఈయన తర్వాత జన్మలో బోయవాడుగా జన్మించాడు. తొల్లి వేశ్యయే భార్యగా జన్మించింది. మూడవజన్మలో కృణుమహర్షికుమారుడుగా వాల్మీకి జన్మించాడు. కాని తల్లి ఒక ఆడసర్పం. అరణ్యంలోని బోయలు ఆయన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారు. తండ్రి బ్రాహ్మణుడయినా, ఈయన శూద్రస్త్రీని వివాహమాడాడు. ఆమెవల్ల చాలామంది సంతానంకూడా కలిగింది. తర్వాత ఆయన దొంగలముఠాలో చేరాడు. ఈ ముఠాలో ఉండగనే యీాయనకు సప్తమహర్షుల దర్శన భాగ్యం కలిగింది. పాపపంకిలమయినజీవితాన్ని త్యజించమని వారు ఈయనకు ఉపదేశించారు. ఋషుల ఉపదేశంవల్ల, సంసర్గవల్ల జ్ఞానోదయమైము కికోసం వాల్మీకి వారిపాదాలపై మోకరిల్లాడు. వారు వాల్మీకికి రామమంత్రాన్ని అపసవ్యంగా ఉపదేశించారు. (మరా) బోయడయిన వాల్మీకి ఈ మంత్రాన్ని వేయియుగాలు జపించాడు. తిరిగి ఋషులు వచ్చేసరికి ఈయన పైన పుట్ట పెరిగిపోయింది. ఈ పుట్టవల్లనే ఈయనకు వాల్మీకి అనే పేరు సార్థకమయింది.

వాల్మీకి పైమూడు జన్మలను పరిశీలించి యోగులు మూడు రహస్యాలను వెల్లడించారు. మొదటి జన్మను భక్తియోగంగా, రెండవ జన్మను కర్మయోగంగా, మూడవజన్మను కుండలినీయోగంగా పేర్కొన్నారు. కామవాసనలు మిగిలియున్న కారణంగా ఆయన శూద్రస్త్రీని వివాహ మాడాడని, బోయరూపంలో ఉన్నందున బంధాల నన్నింటిని ఛేదించగలిగాడని వారు నిర్ణయించారు. రామమంత్రాన్ని తలక్రిందులుగా ఉపదేశించడంలోకూడా యోగదృష్టి ఇమిడి ఉంది. 'మ' అంటే సాత్త్వికమాయ. దీనిని అతిక్రమిస్తేనే 'రా' (స్వచ్ఛమైనప్రకాశం) అనే జ్ఞానాన్ని పొందగలము. రామాయణంలోని ఆఱుకాండలు మూలప్రకృతిస్వరూపిణి అయిన సీత గాథనే వర్ణిస్తాయి. ఉత్తరకాండలో రాముడి పరబ్రహ్మస్వరూపం వర్ణించబడింది. సర్పాకారమయిన పుట్టనుండి బయటికి రావడం వల్లనే వాల్మీకి ఈ జ్ఞానయోగాన్ని పొందగలిగాడు.

నారదుడు వాల్మీకికి రామాయణతత్త్వాన్ని బోధించాడు. నారదుడు అంటే మహత్తత్త్వాన్ని ప్రసాదించేవాడు. (నారం దదాతీతి) నారం అంటే మహత్తత్త్వం. నారదుని వీణయే యీామహతి. భగవంతుడే తన స్వరూపాన్ని మాయలో ముంచివేసి, మహత్తత్త్వాన్ని సృష్టించాడని, ఈతత్త్వమే అంధకారాన్ని పాఱద్రోలి స్వయంప్రకాశమయిన ఆత్మను వెలికి తీసిందని భాగవతంలో వర్ణించబడింది. తపస్సువల్ల పునీతుడై, వాల్మీకి పరతత్త్వాన్ని అవలోకించగలిగాడని, యీారూపంలో నారదుడు ఆయన ముందు సాక్షాత్కరించాడని యిందలి భావం.

రామాయణం తమసానదీతీరంలో జరిగిన సంఘటనతో ప్రారంభమవుతుంది. తమస్సు అంటే అజ్ఞానం. రామాయణంలోని మొదటి

శ్లో. మానిషాద ప్రతిష్ఠాం త్వ
మగమః శాశ్వతీః సమాః,
యత్ క్రౌంచమిథునా దేక
మవధీః కామమోహితమ్

ఈ శ్లోకంవల్లనే కావ్యంలోని ఉద్దేశ్యం - కథావస్తువు, ప్రయోజనాలు విశదమవుతాయి. ఈ రెండు క్రౌంచపక్షులే జీవాత్మ, పరమాత్మలు. జీవుడు కర్మయోగంవలన తరించవలసి ఉంటుంది. అందుచేతనే కర్మాచరణ. బోయవాడే నిశ్చలమైన వీడని ఆత్మస్వరూపుడు.

రామాయణం ఏడుకాండలుగా విభజింప బడింది. జ్ఞానయోగంలోని యేడు భూమికలే పై కాండలు-సుభేచ, విచారణ తను- మానసి, సత్వాపత్తి, అసమ - శక్తి, పదార్థ - భావన, తుర్యగ.

పై వివరాలనుబట్టి రిశీలిస్తే, రామాయణం ఒక ఉత్తమ యోగశాస్త్ర గ్రంథంగా గోచరిస్తుంది. దీని ధ్యేయం బ్రహ్మసాక్షాత్కారం. ధ్యాన, సమాధి, ధారణవల్లనే గాకుండా - గాయత్రీ మహాయోగం ద్వారా కుండలినీ శక్తిని మేల్కొలిపి పై ధ్యేయాన్ని పొందవచ్చును. దీనికి ప్రమాణంకూడా రామాయణంలోనే లభిస్తుంది—

శ్లో. సత్యమేత ద్వి దిత్వాతు
శ్రోతవ్యం నియతాత్మభిః,
గాయత్ర్యాశ్చ స్వరూపం త
ద్రామాయణ మనుత్తమమ్.

రాముని ధర్మానుష్ఠానము

శ్రీ కేతా వసంతరవీంద్రనాథ

ధర్మసంస్థాపనార్థము జన్మించిన శ్రీరామచంద్రునకు మానవజాతి ఎంత ఋణపడియున్నదో వర్ణింప నశక్యము. శ్రీరామచంద్రుని గొప్పతనమునుగూర్చి ప్రసంగింపని-అతని నామమును జపింపని-అతని జీవితమునకు సంబంధించిన స్థలములను దర్శింపని-హైందవుని చూడజాలము. శ్రీరామునిగూర్చి వెలువడిన సాహిత్యము, అతనిపట్ల భారతీయులకుగల భక్తిభావమును వెల్లడిచేయుచున్నది. శ్రీరాముని ప్రబోధము యుగయుగములుగా ప్రజల మనస్సులను రంజింపచేయుట మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయము. రామాయణము కాలక్రమమున భారతభాషలలోనుండి ఇతరభాషల లోనికి అనువదింపబడి, అత్యంతాదరము నొందుట, ఎంతయేని ఆనందింపదగ్గ విషయము. అణుయుగప్రభావము శ్రీరామునిపట్ల ప్రజలకుగల ఆదరమును ఏమాత్రము తగ్గింపలేక యున్నది. ప్రతిదినము కోట్లకొలది జనులు రాముని గుణగణములను ప్రశంసించుచు అతనిపట్ల తమ భక్తిని వెల్లడిచేయుచునేయున్నారు. రామనామజపము వలన మనము పొందు హృదయప్రశాంతతగూర్చి ప్రస్తావింప నవసరములేదు. అది ప్రతియొక్కరికిని ఏదైన నొకసమయమున అనుభవమై యుండును.

అతివేగముగ మాఱుచున్న ఈ ప్రపంచమున శ్రీరామచంద్రుడు శాశ్వతమైన స్థానము నలంకరించుటకు కారణము, వివిధవ్యక్తిత్వములు గల పలువుర ఆకర్షించు అతని శీలమే. పుత్త్రుడుగను, సోదరుడుగను, భర్తగను, స్నేహితుడుగను, వీరుడుగను, ప్రభువుగను, శ్రీరామచంద్రుడు ఆదర్శప్రాయుడు. పుత్త్రుడుగ పితృవాక్యపరిపాలనయే తన కర్తవ్యముగా నమ్మినవాడీ దశరథరాముడు. సోదరుడుగ తన తమ్ముల్లను ఎంతయో ఆదరించి, వారికొఱకై ప్రాణమైన చేయ సంసిద్ధుడైనవాడితడు. భర్తగ తన సతిపట్ల అత్యంతానురాగము కలిగియుండి ఏకపత్నీవ్రతమాచరించినవాడీ సీతారాముడు. స్నేహితుడుగ సుగ్రీవాదులకు హితమొనర్చిన వాడీ రాముడు. జగదేకవీరుడుగ పేరుగని, దశకంఠాది ఘోరరాక్షసులను దునుమాడిన వాడీ కోదండరాముడు. ప్రభువుగ ప్రజల హితమునకై పాటుపడి, ఆదర్శవంతముగ పాలననొనర్చెను ఇంతియేకాక ధర్మమును త్రికరణశుద్ధిగా నాచరించి తదనుష్ఠానము వలన ప్రతిమానవునకు ఆదర్శప్రాయుడైనాడు. మానవునకు ధర్మము ఆహారమునకంటె ముఖ్యమైనదని నిరూపించిన మహావ్యక్తి ఇతడు

హిందూమతమును క్షుణ్ణముగ నర్థము చేసికొనుటకు అనేకగ్రంథములు కలవు. కాని, వానిని మధ్యమాధములు అవగాహనచేసికొన లేరు. అట్టివారికి హిందూమతధర్మములను బోధపఱచుటకై పుణ్యమూర్తి శ్రీరాముడు మానవుడై జన్మించి, మానవులతో అతిసన్నిహితముగ సంచరించి, మానవులకు ఆదర్శపురుషుడైనాడు. శ్రీరామచంద్రుడు మతధర్మములను అనుష్ఠించి, ప్రజలకు ఈ విషయమున మార్గదర్శి అయినాడు.

ఆచరింపబడనినాడు ధర్మమునకెట్టి ప్రాముఖ్యమునులేదు. ఒకవ్యక్తి తన జీవితమున సత్యధర్మములను ఆచరించుటచే మతప్రాముఖ్యమును వెలికిదెచ్చును. శ్రీరామచంద్రుడు సత్యధర్మములను త్రికరణశుద్ధిగా నాచరించెను. శ్రీరామచంద్రుడేదిచేసినను అది సత్యప్రకాశమునకును, ధర్మసంస్థాపనకు చేసెననెడిది గమనార్హము. శ్రీరాము డాచరించిన కార్యము ధర్మముగను, అత డాచరింపనికార్యము అధర్మముగను ఎన్నబడుచున్నది.

వేదములను, ఉపనిషత్తులను పఠించి, వాని సారమును గ్రహించుట సులభమైన కార్యము కాదు. వానియందలి ధర్మములను క్రోడీకరించి, జనులకు బోధింపవలసిన యవసరమేర్పడినది. శ్రీరాముని జీవితఘట్టము లనేకములు, ఈ ధర్మములను బోధించుచున్నవి. వేదధర్మములను శ్రీరాముడు పాటించినవిధము మిక్కిలి ఆకర్షకమైనది. మానవజాతిచే వేదసారమును గ్రహింపజేయుటయే రామావతారముయొక్క యుద్దేశ్యము. ఆత్మపరిత్యాగమువలనను, ధర్మానుష్ఠానమువలనను మోక్షము పొందవచ్చునని ఋగ్వేదములోని పురుషసూక్తముచే తెలుపబడినది. ఆత్మపరిత్యాగమును, ధర్మానుష్ఠానమును ఎట్టివ్యక్తియైనను, ఎట్టికష్టమును లేకయే యర్థముచేసికొనుటకు రాముని జీవితము ఉపకరించును. కనుకనే, శ్రీరామచంద్రుడు అందఱకును మోక్షప్రదాయియైనాడు.

అనంతకళ్యాణ గుణాభిరాముని మును సంతృప్తిగావర్ణింప, తగిన పదజాలము కవులకు లభింపలేదు. శ్రీరాముని గుణములను పూర్తిగా నెన్నుట యసాధ్యమయినను కొన్ని గుణములను చూపి, అతడు మనకేవిధముగా మార్గదర్శియైనాడో తెలియజేయుట అవసరము.

శ్రీరాముని రూపము, తేజస్సు అత్యంతాకర్షకములని వాల్మీకి పేర్కొనెను. శ్రీరాముని రూపతేజములచే ఆకర్షింపబడినవారు ఇతర వ్యాపకములను సులభముగా మఱచి, ధ్యానము నందు మనస్సును సంపూర్ణముగా లగ్నమొనర్పగలరు. శ్రీరాముని రూపతేజములతో పాటు అతని గాంభీర్యము అతనిపట్ల భక్తిని పెంపొందించును.

శ్రీరాముని రూపమునకు పిదప అతని వాక్కును పేర్కొనవచ్చును. శ్రీరాముడు ఎవరిని కలసినను తానే ముందుగా వారి యోగక్షేమములను కనుగొనుననియు, అతడు మాటాడునపుడు అతని మోము చిఱునగవుతో వెలుగొందుచుండుననియు, వాల్మీకి పలుమార్లు పేర్కొనెను. శ్రీరాముని జీవితమున అతిక్లిష్టమైన ఘట్టములు ఎన్నియో కలవు. అతని ధర్మానుష్ఠానము వివాదాస్పదమైన సందర్భములెన్నియో కలవు. కాని అతడెట్టి పరిస్థితి యందును సత్యమును, తన వాక్కునందు మృదుత్వమును వీడలేదు. శ్రీరామచంద్రుడు ధర్మమునకు ప్రతిరూపమని అతని జీవితము తెలుపుచున్నది.

శ్రీరాముడు నోటిమాటలతో కాక, తన చేతలతో బోధించిన ఆచార్యదేవుడు. ధర్మసంస్థాపనమే తన ముఖ్యకర్తవ్యముగ భావించి, దానిని సాధించిన పుణ్యమూర్తి యతడు. ప్రతి గురువు తన శిష్యుని తన కార్యాచరణచే ఆకర్షించును కాని, మాటలచేగాదు. ఎదురు చూడని పరిస్థితులు ఏర్పడినపుడు, గురువు ఏవిధముగా వర్తించునో, శిష్యుడును అదే విధముగా వర్తించును. శ్రీరామచంద్రుడు ఎదురుచూడని పరిస్థితులు ఏర్పడినపుడు వానిని ధైర్య స్థైర్యములతో నెదుర్కొని, యెట్టి సందర్భమునను తన మాటలకు, చేతలకు భేదము కలుగకుండ వర్తించుటచే ఆచార్యుల కందఱకును ఆచార్యుడైనాడు. శ్రీరాముడు ధర్మమును అనుష్ఠించి చూపెను. అతడా విధముగ వర్తించుట, ప్రజలకు తాను మార్గదర్శి కావలయుననెడి కోరికవలనకాదు. తన ధర్మమును తాను నెఱవేర్చుటయే యతనికి కావలసినది. శ్రీరామునకు ఆదర్శమే ఆచరణీయము. ఆదర్శమునకును ఆచరణీయమునకును మధ్య భేదము లేదని యతని అభిప్రాయము.

పట్టాభిషేక దినమున శ్రీరామచంద్రుడు తండ్రిమాట నెఱవేర్ప నడవులకు పయనమయ్యెను. తనకై తండ్రినే వధింపబోయిన లక్ష్మణుని వారించి, పితృవాక్య పరిపాలనమే పుత్రధర్మమని బోధించి, అతనిని తన మార్గమునకు ద్రిప్పికొనెను. తనతల్లి కౌసల్య పట్ల తన దండ్రికిగల ప్రేమలేమిని, కైకేయి పట్ల నతనికిగల ప్రేమను ఎఱిగియు, తండ్రి భూలోకమునగల ప్రత్యక్షదైవముగ నెంచిన పుత్రుడు దశరథతనయుడు. తనపుట్టుకకు కారణ భూతుడయిన తండ్రిపట్ల అతనికిగల భక్తికి అంతులేదు. తండ్రిని సంతృప్తిపఱుప నతడేకార్యమయినను చేయ సంసిద్ధుడే. తనకు అరణ్యావాసము ప్రాప్తించుటకు కైకేయి మాత్రము కారణము కాదనియు, విధియే అందులకు కారణమనియు, ఇతని తలంపు. తనకు లభింపనున్న సామ్రాజ్యమును తనకు రానీయనందులకు ఇతనికి కైకేయిపట్ల ఏమాత్రము కోపములేదు. శ్రీరాముడు కైకేయి యంతఃపురమును వీడుటకు ముందు దశరథ మహారాజునకును, కైకేయికిని సాష్టాంగ ప్రణామ మాచరించెను. అంతఃపురమున కెట్టి యుత్సాహముతో వచ్చెనో, అట్టి యుత్సాహముతోనే మరలెను. భోగభాగ్యములను

వీడి, ఘోరారణ్యములందు నివసించుటకు ఏమాత్రము వెనుకంజవేయలేదు, ఏమాత్రము ఆలసింపలేదు. భోగభాగ్యములపట్ల నతడు చూపిన విరక్తి, వానిని అతడు పరిత్యజించిన విధము, అతని నిస్వార్థపరాయణత, మనః స్థైర్యము, అతని గొప్పదనమును వెల్లడిచేయు చున్నవి. ప్రతియొక్కరిని ఆకర్షించి, వారికి సత్యవర్తనమును శ్రీరాముని చరిత్ర బోధించి నట్లు ఏ గ్రంథములును బోధింపలేవు.

మహావీరుడయిన ఈ కోదండరామునకు ఖడ్గ కోదండములతోబాటు మఱియొక ఆయుధము కలదు. అదియే అతని వాక్పటిమ. సోదరుడు లక్ష్మణుని, తల్లి కౌసల్యను నోదార్చి, వారిని గూడ తన ధర్మమార్గమునకు త్రిప్పికొనెను. వివాహమయిన కొద్దికాలముననే తన ప్రాణ సఖిని వీడియుండవలసి వచ్చినందులకు రాముడు విచారించినను, జానకిని అరణ్యములకు గొని పోవుటకు ఏమాత్రము ఇష్టపడలేదు. అతి సౌకుమార్యవతియైన ఆమె ఘోరారణ్యము లందు కష్టపడుట తాను చూడలేకుండుటయే అందులకు కారణము. తన వాక్పటిమతో తనతో రావలెనన్న ఆమె ప్రయత్నమును మాన్పదలచెను. కాని సాధ్వీమతల్లి సీతాదేవి సతీధర్మమును వివరించి, ఇతని వాక్పటిమా యుధమును వ్యర్థమొనర్చెను. శ్రీరాముడు సీతను గొనిపోవలసి వచ్చుటకు కారణము అతని వాక్పటిమ వ్యర్థమగుట కాదు, సీతా దేవి పల్కులలోగల సత్యము, ధర్మము సత్య సత్యసంధుడైన రాముని ఆకట్టుకొనుటయే. ఆమె సౌఖ్యముకొఱకే ఆమెను అంతఃపుర మననే నిలుపదలచెను. కాని సతీధర్మమును, జానకి పాటింపవలసి యున్నందుననే, ఆమెను తనతో తీసికొనిపోయెను.

అరణ్యావాసము ముగిసి, రావణుని వధించి సీతాదేవిని గైకొన్నపిదప భరద్వాజాశ్రమము వద్ద విడిది చేసినపుడు శ్రీరాముడు, హనుమం తుని పిలిచి, అతనితో ఇట్లు చెప్పెను— "నీవు నా మిత్రుని గుహుని కలసికొని, నా క్షేమము నెఱిగింపుము. అతడు నీకు అయో ధ్యకు మార్గము చూపును. అటుపిమ్మట నీవు అయోధ్యకేగి, భరతుని దర్శించి, అతనికి జరి గినదంతయు వివరింపుము, భరతుని అభినయ వాచకములను జాగ్రత్తగా గుర్తించి, అతనికి రాజ్యముపట్ల ఆశ గలదేమో తెలిసికొని, నాకు తెలుపుము.' శ్రీరామచంద్రుడు, భర తుడు రాజ్యము నాశించిన తాను అడవులలోనే నివసింప నిశ్చయించుకొనెను.

గర్భవతియైన సీతాదేవిని శ్రీరాముడు పరి త్యజించుట మిక్కిలి వివాదాస్పదమైనది. ఇది శ్రీరాముని ధర్మానుష్ఠానమునకు మఱియొక ఉదాహరణము. తాను, తనకన్న మిన్నగ ప్రేమించిన సతిని, పరిత్యజించుటకు కారణము శ్రీరాముడే, 'పాలకుని జీవితము, ప్రజాభి ప్రాయము ననుసరించి యుండవలయును కాని, వ్యక్తిగతాభిప్రాయము ననుసరించి యుండ రాదు. కావుననే, తాను సీతాదేవిని పరిత్య జింపవలసి వచ్చె'నని వివరించెను. సీతాదేవి కొఱకు ముల్లోకములను గడగడ లాడించిన శ్రీరాముడు, ఆమెను ఎంత ప్రేమించియుండునో యూహింప నశక్యము. అంతగా ప్రేమించిన సతిని ధర్మముకొఱకై విడనాడుట వలన, అతడు ధర్మము నెంత కాంక్షించెనో తెలిసికొన వచ్చును. ధర్మసంస్థాపనకై, తన సహధర్మ చారిణినే వదలుకొనెను.

శ్రీరామచంద్రుడు ప్రభువయినను, ఇతరుల కంటె తాను పైమెట్టువాడని చూపుకొనక, తానును వారిలో నొకడుగ మెలగి, వారిలో

తనపట్ల ప్రేమాభిమానములు జనింపజేసెను. తన పాలనయందుగల ప్రతి పౌరుని యోగక్షేమములందు అత్యాసక్తి కలిగి యుండెడి వాడు, వారితో బంధువులతోవలె అత్యంత సన్నిహితముగా మెలగును. గుహునకు, శబరికి, వానరులకు అత డతి సన్నిహితుడు. సీతాదేవికి వానరులను తన ఆత్మబంధువులుగ పరిచయ మొనర్చెను.

వాల్మీకి మహర్షి శ్రీరాముని ధర్మాత్ముని గను, సత్యసంధునిగను పేర్కొనెను. రాముని ఆత్మయే ధర్మము. రాముని త్రికరణములును ధర్మములే. ధర్మస్వరూపమును దెల్పుటకే రాముడు మానవజన్మ మెత్తెను.

శ్రీరాముడు వాలిని చంపుట, వివాదాస్పదమయిన విషయము. ధర్మపురుషుడయిన శ్రీరాముడు తనకేమియు అపకార మొనర్పని వాలిని చంపుట ధర్మమా యనెడిది ప్రశ్న. కామప్రవృత్తి సంఘముయొక్క కట్టుబాట్లను దాటి వ్యభిచారరూపము దాల్చినచో, అది ఆసంఘ వినాశమునకు దారితీయును. అట్టి దుర్నీతిని అణపవలెనని చెప్పుటకే శ్రీరాముడు వాలిని చంపెను. శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. పరస్త్రీలను కన్నెత్తియైనను చూడడని కైకేయి ప్రశంసించినది. వాలి కామప్రవృత్తి [illegible]కమై, సంఘనీతిని ఉల్లంఘించి, తన సోదరుని భార్యను రుమను అపహరించున ట్లొనర్చినది. దానికి ఫలితమే అతని వధ.

తన శత్రువయిన రావణునిపట్ల రాము డెంతయో జాలిచూపెను. రావణుడు ఓడి పాఱ బోవుచున్న సమయమున, 'పోయి అలసట దీర్చికొని ర'మ్మనెను. చనిపోయిన దశకంఠునకు ఉత్తరక్రియలు చేయజాలనని విభీషణు డన్నపుడు, తానే వాని జరుప సంసిద్ధుడయ్యెను. శ్రీరాముని ఇట్టి గుణములను మఱవగలమా ?

శ్రీరాముడు తన్ను తన మార్గమునుండి మరల్ప యత్నించినవారిని, తన ధర్మమార్గమునకే మరల్చుకొనెను. శ్రీరామునియందు ఏ సమయమునందు, ఏవిషయముపట్లను అసంతృప్తి పొడసూపలేదు. అతడు నాలుగు పురుషార్థములందు ఎల్లప్పుడును మోక్షధర్మములనే కాంక్షించెను. అత డేసందర్భమునను సత్యధర్మములను విడనాడలేదు. నేటి ఈ ప్రపంచమున మనము ప్రతి విషయమందును అసంతృప్తులమే. మనకు మోక్ష ధర్మములపట్ల ఆసక్తి ఇసుమంతయేని లేదు. అర్థకామముల కొఱకై సర్వదా దురపిల్లుచున్నాము. ప్రతి విషయమునను స్వార్థపరాయణులమై సత్యమును, ధర్మమును విడనాడుచున్నాము. శ్రీరాము డెంత నిఃస్వార్థపరుడో, మనమంత స్వార్థపరులము. మన యీ ప్రవరనమే మన ఈ కష్టములకు కారణము. శ్రీరాముని ప్రతియొక్కరును త్రికరణశుద్ధిగా అనుసరించినచో, ఇప్పటి ఈ సమస్యలు ఉండెడివి కావు. ఏదైన సమస్య తలయెత్తినను, అది వెంటనే పరిష్కరింపబడియుండెడిది. శ్రీరాముని గొప్పదనము గూర్చి ప్రసంగించుచు, ఇతరులను రాముని మార్గము ననుసరింపుడని ప్రబోధించుటకన్న, రామనామము జపించుచు, ప్రతియొక్కరు తమంతట తాము ఆదర్శమార్గమైన రామమార్గము ననుసరించుట లోకమునకు శుభము కలిగించును.

సేతుబంధమున సీతాదేవి విలాపములు

శ్రీ చేరాల కృష్ణప్రసాదు

ప్రవరసేనమహాకవి ప్రాకృత భాషలో 'సేతుబంధము'ను రచించెను. ఈ మహాకావ్యమునకు 'దశముఖవధ' అని మఱియొక నామధేయము కలదు. ఈ పద్యకావ్యము పదునైదు కాండములు సుమారు 1300 పద్యములు కలిగియున్నది.

ఈ మహాకావ్యమును ప్రథమముగా 'గోల్డుస్మిత్' అను జర్మనీదేశపు పండితుడు ముద్రించెను.

ప్రవరసేనకవి రామాయణకథలో లంకాకాండభాగమును అనుసరించి యీ సేతుబంధ మహాకావ్యమును రచించెను. ఇందుకవి సంస్కృతాలంకారశాస్త్రనియమములను అనుసరించి కొన్నివిషయములను బహురమ్యముగా వర్ణించెను. ప్రవరసేన పద్యకావ్యమునుగుఱించి బాణుడు తన 'హర్షచరిత్రమునందును,' దండి కావ్యాదర్శనమునందును గొప్పగా ప్రశంసించి యున్నారు. దీనినిబట్టి ప్రవరసేనుడు ఈ కావ్యమును క్రీ. శ. 7 వ శతాబ్దమునకు పూర్వమే రచించి యుండవచ్చునని ఊహింపవచ్చును. కొందఱు పండితులు ఈ మహాకావ్యమునకు సంస్కృతమున 'సేతుతత్వచంద్రిక' అని పేరిడిరి.

ఈ పదునైదు కాండములుగల ఈ కావ్యమున పదునొకండవ కాండమున సీతాదేవి విలాపములనుగూర్చి రచింపబడినది.

దశకంఠుడు ఏవిధముగనైనను సీతాదేవిని తన దానినిగ చేసికొనుటకు పన్నిన యుక్తులను ప్రవరసేనుడు పదునొకండవ కాండమున వర్ణించెను.

నలుడనెడి వానరరాజుచే మహాసముద్రముపై నిర్మింపబడిన మహావారధిమీదుగ వానరసేనలు లంకానగరసమీపమునగల సువేలపర్వతప్రాంతమునకు చేరినవి. రాముడు వానరసేనతో సువేలపర్వతపార్శ్వములకు వచ్చినాడని తెలిసిన రావణుడు మిక్కిలి మండిపడెను. అప్పుడు సూర్యుడు అస్తమింప బోవుచుండెను. కవి యస్తమయమును రావణుని కాలాస్తమయమునకు సూచనగా వర్ణించెను.

జరుగబోవు మహాసంగ్రామముగూర్చి తలపోయుచు రావణునిఅనుచరులభార్యలు మిక్కిలి విషాదవదనములతో నుండిరి. ఆ భయమును త్రోసిపుచ్చుటకై వారు కామసౌఖ్యముల గూర్చి ఆలోచింప నారంభించిరి. అట్టిసమయమున రావణునిచే పంపబడిన రాముని కృత్రిమ శిరస్సును జూచి సీతాదేవి విలపించెను. అప్పటి లంకానగర పరిస్థితిని సీతాదేవి విలాపమును కవి మిక్కిలి చక్కగా వర్ణించెను.

సీతాదేవి తనకు లభింపలేదని రావణుడు మిక్కిలి మనోవ్యథ చెందియుండెను. తనకు తెలియకయే అతడు తన భార్యలతో సీతాదేవిని లుమాఱులు ప్రశంసించెను. అతని మనస్సు అశోకవనమున లగ్నమై యుండుట వలన, అతడు తన కార్యములను సరిగా నెఱవేర్పలేకపోయెను, అనేకవిధములైన పొరపాట్లు చేసెను. సీతపైగల కామవాంఛవలన నొడలు తెలియక పాన్పుపై దొర్లెను. రావణుడు వానరసేనను సంహరించి రాముని జయించుటయా లేక సీతను బలవంతముగా అనుభవించుటయా అని ఆలోచింపసాగెను. తన భర్త పెక్కుమైళ్లదూరములో నున్నను తన్ను కన్నెత్తైన చూడని సీత, భర్త లంకకు వచ్చినాడని తెలిసి తనకెట్లు లొంగగలదు, ఎట్లు తన కుట్రకు మోసపోగలదు అని చింతించుచుండెను.

రామునితో యుద్ధమొనర్చుటకు ముందు రాముని కృత్రిమ శిరస్సును జూపి సీతను మోసగించి ఆమె తన్ను అంగీకరించునట్లు చేసికొనవచ్చునని తలపోసెను. రావణుడు తన సేవకులను పిలిపించి తన పన్నాగమును తెలిపెను. రాముని శిరస్సునుబోలిన కృత్రిమ శిరస్సునుచేసి సీతకు జూపుడని ఆజ్ఞాపించెను. రావణుని ఆజ్ఞను అతని సేవకులు నిర్వర్తించిరి. హనుమంతునిచే ధ్వంసమొనర్చబడిన అశోక వనమున సీత తలవంచుకొని కనులలోనుండి నీరుప్రవహించుచుండ మనోవ్యథపడుచుండెను. రావణుని సేవకులు కృత్రిమ శిరస్సును ఆమెకు దానిని జూచిన వెంటనే ఆమె మూర్ఛపోయెను. కొంతసేపటికి తేఱుకొని మరల దారుణముగ కరవాలముచేత ఖండింపబడినట్లున్న కృత్రిమ శిరస్సును జూచి తన భర్త శిరస్సని తలచి వలవలపోయెను. మిక్కిలి దుఃఖములో నున్న ఆమె ఆ శిరస్సు తనభర్త రామచంద్రునిదా లేక కృత్రిమమైనదా అని యోచింపలేకపోయినది. అది కృత్రిమమై యుండుననెడి యోచనయే ఆమెకు కలుగ లేదు. దుఃఖము అధికమగుచుండ ఆమె మాటాడ యత్నించి విఫలురాలయ్యెను. తన మొగముపై పడియున్న ముంగురులను సవరింపక మిక్కిలి దీనదశయందుండెను. ఱొమ్ముపై చేతులనిడుకొని మరల ఆ శిరస్సును జూచి ఈవిధముగ విలపించెను. 'దుఃఖము పైన జూచుటకు మిక్కిలి భయంకరముగను లోపల ఏమియు లేనటుల కననగును. కాని అనుభవించు వారికే దాని తీవ్రతలు తెలియును. భర్త మరణము భార్యకు దారుణమైన సంఘటన, అట్టిదానిని జూచియు నేను ఇంకను జీవించి యున్నాను. అరణ్యవాసమునకు బయలుదేఱి నప్పటినుండి ఇప్పటివఱకు నేను మీ విశాల హృదయమున నా దుఃఖమునకు విముక్తి లభించునని తలపోయుచుంటిని. కాని ఇప్పుడు ఆ దుఃఖమును ఎచ్చట వెలిబుచ్చుకొందును? నాకు ఎచ్చట శాంతి లభింపగలదు? మీ ముఖారవిందమును చూడవలెనన్న ఆశతోనే నా జీవితమును వెళ్లబుచ్చుచున్నదానను. కాని మిమ్ములను ఈవిధముగ జూచితిని. మీ దర్శనము లభింపవలెను అనెడి ఆశ నాకు తొలగిపోయినది. కాని నా ప్రాణనాథుని ప్రాణములతో గాంచనైతిని అనెడి వేదన నన్ను పీడించుచున్నది.' తాను పాలించు భూమి, తా ననుభవించు సౌఖ్యములు, తాను తాళికట్టిన స్త్రీ-వీరు మువ్వురు రాజునకు భార్యలు అనెడి హిందూసంప్రదాయమును కవి వివరించెను. ఇది తెలిసిన సీత, 'రాజమరణానంతరము భూమి మఱియొక సిద్ధహస్తుని జూచుకొనును, రాజత్వమను దేవత చంచల కావున ఆమె యింకొక గొప్పవానిని వెదకుకొనును, కాని తుదకు నిజమైనభార్య వితంతువగును' అని విలపించెను. మరల తనబాధను ఈవిధముగ వెలిబుచ్చెను. 'నిజముగా ఇది శ్రీరాముని ముఖారవిందమే. నిన్ను ఈవిధముగా జూచుటకొఱకా ఎన్నడో విచ్ఛిన్నమయి యుండవలసిన నా జీవితమును ఈ రాక్షస స్త్రీలతో గడుపుచుంటిని? ఇప్పుడు నీవు మఱియొక ప్రపంచమునకు వెడలిపోయితివి. నా జీవితము వదలి నేనుగూడ నీ మార్గమునే అనుసరింతును.

కాని యీవిధముగ చేయుటవలన కలుగు సంతోషముకన్న బాధయే మిక్కుటముగా కలుగుచున్నది. ఏలన నేను ఇంకను ఆ దశకంఠుని అన్ని తలలు నిర్దాక్షిణ్యముగ ఖండింపబడుట కనులార చూడలేదు. ఎటువంటి ఆశలు లేని నా జీవితము ఇంకను ఏల నిలిచియున్నదో

నాకు తెలియుటలేదు. నా కొఱకు నీవు మహా సముద్రమును దాటివచ్చి ప్రాణములను కోల్పోయితివి. అట్లయ్యు కృతజ్ఞతలేని నాహృదయము ఇంకను జీవించియున్నదేమి? ప్రజలు నీ కీర్తిని శీలమును వేనోళ్ళ కొనియాడెదరు. కాని నన్ను -భర్త మరణవార్త విన్నవెంటనే ప్రాణములు కోల్పోవుట పతివ్రతల సహజలక్షణము, అట్లు ఈమె ప్రాణములు పోనందున ఈమె ఆ జాతిలో చేరదని – దూషింతురు. దశముఖుని పదితలలు నీ బాణములచేత దారుణముగ ఖండింపబడుట నేను జూడవలెనని ఎన్ని ఆశలు పెట్టుకొంటిని; కాని ఆ ఆశంతయు పెద్ద కలగా మాఱెను కదా, విధి వక్రించినది. ఒక ప్రాణ బంధుని వియోగము, కొద్దిసేపైనను ఎంత భయమును పుట్టించునో అటువంటి భయము, పెద్ద ఆపద నా కండ్లకు కననగుచున్నది.'

సీతాదేవి విలాపము విన్న త్రిజట అనెడి రాక్షస స్త్రీ సీతను మృదువాక్యముతో ఓదార్చెను. 'నీవు స్త్రీవి గావున దుఃఖములో నున్నందున ఏదియో మాటలాడితివి. నీభర్త ముల్లోకములకు ఏకాధిపతి అని బాగుగా తెలిసిన నీవు ఆతనిని సామాన్య మానవునితో పోల్పరాదు. అది శ్రీరామచంద్రుని శిరస్సని భావింపకు. అది అతని శిరస్సే అయిన అన్ని సముద్రములు ఒకటై యుండెడివి. ప్రపంచమే తలక్రిందులయ్యెడిది. అట్లు రాముడే మరణించి యుండిన రావణుని యానందోద్యానము ఈ ఆహ్లాదమును కోల్పోయెడిది. అన్ని తామరపుష్పములు వాడి యుండెడివి. కావున రాముని మరణవార్త నిజముగాదు. ఇదంతయు రాక్షసులు రావణుని ప్రోద్బలముచే పన్నిన పన్నాగమై యుండును. కనుక దుఃఖమును మానుము. ఇంక కొలది కాలములో నీవు నీ ప్రాణనాథుని చూడగలవు. అప్పుడతని కౌగిలిలో నీవు కరగిపోగలవు. ఆ శిరస్సు రాముని శిరస్సే అయ్యుండిన, ఆ శిరస్సునందు దాగిన కోపాగ్ని అతి భయంకరముగా ప్రేలి ఈ రాక్షసులకు వినాశము కలిగించియుండెడిది. శ్రీరామునిచే పంపబడిన వానరాగ్రేసరుడే లంకానగరమును ధ్వంసమొనర్పగా శ్రీరాముని పరాక్రమమును వేఱుగా చెప్పవలెనా? రామునిపై ఎటువంటి అవిశ్వాసమును కలిగించుకొనకుము. మహాసముద్రముపై నిర్మింపబడిన మహావారధికి నీ రాముడే కారణము. కనుక దుఃఖమును మానుము. ధైర్యమును కలిగించుకొనుము.'

కాని త్రిజటమాటలు సీతకు ఎట్టి నమ్మకమును కలిగింపలేదు. ఆమె ఆసమయమునందు త్రిజటను తన ఆప్తురాలుగ తలచి ఆమె ఱొమ్ముపై ఒరిగి దుఃఖించెను. కొంతసేపటిలో తేఱుకొని త్రిజటతో ఇట్లు మాటలాడెను. 'నేను ఇంకను బ్రతికియున్నందుకు దూషింపుము. ఏల నాహృదయము తన పనిని నిర్విఘ్నముగ చేయుచున్నది? ఓ ప్రాణనాథా, నిన్ను ఇట్టి స్థితియందు చూచియు ఏల నా హృదయము నిలిచిపోలేదు? సాధ్వి కనర్హమైన ఇటువంటి తుచ్ఛజీవితమును గడుపుచున్నాను. నీవు భర్తగా కర్తవ్యమును తీర్చుకొంటివి, రక్కసులు వారిపనిని వారుచేసిరి. కాని స్త్రీగా నా ధర్మమును నిర్వర్తింపలేదు. హనుమంతుడు అందించిన వార్తవలన నన్ను కాపాడుటకు ఇచ్చటకు వచ్చితివి. కనుక నీ మరణమునకు నేనే ప్రథమ కారకురాలను', కొన్ని మాటలు చెప్పి సీత భూమాతపై నొరిగిపోయెను. కన్నీటిని తుడుచుకొని క్రిందపడిదొర్లుచున్న కృత్రిమ శిరస్సును పలుమార్లుజూచి మరల కన్నీరు దృష్టిని మందముజేయగా, కన్నీటిని తన చీర కొంగుచేత తుడుచుకొని మిక్కిలి దీనావస్థలో నుండెను. చివరకు త్రిజటవైపు చూచి బాధగా

నవ్వి 'నేను నా జీవితమును అంత మొనర్చుటకు సిద్ధపడితిని. భర్తృవియోగమును పెక్కు దినములు అనుభవించితిని. ఇప్పుడు నేను వితంతువునైతిని. కావున నీవు నాయీ సిగ్గులేని ప్రాణత్యాగమును నిందింపరాదు. మరణము అన్ని ప్రాణులకును సహజమే కాని నాకన్న ముందు నా భర్త మరణించుట ఓర్వరానిది' అని పల్కెను.

త్రిజట మరల సీత నోదార్చుచు, 'నీమీద నున్న ప్రేమకొలది నిన్ను ఊరడించితిని, నేను రాక్షసస్త్రీ నని అసహ్యించుకొనకుము. శ్రీరాముడు బ్రతికియుండగా నీవు ప్రాణత్యాగము చేయుట సరిగాదు. నీవు రామునిగూర్చి తల పోయునది నిజమై యుండిన నేను నీ ప్రాణత్యాగమునకు ఎటువంటి అడ్డును చెప్పను'

'ఒక్క వానరము లంక నంతటిని గడగడలాడింప జగదేకవీరుడైన కోదండరాముడు ఈ రక్కసుల చేతులలో మరణమొందునా ? రాముని ఎవ్వరును జయింపలేరు. అతనికి అతడే సాటి. రామునికి ఏహానియైన సంభవించినచో ఈ ముల్లోకములును నశించును, రాక్షసులును మడియుదురు. నీ దుఃఖము మానుము. యుద్ధరంగమునకు పోబోవుచున్న భర్తకు భార్య కన్నీరు అశుభసూచకముగ పరిగణింతురు గదా.

'రాముడొక్కడే దశకంఠుని దశకంఠములను పడగొట్టి అతనికి తీరని అవమానము చేయగలడు. తాటకి మారీచ సుబాహు కంబధ రాక్షసులను వాలిని చంపి, సముద్రుని భయపెట్టిన రాముని పరాక్రమము నీ వెఱుగనిదా ?'

'నేను కలలో రావణుడు మరణవాటికకు పోవుటను చూచితి'నని పలికెను.

త్రిజట మాటల విన్న సీతాదేవికి రాముని పై ప్రేమ ఉప్పొంగెను. ఆమె ఇదే ధ్యాసతో నున్నందున శ్రీరామునిసేనఘోష ఆమెకు వినపడలేదు. చివరకు త్రిజట చెప్పిన మాటలలో సత్యమున్నదని సీత గ్రహించెను. తన భర్త తప్పక జీవించియున్నాడని గ్రహించెను. ఆమెలో దాగియున్న భయము తొలగెను. దుఃఖము మటుమాయమాయెను. త్రిజట మాటలు సీతకు మరల క్రొత్త ప్రాణమును పోసినవి. కృత్రిమ శిరస్సు ఆమె చక్షుఃపథము నుండి తొలగిపోయెను. ఇప్పుడు ఆమె శ్రీరాముని సేన చేయుచున్న సింహనాదములను బాగుగా వినగలిగెను. శ్రీరాముడు బ్రతికియే యున్నాడని ఆమెకు పూర్తిగా నమ్మకము కల్గి తన్ను ఓదార్చి తన ప్రాణములను నిలిపిన త్రిజటను మిక్కిలి అభినందించెను.

రామాయణము - అనువాదములు (తెలుగు)

శ్రీ మందలపర్తి ఉపేంద్రశర్మగారు

రామాయణము వాల్మీకిమహర్షి కృతమైనదే పుణ్యప్రదమనియు, మోక్షదాయకమనియు, మహాకావ్యమనియు భావించుట ఈ దేశమునకు పరిపాటి. ప్రాచీనమున కొందఱు కవులు సంస్కృతములో వ్రాసినట్లు రామాయణమునుగూర్చి చెప్పుదురు. ''చ్యవనుడు'' ఒక రామాయణమును వ్రాసెననియు, ఇతడు వాల్మీకికంటె కించిత్పూర్వుడనియు, పరిశోధ

కుల మతము. ఏదేనొకరీతిగా వ్రాసిన చ్యవన రామాయణమును పెంచి వాల్మీకి సుందరముగా వ్రాసెనని ప్రసిద్ధము. సంస్కృతములో రామ చరిత్రము వాయుపురాణములోను, విష్ణుపురాణములోను, భాగవతమునందును వ్రాసియుండిరి. వాల్మీకి ముముక్షువుల కుపయోగించునట్లు శ్రీరాముని వృత్తాంతమును వ్రాసి తన పాండిత్యమును ధన్యమొనర్చుకొనినాడు.

వాల్మీకి పూర్వ స్థితియందు కిరాతుడు. ఆ స్థితిలో నితడు అజ్ఞానియై, స్త్రీలోలుడై కుటుంబ పోషణార్థము దారులు కొట్టుచు జీవితము గడపెడివాడు. ఇతడీ విధమున పాపకార్యము లాచరించుచుండ ఒకనాడు కొందఱు మునులు యాత్రచేయుచు వారణాసికి పోయి అక్కడ గ్రీష్మమును భరింపజాలక తమసానదిని దాటి ఒక బోయపల్లెను సమీపించిరి. అచ్చట బోయవాడొకడు వారిని బాణములతో కొట్టి, బాధించి ప్రయోజనము లేక ఊరక నిలిచియుండెను. మునులు ప్రశ్నింప "తిండికొఱకిట్లు చేసితి"నని వాడు పలికెను. అంత "నీపాపమున నీ భార్యాపుత్రులకు భాగముకలదా?" యని వారు ప్రశ్నింప ఆ విషయమును వారినే అడిగి తెలిసికొని వచ్చెదనని వాడింటికిపోయి అడుగగా 'మాకా పాపముతో పనిలే'దని భార్యయు బిడ్డలు పలికిరి. ఆ కిరాతుడు తిరిగివచ్చి భావపరివర్తనమునొంది మునులకడకేగి వారి యనుగ్రహమును పొంది తనకు తగినరీతిని రామమంత్రము నుపదేశింప వేడెను. వా రనుగ్రహించిరి. తర్వాత ఆ మంత్రమును అతడు జపింపసాగెను. అతని బంధుగులు, దారాపుత్రాదులు మమకారము రేకెత్తించి అతని బుద్ధి మరలింప ప్రయత్నించిరి. వారి ప్రయత్నములు ఫలింపక పోవుటయేగాక వాల్మీకి రామమంత్రమును జపించి బ్రహ్మసాక్షాత్కారము నొందెను. జ్ఞానియై నారదోపదేశమున రామాయణమును రచించి తరించి తరింపజేసెను.

ఈ రామాయణము పెక్కు ప్రాచ్య పాశ్చాత్య పండితుల ప్రశంసల నందినది. అరవిందయోగి కావ్యశిల్పమున వాల్మీకి సర్వశ్రేష్ఠుడనియు, రామాయణమునకు సాటివచ్చు మహాకావ్యము పృథివిలో మఱియొకటి లేదనియు వ్రాసెను. భారతీయ హృదయము యుగయుగములుగా రామాయణ గీతికల యందు స్పందించుచున్నదనియు, ఆ సచ్చిదానందామృతమును అనుభవించిన సనాతనుల చిత్రపటము రామాయణము, సదా ప్రదర్శించుచున్నదనియు రవీంద్రనాథఠాగూరు వ్రాసెను. "శ్రీమదాంధ్ర రామాయణము తరతరములుగా మనకు లభించుచున్న పెన్నిధి. ప్రతి గృహమున నుండదగినది. రామాయణముకంటె వేఱొండు గ్రంథమెయ్యది? సీతారాములు, హనుమంతుడు, భరతుడు, లక్ష్మణస్వామి మన ఆత్మబంధువులు. భారతీయులను చల్లని తల్లియై చేరదీసి ఈ సీతారాముల పుణ్యచరిత్రము ఎంతకాలము పుణ్యనదులు ప్రవహించుచుండునో అంతకాలము సంరక్షించుచుండును. ఆబాలగోపాలము శ్రీమద్రామాయణమును భక్తిశ్రద్ధలతో పఠించి, ఆనందించి సద్ధర్మాచరణమున తరింతురుగాక!" యని రాజాజీ రచనము. "సుఖదుఃఖములతో మేళవింపబడిన ఈ జగత్తుతోడి సంబంధమును సచ్చిదానందముతో పోల్చుకొనుటయే ప్రేమ, కరుణ; ఆ కరుణనుండియే ఆదికావ్యము ప్రభవమైనది. విశ్వవిఖ్యాత రామాయణ సముద్భవోదంతము ఇదియే." అని కె. యస్. రామస్వామి శాస్త్రిగారు వక్కాణించిరి.

పాశ్చాత్యవిద్వాంసుల అభిప్రాయములు ఇట్లు రామాయణమునుగూర్చి లభించుచున్నవి:

"రామాయణమువలె ఆనందమును ప్రసాదించు కావ్యములు విశ్వసాహిత్యమునందు అరుదు...హోమరు రచనములను రామాయణము కావ్యకళాశిల్పమునందు మించుచున్నది. మతభావమూలములు రామాయణమునందంతటను వ్యాపించియున్నవి."

—సర్ మోనియర్ విలియమ్స్

సీతారాముల సమగ్రపావనపాత్రలను సాక్షాత్కరింప జేసిన రామాయణమువంటి కావ్యము జగత్తున ఏశకమునగాని, యేప్రాంతమునగాని, సాహిత్యమున గలదా యని ఎలుగెత్తి చాటనిమ్ము. నైతికప్రబోధము, భాషాభావసారళ్యసౌందర్యములు అహమహమికతో చిఱునవ్వులొలికించి చిద్విలాసమును వెలార్చిన పవిత్రకావ్యమును (రామాయణము)మఱొండుచోట కానగజాలము.

—ఆచార

"రామాయణము భారతీయుల సౌభాగ్యమును సొంపునింపుచున్నది. ప్రపంచమునగల ఏ వాఙ్మయమునందును యుగయుగములుగా మఱియే గ్రంథమును, కవితను ఇట్లు ప్రసరింప"

—వింటర్‌నిట్స్

వాల్మీకిమహర్షి సంస్కృతమున గాయత్రీ బీజసంపుటీకరణమున ఇరువదినాలుగువేల శ్లోకములతో ఏడుకాండములుగ రామాయణ మహాకావ్యమును పండితపామరాపేక్షముగ రూపొందించెను. నారదమునీంద్రుని తపఃస్వాధ్యాయనిరతుడని, వాగ్విదులలో శ్రేష్ఠుడని వాల్మీకి వర్ణించెను. నారదమునిపుంగవుని పృచ్ఛచేయగల ఈతడును తపఃస్వాధ్యాయ నిరతుడని వాగ్విదులలో శ్రేష్ఠుడని మన మూహింపవచ్చును. తన్నుగూర్చి ఆరంభ కమునందే వాల్మీకి 'తపస్వి' యని ప్రయోగించుకొనినాడు. వాల్మీకిని ప్రతిభతోపాటు వ్యుత్పత్త్యభ్యాసములు వరించినవి.

వాల్మీకిరామాయణమును పెక్కుమంది తెనుగున వ్రాసిరి. గోనబుద్ధారెడ్డి, తిక్కన, భాస్కరాదులు, మొల్ల, కంకంటిపాపరాజు ముఖ్యులు.

జగత్సాహిత్యమందిరమున ఆరాధనీయమని కీర్తివహించిన వాల్మీకిరామాయణమునకు గోనబుద్ధారెడ్డి రంగనాథరామాయణము స్వేచ్ఛానువాదము. అసలు యథామాతృకానువాదము పూర్వాంధ్రకవుల పద్ధతియే కాదు. నన్నయాదులు యథోచితము గ మాతృకను పెంచియు, కుదించియు వ్రాసియున్నారు కాని మూలమునందలి ముఖ్యాంశములను మార్చినవారుకారు బుద్ధారెడ్డి మార్గమే వేఱు. వాల్మీకీయములగు విషయములనేకము లీతనిగ్రంథమున గలవు. విశేషించి వాల్మీకిరామాయణమున లేని కథలుకూడనిందు గలవు.

సులోచన సహగమనము, కాలనేమిచరిత్రము కొత్తగా నిందు చేర్పబడినవి. రంగనాథరామాయణకర్తకు సంస్కృతాంధ్రముల యందసమాన పాండిత్యము గలదు. మనోహరముగా కవిత్వము చెప్పు సామర్థ్యమున్నట్లు మన మూహింపవచ్చును. ఇతని శైలి ద్రాక్షాపాకమై, సలక్షణమై, రసవంతమై యొప్పును. అన్వయకాఠిన్యముండదు. చదువ చదువ మనంబున కానందమును కలిగించును. రామచంద్రప్రభుని దివ్యచరిత్రమును కన్నులార గనుచు, వీనులారవినుచున్నట్లు దోచును. ఈ గ్రంథము పెక్కుతావుల ఆంధ్రదేశీయులు వీథి నాటకములుగా, బొమ్మలాటలుగా, పురాణములుగా చెప్పుకొనుచున్నారు. శ్రీరాముని

కథయగుటచే కలికలుషవిధ్వంసచణంబుగా పరమాదరంబున దీనిని తెనుగువారు పఠింతురు.

ఇంత యుద్ధగ్రంథమునను ఒక్కటే ద్విపద పంక్తి. రాముడు దేవతాంశసంభూతుడని నొక్కి వక్కాణింపబడినదీగ్రంథమున. బుద్ధరాజు విష్ణుభక్తుడు. మొదటి ప్రతాపరుద్రుని కాలములో నితడొక సంస్థానాధిపతియై యుండినట్లు చారిత్రకుల నిర్ణయము.

వాల్మీకి రామాయణమునందలి ఉత్తర కాండములోని కథను ఆధారముగా గ్రహించి తిక్కన నిర్వచనోత్తర రామాయణ మను పేర శిల్పతత్త్వమునకు భంగము కాని పద్ధతిని సంకుచితముచేసి స్వయం సంపూర్ణమును, మంగళాంతమును నగు స్వతంత్రకావ్యముగా రచించెను. పూర్వ రామాయణగాథయంతయు సంక్షేపరూపమున ప్రథమాశ్వాసమున చెప్ప బడినది. రాముడు సీతను పరిత్యజించుట అను ప్రధానాంశమును, అందుకొనిన పిమ్మట గుణ భంజకములగు పూర్వగాథలను ఈకవి తలపెట్ట లేదు. వాస్తవమునకు నిర్వచనోత్తర రామా యణమునందు రావణుని వృత్తాంతమేగాని రామచరిత లేదు. దీనినిబట్టి రావణుని మహత్తు గ్రహింపగల్గితిమి. రాముని మహత్తును నిందు మూలముగా ద్విగుణముగా గ్రహింప గల్గితిమి. వాల్మీకి రావణుని గొప్పతనమును పూర్వరామాయణమునందేల చూపలేదనగా, రామరావణ యుద్ధమునకును, రావణ నాశన మునకును కారణమైన సీతాపహరణమునకు లాఘవము సంభవించునని. తిక్కన సీతా రాముల యుద్యాన వనవిహారము, జలవిహా రము, లీలావిహారములు వర్ణించుటలో ఆ దంపతుల శృంగార విలాసమును చక్కగా చిత్రించెను. తిక్కనకు వాల్మీకియందుండెడి గౌరవము నిట్లు వర్ణించెను. వాల్మీకి ఆశ్రమము నందు రామాయణము నిత్య పారాయణ మనియు, "ఒక్కొక చో నిజస్వాంతంబును గరగింప తన్మయత్వము బూరయుచు, దాన దినములు గడపుదురనియు" వివరించెను.

ఆదికావ్యమగు వాల్మీకి రామాయణమును తెనుగులో ఆదిపద్యకావ్యముగా నందించిన వారు భాస్కరాదులు. హుళక్కి భాస్కరుని వలన దీనికి భాస్కరరామాయణమని పేరు గలిగినది. దీనిని నలువురు రచించిరి-భాస్కరుడు, మల్లికార్జునభట్టు, కుమారరుద్రదేవుడు, అయ్య లార్యుడు. భాస్కరుడు తన పుత్ర, మిత్ర, ఛాత్రులయందలి వాత్సల్యమున వారికి కొంత కొంత భాగమిచ్చి కొంత భాగమును తాను తీసికొని రామాయణమును తెనుగున పద్య కావ్యముగా రూపొందించి పూర్తిగావించెను. వీరిదికూడ స్వేచ్ఛానువాదమే.

హుళక్కి-భాస్కరాదులు తెలుగున తిక్కన తాత మంత్రి భాస్కరుడు వ్రాసిన సంగ్రహ రామాయణ రచనమును విపులీకరణము చేసి రను వాదమున్నది. హుళక్కి భాస్కరుడు ఆరణ్యకాండమును, యుద్ధకాండమున పదు నొకొండు వందల పదమూడు పద్యములును, మల్లికార్జునభట్టు బాల కిష్కింధా సుందర కాండములనుకుమారరుద్రదేవుడు అయోధ్యా కాండయును, అయ్యలార్యుడు యుద్ధకాండమున భాస్కరుడు మిగిల్చిన భాగమును రచించిరి. వీరికవిత్వము చక్కని జాతీయములును, సామె తలును కలిగియున్నది. శైలి సుగమము. పాత్ర పోషణము మూలవిధేయము. మొత్తముమీద భక్తి ప్రబోధాత్మకమైనది.

తెలుగు భాషలో కవిత్వము చెప్పిన స్త్రీలలో ద్వితీయురాలైనను రామాయణ రచ యిత్రులలో ప్రథమురాలని పరిగణ నందినది మొల్ల. ఈమె శ్రీకంఠమల్లేశ్వరుని వరము

చేత కవితనేర్చితి ననెను. మొల్ల కవితాశైలి మధురమై, ద్రాక్షాపాకమై, సులభ సమాస భూయిష్ఠమై యొప్పును. ఈమె పాండిత్యవిశేషములు పలువిధములని, అదిసూచించుచున్నది. ఈమె సుందర యుద్ధకాండములను విస్తృతముగా వ్రాసి మిగిలిన కాండలను సంగ్రహించినది. రామాయణ కథ మిక్కిలి వేగముగా సాగిపోయినది. చదివిన విద్యకు దైవశక్తి తోడ్పడి ధారాళమైన కవితాధార యేర్పడగా నీమెకు ఆంధ్రవాఙ్మయమున ఉన్నత స్థానము లభించినది. ఈమె కవనము వీనులకు విందు, తెలుగునకు పొందు.

కంకంటి పాపరాజు తన ఉత్తర రామాయణమును ప్రబంధరీతిని నిర్మించెను. తిక్కన నిర్వచనోత్తర రామాయణమును రచించియుండ మఱి తానేల రచింపబూనుట యని ప్రశ్నించుకొని "రాఘవేశ్వరుచారిత్రము నెందఱెన్ని గతులన్ వర్ణించినన్ గ్రాలదే" అని సమాధానము చెప్పుకొని కావ్యరచనకు పూనుకొనినవాడు పాపరాజు. పాపరాజు కవితలో ఆత్మభూతమైన రసమునకు ప్రాముఖ్యముండును. ఇందలి ఈ రామణీయకమే నేటికిని నందఱి నాకర్షించుచున్నది. లలిత సమాసనిర్మాణము జరుగుచునే యుండును. ఉభయ భాషలలో నిరుపమానమైన సాహితిని ప్రకటించు ప్రౌఢ ప్రయోగములు కన్పట్టును. ఈతని కవితయందు శబ్దాలంకారములు, అర్థాలంకారములు, శయ్యలు, భావములు, ధ్వనులు తేలియాడుచుండును. సందర్భ సుందరముగా జాతీయములు, లోకోక్తులు నుండును. మొత్తముపై తెలుగువారికి త్రికాలస్మరణీయు డనక తప్పదు. తిక్కన చివరలో వదలిన భాగములను కూడ "మృదువచోధారార్థ సందర్భ నిర్భర తత్తద్రసముల్ రహింప" రచింప బూనినాడు. పుష్పగిరి తిమ్మనగారి సాయముతో తుదముట్ట రచించినాడు పాపరాజు. తెనుగునాట రామాయణములు అనేకములున్నవి. ఇతోధికముగ విస్తరింపగలవు. పరమపావనములు సకల పురుషార్థప్రదములు నగు నీ రామకథలను ఆంధ్రులు ఆదరించి తరింతురు గాక!

తిక్కన–ఉత్తర రామాయణము

డాక్టరు విష్ణుభొట్ల విశ్వనాథశాస్త్రిగారు

ఆంధ్ర మహాభారత రచనకుఁ బూర్వమే కవిబ్రహ్మ తిక్కన ఉత్తరరామాయణమును రచించెను. అతఁడు "ఎత్తఱినైనను ధీరో। దాత్త నృపోత్తముఁడు రామ ధరణీపతి స। ద్వృత్తము సంభావ్యమగుట" యే తన యుత్తర రామాయణ రచనకు హేతువుగాఁ బేర్కొనెను.

పాత్రపోషణకు రసపుష్టికి మూలకథయందు కొన్ని మార్పులను బ్రవేశపెట్టి తన శిల్పనైపుణ్యమును కళాభిజ్ఞతను నిరూపించుకొనిన మహాకవి తిక్కన. కాని ఉత్తరరామాయణమునందాతఁడు మూలకథయందుఁ గావించిన కొన్ని మార్పు లట్టివి కావని నాకుఁ దోచుచున్నది. అట్టి మార్పులను కొన్నిటినిఁ బేర్కొని వాని యౌచిత్యమును పరిశీలించుటయే వ్యాసోద్దేశము.

మూలకథయందు తిక్కన ప్రవేశపెట్టిన మార్పులలో ముఖ్యమైనది రాముడు స్వయముగనే సీతాలక్ష్మణులను వనమునకు సాగనంపుట.

మూలకథప్రకారము రాముని చే నాజ్ఞప్తుడై లక్ష్మణుఁడు మఱునాడు సీతమ్మ భవనమునకుఁ బోయి "నీవు వనమునకుఁ బోవ శ్రీరామునిఁ గోరితివట. నీ కోరికనుదీర్ప శ్రీరాముఁడు నన్నా జ్ఞాపించె" నని పలుకఁగా హర్షమునుబొంది సీతమ్మ వనమునకుఁ బ్రయాణమగును.

ఈ మూలకథారీతిని పెద్దలొక రిట్లు విమర్శించిరి.

"లక్ష్మణస్వామి పెద్ద యుద్రేకపుముద్ద. పాదాలు తప్ప తక్కిన అంగాలు వేనినీ ఎఱుగనంతటి మహాభక్తి వదినెమీద ఆతనికి. అట్టివా డీ సందర్భంలో ఇట్లు శుష్కంగా నిర్దాక్షిణ్యంగా వదినెను పిలువఁ గలిగెనా? ఆ వ్యక్తి కంత ఆత్మసంయమము స్వాభావికమా? ఇదొక ప్రశ్న; ప్రయాణ వేళలో సాగనంపడానికైనా సీతమ్మవద్దకు రాముడు రాబనిలేదా? అట్లు రాకపోవుట వింతగా తోచదా? శాశ్వత పరిత్యాగం చేస్తూ దగ్గరనిలచి సాగనంపే మొగము రామునికి లేకపోవచ్చును. కాని సీతమ్మ కా విషయ మప్పటికీ తెలియదు కాన ఆమె రాముడు కానరానందుకు ఆక్షేపించి తీరవలయును. లేదా ప్రయాణ వేళలోనే ఆమెకీ పరిత్యాగ వార్త తెలియజేయవలయును. కాబట్టి లక్ష్మణునిమాట విన్నమాత్రంతో సీత "ప్రహర్ష మతులం లేభే" అన్న వాల్మీకిమాట సీతాస్వరూపానికి చాలదు......తిక్కన్న కిది చాలకపోయినది. వాల్మీకి కొక మ్రొక్కు మొక్కి సీత ప్రయాణసమయంలో రాముని నే ప్రధానంగా తెచ్చి నిలుపుతాడు. రాముడు,

"అడలడచి నెమ్మనంబున
వెడ తెలివొడఁగూర్చి మాట లేర్పడకుండం
జిడిముడి పడక నయంబున
నెడమడు వొక్కింత లేక యిట్లనుసతితోన్
పొలతుక గంగ చేరువ త
పోవన భూములు సూడ నీమదిన్
మొలచిన కౌతుకంబు దుది
ముట్టగ లక్ష్మణ దేవు నిన్ను నం
దులకు మనో ముదంబెసఁగఁ
దోకొనిపో నియమించితిన్ సము
జ్వల మణికాంతమైన రథ
సత్తమ మెక్కుదు రమ్ము నావుడున్"

సీతమ్మ,

"అక్కట నాదు వేడ్క కుచి
తానుచితంబులు సూడ కే విభుం
డొక్కతలంపు వాడయి స
ముత్సుకతన్ ననుదవ్వ పుచ్చగా
నిక్కమ యియ్యకోలరయ
నెయ్యము తియ్యము గాదె......"

యనుకొని సరేనన్నది. కాని యీ నాటకాన్ని లక్ష్మణుడు చూచి సహింపఁగలడా? మఱి సహింపక మాత్రం యేమనఁగలఁడు? అన్న ధైర్యానికి వదినె పిచ్చి నమ్మకమునకు ఆశ్చర్యమూ దుఃఖమూ అతని నావరింప మొగముమీద తోచినవి. దానినిఁ జూచి రాముఁడు సీతతో

"దూరమునొక ఘోరవన
దుర్గతలంబులఁ గేలిసల్పగాఁ
గోరెడు భామలం బ్రియులఁ
గోరినయట్టుల పుచ్చు రాజులన్
ధారుణి నెందు గానమని
తామును దీనికి నడ్డపెట్ట నేఁ
బోరితమాడి యిట్లు నిను
బుచ్చుట కల్గినవాడు సూచితే."

అని పెద్ద అల్లిక మొకటి అల్లి సీతను వలలో వేసి తమ్మునినోరును తెరవనిదాన్నే మూస్తాడు.

ప్రియవాదీచ భూతానాం
సత్యవాదీచ రాఘవః'

అన్న రాముని కీర్తికి భంగం దీనితో వచ్చిందని దుఃఖించేవారు దుఃఖింపని లెండి! సీతమ్మ వ్యక్తికి మాత్రం దీనితో కొంత ప్రాణబలం వచ్చింది, పొమ్మంటేపోయి రమ్మంటే వచ్చే రకం కాక రాముఁ డసత్యమైనా చెప్పి మనస్సు నెమ్మదిపరచవలసిన పాత్రంగా ఆమె యిందు తయారైంది. మఱి మునిపత్నులకని వాల్మీకి సీత స్వయముగాఁ దీసికొన్న" మణిమయ భూషణాంబరాదులు తిక్కన రామునిచేత నే యామె కిప్పించినాడు. ఇట్లు ఆమెను,

"పాలతోడ విషంబిడు పగిదిననిచి
పుచ్చి రాఘవుడుల్లంబు నొచ్చి మరలె"

విమర్శకుల యింత గ్రంథము నిచ్చట ననువదించినందులకు పాఠకులు మన్నింతురు గాక!

ఇచ్చట విమర్శకుల యభిప్రాయము ననుసరించి తిక్కనగారు కావించిన మార్పునకు కారణములు రెండు. ఒకటి గొప్ప యుద్రేకములు గల లక్ష్మణునకు 'నిర్వికారంగా నిర్దాక్షిణ్యంగా' సీతతోఁ జెప్పి ప్రయాణము చేయింపఁగల ఆత్మసంయమము స్వాభావికముగాదు. రెండవది తన ప్రయాణసమయములో రాముడు లేనందుకు సీతమ్మ ఆక్షేపించి యుండవలదా? అనునది. ఇప్పుడు మొదటి కారణమును పరిశీలింతము. లక్ష్మణుఁడు పెద్ద యుద్రేకపు ముద్ద యనునది సత్యమే. ఈ విషయము రామాయణమున పెక్కుచోట్ల కానఁబడును కాని లక్ష్మణుని యుద్రేకాగ్ని రామాజ్ఞ యనెడు నంబుధారచే చల్లాఱునట్టిదే యను విషయముకూడ రామా పఠితలకుఁ దెలియనిదికాదు. విమర్శకులే యన్నారుగదా! వేఱొకచోట "అన్నమాటకు మాఱాడే స్వభావము లేని లక్ష్మణుడు అన్న యాజ్ఞను పరిపాలించుటకు నిర్వికారముగా వదినెతో నడవికి ప్రయాణమగుమని పలుకలేడా? ఆత్మసంయమమును ప్ర[illegible]లేడా? వాల్మీకి చిత్రించిన లక్ష్మణుని యాత్మసంయమ మాతని స్వభావమునకు విరుద్ధమని విమర్శకు లనిరి. తిక్కనగారి లక్ష్మణుడుకూడ ఆత్మసంయమమును నిర్వికారతను ప్రదర్శించినాడే! లక్ష్మణుఁడు గంగానదినిదాటు పర్యంతము తన దుఃఖమును మనోవికారమును ప్రకటింపలేదే! ప్రయాణసమయములో లేని యాత్మసంయమము తిక్కనగారి లక్ష్మణునకుఁ బ్రయాణమైన తర్వాత నెట్లు వచ్చినది? లక్ష్మణుఁడు రథము మీద మౌనముతో కూర్చుండి మానసిక వ్యథను ప్రకటింప లేదనుట సరికాదు.

తిక్కనగారి పద్యమును గమనిపుడు.

"లలితగతిన్ సతోయకమ
లస్ఫుటమార్గమునన్ శరీరర
క్షులు వినయంబుతో నడిపి
గౌరవమొప్పఁగ భక్తిపెంపుమై
నలయక పంపుసేయుచు మ
హాశ్రమభూములు వీడుపట్టుగా
లలనఁదగన్ సుమంత్రుడును
లక్ష్మణుడుం గొనిపోయిరిమ్ములన్."

వినయముతో శరీరరక్షులనడుపుట, పంపు సేయుట, నిర్వికారముగా చేసిన పనులేకదా! అంతియేకాదు. తన తనువున దుర్నిమిత్తములు తోచి సీత "నాకు వెఱపగుచున్న" దనగా "నమ్మాటలు గీటునం బుచ్చుచు" లక్ష్మణుఁడు

"
లలితడోలాయితవీ
చినిచయసుభగాకృతియగు
ననిమిషనదిఁ జేరనరిగి నత్యంతధృతిన్."

అని తిక్కనగారే వ్రాసిరి. ఈ యత్యంత ధృతి నాతడు ప్రయాణసమయమునందుమాత్ర మేల ప్రదర్శించి యుండఁగూడదు? కాబట్టి తిక్కనగారు కావించిన మార్పునకు లక్ష్మణ స్వామికి ఆత్మసంయమము స్వాభావికము కాక పోవుట యనుకారణము సరిగాదు.

"లక్ష్మణునకు ఆత్మసంయమము స్వాభావికమా" అన్నవిమర్శకులకు సమాధానమో యన్నట్లీసందర్భమున కంకంటిపాపరాజు రచనను గమనింపుడు.

ఆ సౌమిత్రి దృఢాత్ముఁడౌటవగదై
న్యంబున్ ముఖాబ్జంబునన్
వీసంబంతయుఁ దోపనీక తెగువన్
వేవచ్చి సద్భక్తి సీ
తాసీమంతినికిన్ వినమ్రుఁడయి మా
తా, గాంగతీరాశ్రమే
ఘాసక్తిన్ నినునందుదోడుకొని పొ
మ్మంచుం విభుండంపినన్.

వాల్మీకిరచనమున విమర్శకులకుఁ గలిగిన ప్రశ్నలకు ఈ పాపరాజుపద్యము సమాధాన మనుట స్పష్టము.

ఇక తిక్కనగారి మార్పునకు విమర్శకు లూహించిన రెండవకారణ మరయుదము. ప్రయాణకాలములో రాముడు లేనందులకు సీతమ్మ యాక్షేపించి యుండవలెననునదియే రెండవ కారణము. ఇచ్చట విమర్శకుల కొక ప్రశ్న.

"గంగాతీరము కానలోనఁ దిరుగంగాఁ గౌతుకం బయ్యెడిన్" అని సీతమ్మ తనకోరికను దెలిపినది. దానికి శ్రీరాముడు "లతాంగి, నీవు కోరినట్లుచేయుటెంత పెద్ద? శీఘ్రంబయచటికిఁ బుచ్చువాడ" ననగా సీతమ్మ తనతో శ్రీరామ చంద్రుడుకూడ వనమునకు రావలయునని కోరఁబనిలేదా? అట్లు కోరినటుల తిక్కనగారు రచింపలేదే! అటు సీతమ్మ కోరకుండుట విమర్శకులకు వింతగా తోచనప్పుడు ప్రయాణ వేళలో రాముడు లేనందులకు సీతమ్మ యాక్షేపింపకపోవుట యేల వింతగా తోపవలయును?

మరియు తిక్కన్నగారి రచనలో "పొమ్మంటే పోయి రమ్మంటే వచ్చేరకంకాక అసత్యమైనా చెప్పి నెమ్మదిపఱచవలసిన పాత్రంగా తయారైంది సీతమ్మ" అనికూడ విమర్శకులు వ్రాసిరి. వాల్మీకి చిత్రించిన సీత యంత తేలికబారుగా నున్నదని విమర్శకుల యాశయము. పొమ్మంటే పోయి రమ్మంటే వచ్చే గృహిణులు విమర్శకుల దృష్టిలో ఉదాత్తవ్యక్తులుకారు కాబోలు. అదియుఁగాక "పొమ్మంటే పోయి" అనుమాటకు ఇక్కడ ప్రసక్తియే లేదు. వనమునకుఁబోవ సీతమ్మ వాంఛించినది. రాము డంగీకరించినాడు. ఇచ్చట 'పొమ్మంటే పోవు' అనుదానికి అవకాశమెక్కడ? ఇక్కడ తిక్కన కావించిన మార్పువలన సీతమ్మ పాత్రపోషణమునకు చేకూరిన విశేషము నాకు బోధపడుటలేదు. ఈ ఘట్టమునందు భవభూతిని మించి తిక్కన మార్పులను ప్రవేశపెట్టెననికూడ విమర్శకులు వ్రాసిరి. నాకు భవభూతి కథాక్రమమే హృదయంగమముగా తోచుచున్నది. భవభూతిరచననుసరించి సీతమ్మకోరికనుతీర్చుటకు ఋష్యాశ్రమములకుఁ బంపుదునని శ్రీరాముడు చెప్పగనే సీతమ్మ "మీరుకూడ రావలయు"నని కోరును. ప్రయాణసమయములో రాముడు లేనందులకు సీత యాశ్చర్యపడి "కాని అతని మీద కోపం చూపుతాను. అతనిఁ జూచినపుడు నా తెలివి నాలో వుంటే" అంటుంది. ఈ రచనయందు ఎట్టి ప్రశ్నల కవకాశము లేదు.

తిక్కనగారి కథాకథనమందు రాముని సంభాషణ మాతని యుదాత్తప్రకృతికిఁ దగినట్లు లేదు. గర్భవతిగా నున్న సీతమ్మ కోరిన కోరికను రాముడు తీర్చుచుండగా లక్ష్మణుఁ డాక్షేపించునా? అట్లాక్షేపించెనని రాముడు చెప్పినను సీతమ్మ నమ్మునా? ఆవిధముగ రాముడు చెప్పగనే సీతమ్మ నమ్మినటు వ్రాయుటవలన తిక్కనగారి సీతమ్మ విమర్శకుల యభిప్రాయముప్రకారము స్వాభిమానాలుకల వ్యక్తిగా కాక యేమాటచెప్పినను నమ్మెడి వెఱ్ఱిబాగులదిగ తయారైనది.

విమర్శకులు "ప్రియవాదీచభూతానాం సత్యవాదీచరాఘవః అన్న రాముని కీర్తికి భంగంవచ్చిందని దుఃఖించేవారు దుఃఖింపనిలెండి" అని వ్రాసిరి. వారి యభిప్రాయము ప్రకారమే రాముని పాత్రపోషణమునకు భంగమువాటిల్లినదని తెలియుటలేదా? సీతమ్మ పాత్రకు ఉదాత్తతవచ్చినది కావున రాముని పాత్రకు లోపము వచ్చినను ఫరవాలేదందురా? కవిప్రధానపాత్రలన్నింటిని సమానస్థాయిలో పోషింపవలెనుగాని ఒకపాత్రకు ప్రాధాన్యమును వేఱొకపాత్రకు హైన్యమునాపాదించునటుల చిత్రించుట న్యాయ్యముకాదు. తిక్కనగారి రచనలో లక్ష్మణుని పాత్రకుకూడ లోపము వాటిల్లినది. తనకుఁగలిగిన యపవాదమును పోగొట్టుకొనుటకు రాముడు లక్ష్మణుని సాహాయ్యము కోరగా లక్ష్మణుఁ డంగీకరించి ప్రయాణసమయమున "ఉమ్మలించుచుం జిత్తముఖేదమాననమునఁ జెందిన మాన్పగలేక యుత్తలమందు" చున్నట్లుగా లక్ష్మణుని చిత్రించుట ఆ పాత్రకు లోపమును ఘటించుట లేదా!

వనమునకుఁ బోయినతర్వాత లక్ష్మణుడు రాముని యాజ్ఞను సీతమ్మకుఁ దెలుపును. అప్పుడు సీతమ్మ రాముడు చేసిన యసత్య సంభాషణమునకు మోసమునకు ఎంత యాక్షేపించి యుండవలెను? అట్లాక్షేపించినటుల తిక్కనగారు రచింపలేదే – కాబట్టి రాముడే సీతమ్మను స్వయముగా వనమునకు సాగనంపెనను తిక్కనగారి రచనకంటె వాల్మీకిరచనయే పాత్రపోషణాదృష్టితో చూచిన ఉచితమైనదని నాయాశయము.

మునిపత్నులకని మణిమయభూషణాంబరాదులు సీతమ్మ స్వయముగా తీసికొన్నటుల వాల్మీకిమహర్షి రచించెను కాని మణిమయభూషణాంబరాదులను రాముడే ఋషిపత్నులకని సీతమ్మ కిచ్చినటుల తిక్కనగారు రచించిరి. ఈ సందర్భముననైనను తిక్కనగారి సీతమ్మకంటె వాల్మీకిమహర్షి రచించిన సీతమ్మ మెఱుగని విమర్శకులు వ్రాయలేదు. వనమున ఋషిపత్నులతో విహరింపఁగోరిన సీతమ్మ ఋషిపత్నుల కీయఁదగిన కానుకలను తానే ఏఱికోరుకొనుట యుచితముగదా! లోకములో స్త్రీలకుఁ గావలిసిన చీరలును, ఆభరణములును స్త్రీలేకదా యెన్నుకొందురు. వాల్మీకిమహర్షి చిత్రించిన సీత ఋషిపత్నులకు ఈయవలసిన కానుకలను తానే తీసికొనినది. తిక్కనగారి రచనలో నామె అట్టి మర్యాద లేవియు తెలియనిదిగా చిత్రింపబడినది.

విమర్శకులు మరియు నిట్లు వ్రాసిరి: "గంగానది యవతలియొడ్డున సీతమ్మ కామె పరిత్యాగవార్త తెలిపిన తర్వాత లక్ష్మణుడు వాల్మీకియాశ్రమ మిందే యున్నది. అందు సుఖముగా వసింపుమన్నాడు అంటూ కడపటిదిగా ఒక అధికప్రసంగపుమాట జాఱవిడిచినాడు.'

ఉపవాసపరైకాగ్రా
వసత్వం జనకజాత్మజే

పతివ్రతాత్వమాసాయ
రామంకృత్వా సదాహృది.

లక్ష్మణునినోట ఈ యుపదేశపుమాట రానిచ్చుట ఆ యిద్దఱు వ్యక్తుల యోగ్యతకు చాలనిది, గనుకనే దానిని తిక్కన్నగారు వాల్మీకికే వదలినాడు.

"ఇచ్చట ఉపవాసపరా, ఏకాగ్రా" అను రెండు విశేణములను విధేయవిశేషణములనుగా చేసినచో విమర్శకులు వ్రాసినటుల అనుచితముగా తోపవచ్చును. కాని ఆ రెండు విశేషణములను సామాన్యవిశేషణములనుజేసి ఉపవాసపరా, ఏకాగ్రా, త్వం మహాత్మనః పాదచ్ఛాయా ముపాగమ్య సుఖంవస" అని అన్వయించిన దోషమేమి కలదు? నీవు (స్వభావముచేత) ఉపవాసపరురాలవు, ఏకాగ్రత కలదానవు. అట్టి నీవు పతివ్రతాధర్మము నాశ్రయించి (అనగా ఆత్మహత్యాదులకుఁ బాల్పడక) రాముని సదా హృదయమునం దిడుకొని ఈవాల్మీకియాశ్రమమునందు వసింపుమనుటలో ననౌచిత్యమేమియు లేదని నా యాశయము. కష్టసమయమున పిన్నలుకూడ పెద్దలకు నీతు లుపదేశించుట లోకమున సహజముకదా! ఆపత్సమయమున మన శాంతికె యెవరెనను ధర్మము లుపదేశింపవచ్చును. అట్లుపదేశించినమాత్రమున ఆ ధర్మము లా పెద్దవారికి తెలియవని చిన్నవారు తలచినటుల మనము భావింపరాదు. "బాలాదపిసుభాషిత"మ్మనికదా పెద్దల నానుడి. కాబట్టి లక్ష్మణుని యుపదేశ మనుచితము గాదని నాయూహ.

వాల్మీకిరచన పాత్రపోషణదృష్టితో చూచిన నుచితముగానే యున్నదనియు తిక్కనగారి రచనకు ఆయన కావించిన మార్పులవలన నెట్టి ప్రాశస్త్యముచేకూరదనియు తెలుపుచు నీ వ్యాసము ముగించుచున్నాను.

శ్రీమద్రామాయణోదాహరణము

శ్రీ పాటీలు తిమ్మారెడ్డిగారు

ఉదాహరణ ప్రశంస: "జగత్తంతయుఁ గ్రియారూపము – సర్వక్రియయుఁ బరమేశ్వరునందుఁ బర్యవసించును. ధాతువు సర్వథా విభక్త్యాశ్రయము. ఏ విభక్తితో సంబంధము లేక క్రియలేదు. అందుచేత నన్నివిభక్తులతోఁ బరమేశ్వరునిఁ జెప్పినపుడు భగవంతుఁడు సర్వక్రియాస్థానభూతుఁడని వ్యంగ్యము. ఇది యుదాహరణ కావ్యరహస్యము......"

—కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

వినతి : ఉదాహరణకావ్యము విభక్త్యాశ్రయమగుటచే నిది కథనమున కుపయోగింపదు. కావున నాంధ్రసాహిత్యమున నేఁటిదాఁక వెలువడిన యుదాహరణము లన్నియుఁ గేవలము స్తుత్యాత్మకములు, లేదా ప్రశంసాత్మకములు. అట్టియెడ నేతత్కావ్యలోకమున నుదాహరణమునఁ గథాప్రసంగమును దెచ్చుట కిది సర్వప్రథమయత్నము. సుందరకాండమునఁ గథానాయకుఁడగు రామప్రవేశ

మున కవకాశము లేదు. కావున నందుఁ బ్రేరణ క్రియారూపము లవలంబింపఁబడినవి. ఈ యత్నసాఫల్యమునకు సహృదయ కవిపుంగవులే ప్రమాణము.

—పాటీలు తిమ్మారెడ్డి

బాలకాండము - ప్రథమావిభక్తి

శా. శ్రీమంతమ్ము, సమస్త మానిజన సం
సేవ్యమ్ము, దివ్యమ్ము, శో
భామాంగల్య సురూపపేటిక, లస
ద్భక్తార్థి కల్పాగమున్
శ్యామాంగమ్ము, కిశోరవంద్యమును బ్ర
హ్మాండాధినాథమ్ము నా
రామబ్రహ్మమహామ్మొ లోకమున నా
రాధ్యమ్ము భక్తాళికిన్.

త్రిపుట తాళము - కళిక - వృషభగతి రగడ

సురమునీశ్వర ప్రార్థితమ్మై
క్షోణిఁబుట్టిన విష్ణుతేజము
వరలు కౌసల్యా దశరథే
శ్వరుల కూరిమి పుత్రరాజము
తపసి జన్నముఁ గాచుకొఱకై
తండ్రి పంపఁగఁ జన్న శౌర్యము
నిపుణతను దాటకను గానల
నిలువునను జీలిచిన ధైర్యము
పరమకరుణ నహల్య దగు శా
పమ్ము వాపిన దివ్యచరణము
హరుని ధనువును దునిమి వైచిన
యట్టి శ్రీరఘుకులాభరణము
ధరణి యానందమునఁ బొంగఁగ
ధరణిజను వరియించు పుణ్యము
పరశురాముని బాహుగర్వము
ప్రక్కలించిన శక్తి గణ్యము, ౨

త్రిపుట తాళము - ఉత్కళిక - హరిణగతి రగడ

పౌరజన చిత్తాంబుజమ్ములు
కూరిమిని వికసింపఁ దమ్ములు
వెంటఁ జను దేరంగఁ దల్లులు
కంట మోదాశ్రువుల జల్లులు
కురియఁగా సాకేత సత్పుర
వరము సొచ్చిన దివ్యసుందర
లోకమోహన పుణ్యరాజము
లోకబాంధవ వంశతేజము. 3

అయోధ్యాకాండము - ద్వితీయా విభక్తి

ఉ. ఏను బురాభవమ్మున న
దెంత తపమ్మొనరించి యుంటినో
గాని మునీంద్ర దుర్లభము
గా సకలాగమముల్ వచించు నె
వ్వాని పదాబ్జ భక్తి నటు
వంటి రఘూద్వహు లోకవంద్యు నా
మానస మాశ్రయించినది
మానక రాముని నామధామునిన్. ౪

జంపెతాళము - కళిక - విజయభద్ర రగడ

అభిషేక భంగమున
కనుతపింపని వాని
విభవ సముదాయమును
విడిచి వైచిన వాని
నారచీరలలోన
నగవు లొలికిన వానిఁ
గారడవులకుఁ దండ్రి
కట్టడిని జను వానిఁ
బ్రాతుఁడౌ గుహుని సే
వలకు మెచ్చిన వానిఁ
జిత్రకూటమ్ము వేం
చేసి నిలిచిన వానిఁ

దండ్రి స్వర్గతిని విని
తల్లడిల్లిన వానిఁ
దండ్రి కచటనె తిలో
దకము లిచ్చిన వాని. ౫

జంపెతాళము - ఉత్కళిక - ద్విరదగతి రగడ.

తల్లి సేఁతలను విని
పెల్లు దురపిల్లి చని
రామునిం గొని తెత్తు
నీ మహీతల మిత్తు
నని యెంచి వచ్చు భర
తునకుఁ బ్రేమమున వర
పాదుక లొసఁగి వాని
నాదరించిన వాని. ౬

ఆరణ్యకాండము - తృతీయా విభక్తి.

ఉ. అక్కట యేల భీతిలఁగ
నన్యుల పోలిక, రామనామమే
దిక్కని నమ్మియుండి విభు
దీనశరణ్యు గుణమ్మొతింగియుఁ ?
దిక్కులు పట్టకుండు నొకొ
తేఁకువ దప్పి మహోఘ సంచయ
మ్మక్కమలాక్షుచేత జగ
దార్తి హరుండగు నట్టి రాముచేఁ ? ౭

రూపకతాళము కళిక - తురగవల్గన రగడ

క్రొంచకయ విరాధ దైత్యుఁ
గూల్చినట్టి ఘనునిచేతఁ
బంచవటిని బర్ణశాల
పరిరచించు వానిచేత
శూర్పణఖ విరూపఁ జేసి
సురిగించిన వానిచేత
దర్పమున ఖరాది దైత్య
తతులఁ గూల్చు వానిచేతఁ
గనకమృగము దెచ్చుటకై
కదలి చన్న వానిచేతఁ
గనకమృగాకార దైత్యుఁ
గాలరాయు వానిచేత
సీతకొస మడవి దిరిగి
చింతించిన వానిచేతఁ
బ్రీతి జటాయువునకుం దు
రీయమిచ్చు వానిచేత. ౮

రూపక తాళము - ఉత్కళిక - హయప్రచార రగడ

రాముఁడిటకు వచ్చునెపుడు
రాముని నేఁగాంతు నెపుడు
కన్నులార ననుచు వేచి
తెన్ను లెదురు చూచి చూచి
క్రొత్తికి ఫలములిచ్చు శబరి
కరుసమునను ముక్తిని గురి
పించు దయాసాంద్రుచేత
మించు రామచంద్రుచేత. ౯

కిష్కింధాకాండము - చతుర్థీ విభక్తి

మ. హాన దివ్యనీల రుచితో
దేదీప్యమానమ్మునై
యజశర్వామరనాథ ముఖ్య సుర వం
ద్యమ్మై నితాంతమ్ము ధా
త్రిజ దివ్యానన పద్మసూర్యమయి ప్రీ
తిం జూపు శ్రీరామ చం
ద్ర జగద్వంద్య మహమ్ముకై ప్రణతు
ల్యంతమ్ము గ సేసెదన్. ౧౦

ఏకతాళము - కళిక - హరిగతి రగడ

పవనకుమారుని బుశ్యమూకనగ
ప్రాంతమ్మునఁ గనుగొన్న యతనికై
ప్రవిమలమతి సుగ్రీవునితో మి
త్రత్వము నెరపిన యా ధీరునకై

శరకౌశలమునఁ దాలము లేడిటి
జవమునఁ గూల్చినయట్టి ఘనునకై
పరదారను హరియించిన వాలిని
బరిమార్చిన విక్రమ శీలునకై
ప్రీతిని గిష్కింధారాజ్యము సు
గ్రీవున కిచ్చిన యా రఘుపతికై
యాతతముగఁ దారేయున కప్పుడ
యౌవరాజ్య మిడు జానకిపతికై
జనకసుతాన్వేషణముం జేయఁగ
సకల కపుల రావించు నతనికై
హనుమానున కతివాత్సల్యమున ని
జాంగుళి ముద్రికనిచ్చు నతనికై. ౧౧

ఏకతాళము - ఉత్కళిక - మధురగతి రగడ

ఎవ్వనినామ బలమ్మునఁ గపులే
యెవ్వారునుం జొరఁజాలని గుహలే
వనములె క్రీడలలో వలె దూరిరో
ఘనుఁడగు నా సంపాతిని జేరిరో
జనకజ వృత్తాంతము గనిపట్టిరో
వననిధి లంఘింపఁగ నడుకట్టిరో
యమ్మహనీయ లసన్నామునకై
యిమ్మగు సేవకమందారునకై. ౧౨

సుందరకాండము - పంచమీవిభక్తి

శా. ఘోరాకారము దుస్తరం బగుచు లో
కుల్ భీతిసెందంగ సం
సారాంభోధియెసంగఁ దారకముగా
శంభుండు ప్రేమమ్మునన్
శ్రీ రామప్రభు నామమిచ్చునెపుడున్
జీవాళి, కాశ్యామలా
కారుండైన రఘుప్రవీరువలనన్
గాంక్షింతుఁ గైవల్యమున్. ౧౩

రూపకతాళము - కళిక - తురగవల్గనరగడ

వారిరాశిఁ గ్రోతికిఁగా
ల్వాగ నొనర్చువానివలన
వారక లంకిణినిబట్టి
వధింపించువానివలన
లంక నెల్ల వెదకించెను
రాత్రియెవ్వఁ డతనివలన
జంకు మాని యశోకవనిఁ
జదిమించిన యతనివలన
శిక్షితులుగ దానవులను
జేయించినవానివలన
నక్షయాదులను యమపురి
కంపజేయువానివలన
నింద్రజిత్తుచేత హనుమ
నిరికించినవానివలన
సాంద్రదైత్యసభనుదూత
సరగ నిలుపువానివలన. ౧౪

రూపకతాళము - ఉత్కళిక - హయప్రచారరగడ

పవనపుత్రు వాలమందు
రవులుకొనఁగ నగ్నినిందు
శీతలముగఁ జేసి వాని
చేతలంక నెల్లఁబూని
ఛటచ్ఛటా రావములను
పటుతరముగ హర్మ్యములను
గాల్పించిన వానివలనఁ
గల్పాబ్ధ్యద్యధినాథువలన. ౧౫

యుద్ధకాండము - షష్ఠీవిభక్తి

చ. శరణము నాకు రాముఁడని
సర్వవిధమ్ముల భక్తియుక్తిఁ ద
చ్చరణము లాశ్రయించునెడ
స్వామి యదెంతటి పాపినేని నా

కరము సెలంగఁ గాచును స
దా, శరణాగతవత్సలుండు నా
విరుదున కెక్కు భానుకుల
వీరునకే ఘటియింతు నంజలుల్. ౧౬

ఏకతాళము - కళిక - హరిగతిరగడ

శరణనివచ్చిన యంతటన విభీ
షణునకు నభయమ్మిచ్చిన పరునకు
శరనిధినింకిం చెదఁగనుఁడీనా
శరకౌశలమని పలికిన వరునకు
శరనిధిపైఁ గోఁతులచే సేతువు
సరభసముగ గట్టించిన యతనికి
దురమున నింద్రజిదకంపనాదుల
దోడ్తోడనదునిమించిన యతనికి
రావణఘటకర్ణప్రముఖ మహా
రాక్షసనాథుల రాచినస్వామికి
రావణు సోదరునకు నాలంకా
రాజ్యమ్మిచ్చిన దయాతిభూమికి
మృతులయి రణభూమినిఁబడుశాఖా
మృగముల బ్రదికంజేసిన విభునకుఁ
గుతుకమ్మునఁ జిచ్చురికినజానకి
గూరిమితోఁ జేపట్టిన ప్రభునకు. ౧౭

ఏకతాళము - ఉత్కళిక - మధురగతిరగడ

పుష్పములను గురియగ సురగణములు
పుష్పకమెక్కి ప్లవంగమ గణములు
జయవెట్టంగ నయోధ్యాపురమ్ము
రయమునఁ జేరియు జగములు కరమ్ము
మోదింపఁగ నభిషిక్తుండై జన
మోదకరమ్ముగ రాజ్యమ్మేలిన
సజలఘనఘనాఘనశ్యామునకు
నజరుద్రాదిక వంద్యనామునకు. ౧౮

ఉత్తరకాండము - సప్తమీవిభక్తి

చ. యుగము లవెన్నిమాఱిన న
హో యదె రాముని రాజ్యమంచు ము
జ్జగములు మాటిమాటికిఁ బ్ర
శంసయొనర్పఁ బ్రజాళియెల్లఁ జ
ల్లగ నిదురించునట్లుగ ధ
రాపరిపాలన మాచరించు నీ
జగదభివంద్యుఁడైన రఘు
చంద్రునియందు రమించుఁ జిత్తముల్.

జంపెతాళము - కళిక - విజయభద్రరగడ

అజరుద్రమఘువ ము
ఖ్యామరేడ్యునియందుఁ
బ్రజలకై సతిఁగూడ
వదలు జనపతియందు
హయమేధ దీక్షితుం
డైన సత్ప్రభునందు
నయముగాఁ దొలికావ్య
నాథుఁడగు విభునందుఁ
గుశలవుల కూర్మిజన
కుండయిన ఘనునందు
విశదముగఁ దనగాథ
విన్న పుణ్యునియందు
లవణసంహారకా
రణుఁడైన పరునందు
భవజలధి దాఁటింప
వలఁతియగు స్థిరునందు. ౨౦

జంపెతాళము - ఉత్కళిక - ద్విరదగతిరగడ

అవతారకార్యమ్ము
భువిఁదీర్చి సర్వమ్ము
దేవతలు ప్రార్థింప
నావిమానముఁ బంప

సాకేతపురి మాటి
వైకుంఠమును జేరి
జగదవనమునయందు
నెగడు శాశ్వతునందు. ౨౧

అద్యతనకాండము - సంబోధన ప్రథమావిభక్తి

ఉ. ఎందఱొ వెన్నిరీతుల ర
చించియుఁ దావకదివ్యగాథ తా
నందముఁ జిందునెప్పుడు న
హా సుపవిత్రము నిత్యనూత్నమై,
యందులకేగదా సుకవు
లన్నివిధమ్ములఁ బాడుచుందు రా
నందముపొందు కోరిక మ
నమ్ముల నీకథ రాఘవేశ్వరా. ౨౨

త్రిపుటతాళము - కళిక - వృషభగతిరగడ

ప్రేమతో గోదావరీతటి
వెలయు భక్తజనార్తిహరణా
రామదాస వినిర్మితాలయ
రమ్యధామా, దివ్యచరణా
కడకుఁ దానీషానుగని రూ
కలను జెల్లించిన యుదారా
తడయకను నిజభక్తునిం బం
ధములు విడిపించిన గభీరా
శాశ్వతమ్ముగఁ బోతనాదుల
సత్కృతుల నెలకొన్న రామా
విశ్వనాథుని కల్పకమ్మున
వెలయు సుకవిహృదబ్జధామా
త్యాగరాజ సుకీర్తనములకు
దక్కిపోవు మహానుభావా
ఏగతి న్నిన్నెవరుగొలిచిన
నెల్లరను బాలించుదేవా. ౨౩

త్రిపుటతాళము - ఉత్కళిక - హరిణగతిరగడ

* ప్రేమఁ దులసీదాసువ్రాసిన
రామచరితముఁ దెనుఁగుసేసిన
వారలను గేశవకిశోరులఁ
గూరిమిని సకలాఘదూరులఁ
జేసి తావకపాద భక్తిని
వాసిగా నాపిదప ముక్తిని
గటాక్షింపఁగ నిలుచురామా
నిటాలేక్షణవినుతనామా. ౨౪

సార్వవిభక్తికము - మత్తేభవిక్రీడితము

భగవంతుండవు నీవ - నిన్ను మదిలో
భావింతునేవేళ - నా
వగనీచేహృతమా - నమస్కృతులు పా
ల్పారుఁ సదా నీకునై
జగతీవాసనలెల్ల నీవలన నా
శమ్మౌను - నీకున్నతుల్
తగునీయందలిభక్తి - భద్రగిరినా
థా రామచంద్రప్రభూ. ౨౫

అంకితాంకము - సీసము

శ్రీరామదివ్యచరితమానసాది స
త్కావ్య నిర్మాణైక కర్మఠుండు
పాటీలువంశాబ్ధి పార్వణచంద్రుఁ డం
కంపల్లి వాసుఁడు ఖ్యాతుఁడైన
గోవిందరెడ్డికిఁ గూరిమితనయుండు
విశ్వనాథమహాకవీంద్రు శిష్యుఁ
డలకిశోరాఖ్యఁ బ్రఖ్యాతుఁడౌ వాఁడు తి
మ్మారెడ్డియభిదఁ బెంపారువాఁడు
ఆంధ్రదైవమటంచు విఖ్యాతిఁగొన్న
భద్రగిరిరామభద్రుని భవ్యదివ్య
భక్తజనవంద్యపావన పాదనీర
జాంకితముగ నీచిన్నికావ్యమ్ముఁగూర్చె.

ఓం శ్రీరామచంద్రార్పణమస్తు.

---

* శ్రీరామచరితమానసము : అనువాదకులు:— శ్రీ కేశవతీర్థస్వామి, శ్రీ పాటీలు తిమ్మారెడ్డి—1966 లో వెలువడిన ఉత్తమకావ్యముగా ఆంధ్రప్రదేశ ప్రభుత్వమువారిచే రు. 1116 ల బహుమతి నందినది. పిడుగురాళ్ల రామతీర్థ సేవాశ్రమమువారి ప్రచురణ.

శుకోపదేశము

[రావణునకు శుకుఁడు చేసిన హితోపదేశము]

"ఆర్షకవి శిరోమణి" విద్వాన్ బులుసు వేంకటేశ్వరులుగారు

చ. అనుపమ పుణ్యమూర్తులు మహాత్ములు రావణ సార్వభౌమ, ఆ
యనుజులు రామలక్ష్మణులు నట్లు విభీషణుఁడున్ గపీంద్రుఁడున్
గనఁగ మహామహుల్ ఘనులు నల్వురు నున్న పవిత్రభూస్థలిన్
విను మసురేంద్ర, సర్వమును విస్ఫుటమున్ క్షణమాత్ర సాధ్యమున్. 1

ఉ. లంకను బెల్లగించుటకు లంకను భస్మమొనర్పఁగంటకున్
శంకయె లేక యొక్కత్రుటి సర్వము నాశమొనర్పఁగంటకున్
శంకర సన్నిభుల్ పరమశౌర్యనిధానులు వారు నల్వురే
వంకకునైనఁ జాలుదురు వానరసైన్యము నిద్రపోవఁగన్. 2

ఉ. రాముని రూపమున్ మఱి పరాక్రమమున్ బల మాయుధంబులన్
స్తోమత చూడ నొక్కఁడె వసుంధర సర్వము నాశనంబుగా
నోమును జేయ ముప్వురును నూరకయుండఁగ వచ్చు వారికై
యేమియు శేమ ముంపఁ డీఁక నింతటిధైర్యపరాక్రముం డగున్. 3

గీ. రాముఁడు నరుండు కాఁడు, పరాత్పరుండు ఆదినారాయణుండు సత్యంబు వినుము
సకలవిశ్వప్రహేతు చిచ్ఛక్తి సీత, ఆమె జగదాత్మికయె సంశయంబు లేదు. 4

క. సీతారాముల వలననె, యేతద్విశ్వంబు పుట్టె నిటు స్థావరమున్
భూతాత్మక జంగమమును, బ్రీతిని దెలియంగనౌను విజ్ఞుల కెల్లన్. 5

శా. సీతారాములు లోకజాలమునకున్ జెన్నారు మాతాపితల్
ప్రీతిన్ వారలఁ గొల్చువారికె శుభశ్రేణుల్ లభించున్ గడున్
ఖ్యాతిన్ గాంతురు వారె వారిరిపు లాహా! యెట్లు జీవింత్రు? దు
ర్నీతిన్ సీతను లోకమాత నపహారింపంగ నెట్లోపితో? 6

చ. క్షణమున నాశనంబగును సంస్కృతి; అందు శరీర మింకనున్
క్షణికము; పంచభూతములసంగతి నిర్వదినాల్గు తత్త్వముల్
గణముగఁ జేర నేర్పడియెఁ; గల్మషసంయుత మస్థిమాంసముల్
మిణికెఁడునేహ్యపున్ స్థలము మిక్కిలిదూష్యము సర్వవేళలన్. 7

గీ. పరమదుర్వాసనకుఁ జోటు, దురితములకు ఆటపట్టు, అహంకృతి కాలయంబు
జడము నగుకాయమందు ఆజడముకాని నీకు మమకార మేల ? యత్నించి చూడు. 8

శా. ఏ దేహార్థము బ్రహ్మహత్య మొదలౌ నెన్నో కృతుల్ చేసినా
వే దేహంబు సమస్తభోగములఁ దా నింపారఁగాఁ బొందునో
ఏ దేహంబును సర్వకాలముల నీ వెంతెంతగా నింపితో
ఆ దేహంబు నశించు నిచ్చటనె, నీ వద్దానికై యేడ్తువే ? 9

గీ. కనఁగ సుఖదుఃఖవితతికిఁ గారణములు పుణ్యపాపము, లవియె జీవునికి వెనుక
వచ్చుచుండును ఆపుణ్యపాపము, లవి దేహసుఖదుఃఖవితతిని దెచ్చుచుండు. 10

గీ. నేను దేహము ననుబుద్ధి నిల్చువఱకు, నేను చేయుదు ననుబుద్ధి నిల్చువఱకు
అవశుఁడయి భ్రమ గాంచి యహంకరించు, అంతవఱకును జని మృతి అగుచునుండు. 11

గీ. అందువలన దేహాదులయందుఁ గలుగునట్టి యభిమానమున్ వీడుమయ్య, నీవు.
ఆత్మ శుద్ధము నిర్మల మవ్యయమును అచల మద్వయ మమృతము నచ్యుతంబు. 12

గీ. తన్నె యజ్ఞానవశమునఁ దా నెఱుఁగక, బంధనముఁ గాంచి మోహలంపటతఁ గాంచుఁ
బరగ నీవును శుద్ధభావంబుఁ గాంచి, ఆత్మ నెఱిఁగి స్మరింపుమీ అహరహంబు. 13

గీ. పుత్రదారగృహాదులఁ బొందక తమి, విరతి నందుము నీ వెల్ల వేళలందు
నరకదాయక భోగముల్ పరగుచుండుఁ, గుక్కలకుఁ బందులకుఁబోలెఁ గుమతులకును.

ఉ. సారవివేకసంపదకుఁ జాలిన దేహముఁ దాల్చి, యందు నిం
పారెడు బ్రాహ్మణత్వమును భవ్యముగాఁ గని, యంతెకాక యీ
భారతకర్మభూమిపయిఁ బ్రాభవమంది సుదుర్లభంబుగన్
సూరుఁడు దేహ మాత్మ యని చొచ్చునె భోగము లంద మూర్ఖుఁడై ? 15

గీ. బ్రాహ్మణుండవు పౌలస్త్యవరసుతుఁడవు, భవ్యజన్మంబుఁ గాంచినవాఁడవౌట
అజ్ఞునింబోలి భోగంబు లందుఁ దగిలి, వ్యర్థపుచ్చకు నీజన్మ మసురవర్య. 16

గీ. ఇంకనైనను సంగంబు లెల్ల వీడి, భక్తిభావను వహియించి భవ్యముగను
రామచంద్రుఁ బరాత్పరు రక్తిఁ గొల్చి, ఆశ్రయింపుము రామపాదాంబుజములు. 17

గీ. సీత నర్పించి రాముని చెంతఁ జేరి, అతని పాదానుచరుఁడవై అలరుమయ్య !
సర్వపాపంబులున్ వినష్టములు గాఁగ, విష్ణులోకంబుఁ గనుము వివేకబుద్ధి. 18

గీ: అట్లు చేయంగఁ దలపూనవైతివేని, వచ్చుచున్ బోవుచున్ బుచ్చువాఁడవాఁడు
వినుము నామాట విని క్షేమమును గడింపు, నీహితంబును గోరి విన్నవించినాఁడ. 19

మ. వరభక్తవ్రజసంగతిం గనుము శశ్వద్భక్తవాత్సల్యుఁ డా
హరియే దిక్కని ఆశ్రయింపుము సునైల్యాభున్ రఘుశ్రేష్ఠు సుం
దరసీతాసమవేతు హస్తధృతకోదండున్ మహాబాహు సో
దరసుగ్రీవ విభీషణార్చితపదున్ ధన్యాత్మ సేవింపుమీ !" 20

[నా "నిర్వచనాధ్యాత్మరామాయణము" నుండి]

హనుమంతుఁడు

డాక్టరు దివాకర్ల వేంకటావధానిగారు

గోష్పదీకృతవారాశిం
మశకీకృతరాక్షసం
రామాయణమహామాలా
రత్నం వన్దే ఽనిలాత్మజమ్

అంజనానందనంవీరం
జానకీ శోకనాశనం
కపీశమక్షహంతారం
వందే లంకా భయంకరమ్

ఆంజనేయ మతిపాటలాననం
కాంచనాద్రి కమనీయవిగ్రహం
పారిజాత తరుమూలవాసినం
మారుతిం నమత రాక్షసాంతకమ్.

మనోజవం మారుతతుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం
వాతాత్మజం వానరయూథముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి.

ఇవి సాధారణముగా భక్తులెల్లరును పఠించుచుండు హనుమత్స్తోత్రశ్లోకములు. ఇందలి విశేషణములను ప్రపంచించి చూచినచో హనుమంతుని జననరూపగుణశీలవీర్యపరాక్రమ మహత్త్వాదులన్నియు సమగ్రముగాఁ దెలియవచ్చును. పాత్రపోషణకౌశలమున కృతహస్తుఁడైన ఆదికవి రామాయణమహాకావ్యమున నాతని గుణశీలములను చక్కగా తీర్చి దిద్దినాఁడు. ఒక్క వానరవీరులలోనే కాక రామాయణవర్ణిత సర్వపాత్రలందు నాతఁడు ప్రత్యేకప్రకాశముతోఁ గనవచ్చును. రామాయణ మహామాలారత్నమని యాతనికి వాడఁబడిన విశేషణ మెంతయు నన్వర్థము.

ఉత్తరరామాయణమున హనుమంతుని జననవృత్తాంతము విశదముగ వర్ణింపఁబడినది. అతఁడు రుద్రాంశమున పార్వతీదేవి కుక్షిని గొంతకాలము వృద్ధినొంది, పిదప పావకుని యందుఁ గొన్నాళ్లు వర్తించి, తరువాత పవన గర్భాంతఃస్థుఁడై భాసిల్లి, యనంతరము పవనుని వరముచే కేసరి కళత్రమైన అంజనకుఁ బుత్త్రుఁడుగా జనించెను. అతఁడు జన్మింపఁగనే తల్లి ఫలములు తెచ్చుట కడవికరుగ నతఁ డుదయించు సూర్యునిగాంచి పండని భ్రమించి

యాతనిపై కేగసెను. నాఁడు పర్వమాటచే నాసమయమున రాహువు సూర్యుని బట్టుటకై వచ్చెను. హనుమంతుఁ డంత సూర్యగ్రహణము మాని నల్లనిపండు లభించెనని సంతసించుచు నాతని బట్టుకొనెను. రాహువు భీతుఁడై పరుగెత్తుకొనిపోయి యీ విషయమంతయు నింద్రుని కెఱింగించెను. ఇంద్రుఁడు కుపితుఁడై యైరావతము నెక్కి యచ్చటి కరుదెంచి తన యేనుఁగును హనుమంతునిపైఁ గవియించెను. హనుమంతుఁ డైరావతమును గాంచి తెల్లని పండని భ్రమించి దానిపై కెగిరెను. ఇంద్రుఁ డంత నాతనిపై వజ్రాయుధము విసరెను. అది వామహనువును నొప్పించుటచే హనుమంతుఁడు మూర్ఛాక్రాంతుఁడై పూర్వాద్రిపైఁ బడెను. అట్లు పడిన కుమారునిగాంచి పవనుఁ డాగ్రహావిష్టుఁడై జగములెల్లను నిండిన యాత్మమూర్తి నుపసంహరించి, పుత్రునితోఁగూడ నొకశైల గుహాకుహరముచొచ్చెను. వాయువు స్తంభించిన కారణమున లోకులెల్లరును దల్లడిల్లిరి. అంతఁ దాపసులు బ్రహ్మకడకేగి రక్షింప వేడుకొనిరి. బ్రహ్మ జరిగినదంతయు నెఱింగి ఋషులతోఁ గూడి వాయువున్న శైలగుహకడ కరిగెను. వాయువంతఁ గొడుకును గొనివచ్చి బ్రహ్మకు మ్రొక్కెను. బ్రహ్మ దయాళువై మూర్ఛితుఁడైన హనుమంతుని మేను నిమిరెను. హనుమంతుని మూర్ఛ తొలంగెను. వాయువు సంతుష్టుఁడై మరల వీవఁదొడంగెను. లోకములు యథాపూర్వముగ నుత్సాహమునఁ జెలంగెను. పిమ్మట బ్రహ్మయు దేవతలును హనుమంతునికి వరము లొసంగి తమ తమ నెలవుల కరిగిరి. వాయువు హనుమంతుని గొనివచ్చి అంజనాదేవి కొసంగెను. తరువాత హనుమంతుఁడు బాల్యచాపల్యమున నంతిక మున్యాశ్రమములుచొచ్చి మునుల వల్కలాజినములు ప్రచ్చి వందఱలాడఁగా వారు కోపించి యతఁ డాత్మశక్తి యెఱుంగకుండుఁ గాక యని శపించిరి. అంత హనుమంతుఁడు పశ్చాత్తప్తుఁడై యా తాపసులకు సేవ కావించుచుఁ గొంతకాలముండి పిదప సుగ్రీవుని జేరి యాతనికి మంత్రి యయ్యెను.

బ్రహ్మాదులు వరము లిచ్చు సందర్భమున నినుఁడు "నా తేజమున శతాంశమును విద్యలను నొసంగెద" నని పల్కియుండుటచే హనుమంతుఁ డది స్మరించి, శ్రుతు లధ్యయనము చేయు నుద్దేశముతో నద్భుతమైన వేగమున సూర్యుని కడకేగెను. సూర్యుఁడు సంతోషించి "వత్సా, నిత్యసంచార మొనరించు నాకడ నీవెట్లు విద్యాభ్యాసము కావింతువు? చండభానుఁడైన నాముం దెవ్వరును నిల్వఁజాలరు కదా! అదియునుగాక వేగముగాఁ బోవుచుఁ జదువు సాగించిన మనస్సున కేకాగ్రతగలుగుట దుర్లభ" మని పల్క హనుమంతుఁ డుదయాస్తాచలములఁ బాదయుగళమునిల్పి తొల్లి త్రివిక్రమునివలె నూర్ధ్వకర్పరమెల్ల నావరించి కనఁ బడెను. సూర్యుఁ డద్భుతాక్రాంతచిత్తుఁ డయ్యెను. హనుమంతుఁడు నిజరూపము ధరించి సూర్యుని యరదమున కెదురై యాకాశమార్గమున వేగముతోఁ బోవుచు వేదశాస్త్రాదు లన్నియు నభ్యసించెను. అతని విద్యాజ్ఞాన గ్రహణకళావిశేషములకు సూర్యుఁ డెంతయు సంతోషించెను.

పై వృత్తాంతములవలన హనుమంతుని వేగ పరాక్రమ విజ్ఞాన మహత్త్వములు తేటతెల్లము లగుచున్నవి. శతయోజనవిస్తీర్ణమైన సముద్రము దాఁటుటెట్లని వానరులందఱును విషణ్ణులై యుండినప్పుడు జాంబవంతుఁడు హనుమంతుని బుద్ధిబలవిక్రమాదులను ప్రశం

సించెను. వాయు వంజనతో "వీర్యవాన్ బుద్ధిసంపన్నః పుత్రస్తవభవిష్యతి, మహాసత్త్వో మహాతేజా మహాబలపరాక్రమః, లంఘనే ప్లవనే చైవ భవిష్యతి హి మత్సమః" అని చెప్పిన ట్లాతఁడు వివరించెను. సుగ్రీవుఁడు సీతాన్వేషణమునకై కపులను బంపుచు హనుమంతునిగూర్చి "గతిర్వేగశ్చ తేజశ్చ లాఘవంచ మహాకపే, పితుస్తే సదృశం వీర, మారుతస్య మహౌజసః, త్వయ్యేవహనుమన్నస్తి బలం బుద్ధిః పరాక్రమం దేశకాలానువృత్తిశ్చ నయశ్చ నయపండిత" అని పల్కియుండెను. వాల్మీకి యాతనికి మహాప్రాజ్ఞః, మహానుభావః, సర్వశాస్త్రవిదాం వరః మున్నగు విశేషణములు వాడియుండెను. అతఁడు సర్వసద్గుణసంపూర్ణుఁడు. ఉచితానుచితపరిజ్ఞానమున నాతని కాతఁడే సాటి. దానితోపాటాతనియందు బుద్ధిసంపద, ఔదార్యము, మితహితసత్యవాక్చాతుర్యము, వినయము మున్నగు నుత్తమగుణము లెన్నో పుంజీకృతములై యున్నవి. ఉదాత్తగుణము లిన్నియొక్కచోఁ గూడియుండుట చాల అరుదుగాఁ గనిపించును. అందుచేతనే సీతాన్వేషణమునకై వానరులరుగునప్పుడు రాముఁడు స్వ నామాంకితమైన యంగుళీయకమును హనుమంతునికే యొసంగెను.

హనుమంతుని వాక్చాతుర్యమద్వితీయమైనది. ఈ వాక్చాతుర్యము సాహాయ్యమున నే ఆతఁడు రామసుగ్రీవులకు సఖ్యము కలిగింపఁజాలెను. ప్రప్రథమమున హనుమంతుఁడు తనతోఁ బల్కిన పల్కులు విని రాముఁ డాశ్చర్యచకితుఁడై లక్ష్మణునితో "నానృగ్వేదవినీతస్య నాయజుర్వేదధారిణః నా సామవేదవిదుషః శక్యమేవం ప్రభాషితుమ్, నూనం వ్యాకరణం కృత్స్నమనేన బహుధాశ్రుతం బహువ్యాహరతానేన నకించి దపశబ్దితమ్, అవిస్తరమసందిగ్ధమవిలంబితమద్రుతమ్ ఉరస్థం కంఠగం వాక్యం వర్తతేమధ్యమే స్వరే, సంస్కారక్రమసంపన్నా మద్రుతామవిలంబితా ముచ్చారయతికల్యాణీం వాచం హృదయహారిణీమ్ (కి. 3)" అని ప్రశంసాపూర్వకముగాఁ బల్కియుండెను. అశోకవనమున రాక్షసీమధ్యగతయై కలఁతనందుచున్న సీత నాశ్వాసించుట యెట్లా యని హనుమంతుఁడు బహువిధముల నాలోచించెను. "యదివాచం ప్రదాస్యామి ద్విజాతి రివసంస్కృతామ్, రావణం మన్యమానా మాం సీతా భీతాభవిష్యతి" (సుం. 30–18) అని తలంచుట యాతని యసాధారణవిచక్షణతను సూచించుచున్నది. అతఁడు శ్రీరాముని గుణగణములను కీర్తించి, అశోకవృక్షమునుండి దిగి, వినీతవేషుఁడును బద్ధాంజలియునై భయోద్విగ్నయై యున్న సీతతోఁ పల్కిన మధురవాక్యము లాతని వాక్చాతుర్యమును వేయివిధములఁ జాటుచున్నవి. సీతకు విశ్వాసము కలిగించుటకై యాతఁ డవలంబించినవిధానము ప్రశంసనీయమైనది. రావణుని కొలువున నాతఁడు ప్రకటించిన వాఙ్నైపుణ్య మింతంతనరానిది. "త్వయావిజ్ఞాతపూర్వశ్చ వాలీవానరపుంగవః స తేననిహతస్సంఖ్యే శరేణైకేనవానరః" అను శ్లోకమున నాతఁడు రాముని యప్రతిమానపరాక్రమమును వ్యంగ్యముగా సూచించెను. వాలిపరాక్రమమును రావణుఁడు లెస్సగా నెఱుంగును. అతఁ డతనిని తోఁకతోఁజుట్టి సప్తసముద్రములలో ముంచియుండెను. అట్టి వానిని రాముఁ డొక్కబాణముతో సంహరించెనని చెప్పుటయందలి వ్యంగ్యమును గ్రహించి రావణుఁ డాతని రాజనీతికౌశలమునకును వాక్చాతుర్యమునకును ఆశ్చర్యచకితుఁ

డయ్యెను. వాక్యజ్ఞుఁడు, వాక్యవిశారదుఁడు, వాగ్మి, మధురభాషి మున్నగు విశేషణము లాతని కెంతయుఁ దగియున్నవి.

హనుమంతుఁడు కార్యాచరణదక్షుఁడు. అసాధ్యకార్యములనుసైత మతఁ డవలీలగా నొనర్చెను. యుద్ధకాండారంభమున "కృతం హనుమతా కార్యం సుమహద్భువిదుర్లభమ్ మనసాపి యదన్యేన నశక్యం ధరణీతలే (యు. 1-2) అని రాముఁ డతనిగూర్చి పల్కియుండెను. సాగరలంఘనము, లంకలో నొంటరిగాఁ బలుమంది రాక్షసులతోఁ బోరి విజయము గాంచుట, లంకాదహనము, సంజీవిపర్వతానయనము మున్నగు కార్యము లన్యులకసాధ్యములైనట్టివి. అతఁ డేకార్యము నొనరించినను బాగుగా విమర్శించి యుపాయముతో నొనరించును. "కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపిసాధయేత్ పూర్వకార్యావిరోధేన సకార్యం కర్తుమర్హతి" అని యాతఁడు పల్కుటవలన నేకక్రియచే బహుప్రయోజనములను సాధింపఁజాలుట కార్యాచరణసమర్థుని లక్షణమని యాతఁడు భావించినట్లు తెలియుచున్నది. అతఁడు బాగుగా నాలోచించియే లంకలోఁ బరాక్రమప్రదర్శనము కావించినట్లు "నసామరక్షస్సుగుణాయకల్పతే, నదానమర్థోపచితేషుయుజ్యతే, నభేదసాధ్యాబలదర్పితా జనాః, పరాక్రమస్త్వేవమ మేహరోచతే" యను శ్లోకమువలనఁ దెలియుచున్నది. ఎంత దుష్కర కార్యమునైనను అతఁ డుపాయముతోడను, ధర్మబుద్ధితోడను ఒనరించునని సుగ్రీవుఁడు పలుసార్లు చెప్పియున్నాఁడు.

హనుమంతుని సమయస్ఫూర్తి చాల గొప్పది. అతఁడు ప్రదోషకాలమున లంకానగరమును బ్రవేశించెను. నిజరూపముతో లంకఁజొచ్చుట యుచితముకాదని యాతఁడు పృషదంశకమాత్రశరీరుఁడై యన్వేషణమునకు బయలుదేఱెను. సురసాసింహికలు విఘ్నమాచరించినప్పుడుకూడ నుపాయమున సంక్షిప్తశరీరుఁడై విజయము పొందఁజాలెను. అశోకవనమున నతఁడు రాక్షసస్త్రీలు నిద్రించినపిమ్మటగాని సీతతో సంభాషించుటకుఁ గడంగఁడయ్యెను. అప్పుడైనను వెంటనే యామె ముందు నిలఁబడినచో నామె యనుమానించునని దశరథరామచంద్రులగుణ సంకీర్తనము కావించి యామెకుఁ గొంత విశ్వాసము కల్పించి యామెతో మాటాడుటకు మొదలుపెట్టెను. ఈవిధముగా నతఁ డేకార్యము నెట్లాచరించినను ఉపాయశాలిత్వమును సమయస్ఫూర్తిని బ్రదర్శించును.

హనుమంతుని బలపరాక్రమ జవసత్త్వములు నాన్యతోదర్శనీయములు. అతఁడు మనోజవుఁడు. మారుతతుల్యవేగుఁడు. వాల్మీకి యాతని వేగమును సాధారణముగా మనోమరుద్గరుడుల వేగముతోఁ బోల్చుచుండును. అన్యదుష్కరమైన సముద్రలంఘన మాతని యపారజవసత్త్వములకుఁ దార్కాణము. సురసాసింహికలను నిర్జించుట, లంకిణి నోడించుట, లంకలో రాక్షసులనే కాక అక్షయకుమారునిగూడ సంహరించుట, యుద్ధమునఁ బలుతెఱఁగుల విజృంభించుట యతని యద్వితీయ పరాక్రమమునకు నిదర్శనములు. ఉత్తరకాండమున నగస్త్యుఁ డాతఁడు వాలిరావణుల కంటెఁ గూడ బలవత్తరుఁడనియుఁ బరాక్రమమందు వలెనే బుద్ధికౌశలమునందును అప్రతిమానుఁడనియు వర్ణించియుండెను. రాక్షసులు కొలువునకుఁ గొనివచ్చిన హనుమంతునిగాంచి రావణుఁడు "కిమేష భగవాన్నందీ భవేత్సాక్షాదిహాగతః, యేనశప్తోఽస్మి కైలాసేమయా సంచాలితేపురా" అని శంకించెను. అతని తేజో

రూపాతిశయము లట్టివి. అతఁడు సీత నోదార్చుచు "త్వాంతు పృష్ఠ గతాం కృత్వా సంతరిష్యామి సాగరమ్, శక్తి రస్తి హి మే వోఢుం లంకామపి స రావణామ్" అని చెప్పుటలో నతిశయోక్తి యిసుమంతయు లేదు. కాని సీత సామాన్య వానరాకారములో నున్న యాతని గాంచి "కథం వాల్ప శరీరస్త్వం మా మితో నేతు మిచ్ఛసి" యని యనుమానించుచుఁ బలుక నాతని కా పలుకువలన నూతనమైన పరాభవము కలిగిన ట్లనిపించెను. అంత నాతఁడు సీతకుఁ బ్రత్యయము కలిగించుటకై పర్వతసంకాశమును భీమమునైన రూపమును బ్రదర్శించెను. అప్పుడు సీత యచ్చెరువంది "తవసత్త్వం బలం చైవ విజానామి మహాకపే వాయోరివ గతించాపి తేజశ్చాగ్నే రి వాద్భుతమ్" అని యాతనిఁ బ్రశంసించెను.

హనుమంతుఁడు మహా వినయసంపన్నుఁడు, అవికత్థనుఁడు. ఆరంభమున రామలక్ష్మణుల తోడను అశోకవనమున జానకితోడను ఆతఁడు పల్కిన పల్కులు వినయసంపదకుఁ బట్టుగొమ్మలు. అతఁడు సీతతో నితర వానరవీరులు తనకంటె బలసంపన్నులనియు, నప్రకృష్టులే సాధారణముగా దూతభావమునఁ బంపఁబడుదురనియుఁ జెప్పియుండెను. ఇది యాతని వినయమును ఆత్మప్రశంసావైముఖ్యమును సూచించుచున్నది. శత్రువులందైనను గుణము లున్నచో నాతఁడు హృదయపూర్వకముగాఁ బ్రశంసించును. రావణుని వీక్షింపఁగనే యాతఁడు "అహోరూప మహో ధైర్య మహోసత్త్వ మహోద్యుతిః, అహోరాక్షస రాజస్య సర్వలక్షణ యుక్తతా" అని యాతని రూపగుణ విశేషముల నుగ్గడించెను.

హనుమంతుఁడు పరేంగితజ్ఞుఁడు. ఆకార దర్శనమాత్రమున నాంతర మహత్త్వమును గుర్తింపఁజాలిన బుద్ధిశాలి. అశోకవనమున సీతను జూడఁగనే యాతఁడు ప్రహృష్టుఁడై రాముని స్మరించి, "త్రైలోక్య రాజ్యం సకలం సీతాయా నాప్నుయా త్కలామ్" అని భావించెను. రావణాంతఃపురమున సీతకై వెదకుచు నాతఁడు "పరదారావరోధస్య ప్రసుప్తస్య నిరీక్షణమ్, ఇదం ఖలు మమాత్యర్థం ధర్మలోపం కరిష్యతి" అని తనచర్య ధర్మవిరుద్ధమేమో యని భయమందెను. కాని స్త్రీలను స్త్రీలలోనే వెదకవలయును గాని మృగాదులందు వెదకరాదు గదా యని సరిపెట్టుకొనెను. రాత్రివేళ వివిధాకృతులతో వివిధస్థితులలో నున్న స్త్రీలను జూచినను అతని మనస్సున నించుకంతయు వికృతి జనింపకుండుట యాతని జితేంద్రియతను ధర్మపరాయణత్వమును సూచించుచున్నది. అతఁడు సీతను దానే రామునికడకుఁ గొనిపోదునని పలుక సీత రాముఁడు రావణుని సంహరించి తన్నుఁ గొనిపోవుట యాతని యుదాత్తత కనుగుణముగా నుండునని తన యభిప్రాయమును సూచించెను. అప్పుడాతఁడామె యాభిజాత్యాభిమానములను గ్రహించి "యుక్తరూపం త్వయా దేవి భాషితం శుభదర్శనే, సదృశం స్త్రీ స్వభావస్య సాధ్వీనాం వినయస్యచ" అని యామెను బ్రశంసించి తన యౌచిత్య పరిజ్ఞానమును బ్రకటించెను. "జితేంద్రియః-బుద్ధిమతాం వరిష్ఠః" అను విశేషణము లాతనియెడ మిక్కిలి సార్థకములు.

హనుమంతుని స్వామిభక్తి యచంచలమైనది. తాను బుద్ధిమద్వరిష్ఠుఁడైనను, బలసంపన్నుఁడైనను ఆతఁడహంకారమును వహింపక సుగ్రీవునియెడను అంగదునియెడను అపారమైనభక్తి గౌరవములు ప్రదర్శించుచుండెను. "సీతా మదృష్ట్వా హ్యనవాప్య పౌరుషం, విహృత్యకాలం సహ వానరైశ్చిరం, నమేస్తి

సుగ్రీవ సమీపగా గతిః, సుతీక్ష్ణ దండో బలవాంశ్చ వానరః'' అని యాతఁడు పల్కుట సుగ్రీవుని యెడ నాతనికిఁ గల భయభక్తులను సూచించుచున్నది. ఆరంభించిన కార్యమును సమగ్రముగను సఫలముగను నిర్వహించుటయందాతనికిఁ గల దీక్ష యఖండమైనది. ఎంత వెదకినను సీతజాడ కానరానప్పుడు తొలుత నాతఁడు నిర్విణ్ణుడైనను, తరువాత ''జీవన్ భద్రాణి పశ్యతి'' అను నార్యోక్తిని స్మరించి ధైర్యము వహించి మరల నామెను వెదక మొదలిడెను. ''యావత్సీతాంహిపశ్యామి రామపత్నీం యశస్వినీం తావదేతాం పురీం లంకాం విచినోమి పునః పునః'' అనునది యాతని నిశ్చయము. సీతను జూడకుండఁ దాను లంకను విడిచి యేగినచో నది పురుషార్థమునకు భంగమాపాదించుననియు, నప్పుడు సముద్ర లంఘన లంకాప్రవేశ రాక్షసదర్శనాదులు వ్యర్థములగుననియు నాతఁడు భావించెను.

శ్రీరాముని యెడ హనుమంతునికిఁ గల భక్తి యపరిమితమైనది. ఆ భక్తియే యాతని చే సముద్రలంఘన లంకాప్రవేశాది సాహసకార్యములను జేయించినది. ''వవృధే రామ వృద్ధ్యర్థం సముద్ర ఇవ పర్వసు'' అను వాక్యమాతని రామపరాధీన మనస్కతను ప్రకటించుచున్నది. ''జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాయశః'' ఇత్యాది వాక్యము నుచ్చరించుచునే యాతఁడు లంకలో నన్య దుష్కరములైన కార్యము లొనరించెను. ''యథా రాఘవ నిర్ముక్త శ్శరః శ్వసనవిక్రమః గచ్ఛేత్తద్వ ద్గమిష్యామి లంకాం రావణ పాలితామ్, నూనం రామ ప్రభావేన వైదేహ్యా స్సుకృతేనచ యన్మాం దహన కర్మాయం నాదహద్ధవ్యవాహనః'' ఇత్యాది శ్లోకము లాతని నిరహంకారతను సీతారామభక్తిని సూచించుచున్నవి.

విభీషణుఁడు తన నైదుగురు సచివులతో శరణార్థియై వచ్చుచున్నప్పుడు రాముఁడు కర్తవ్యమునుగూర్చి సుగ్రీవజాంబవల్లక్ష్మణాదుల నందఱిని ప్రశ్నించెను. వారిలో నెవ్వరును విభీషణునికి శరణమొసంగుటకు సమ్మతింపరైరి. హనుమంతుఁడుమాత్ర మాతఁడు రావణుని విడిచియే వచ్చుచుండెననియుఁ, దాను పట్టుపడినప్పుడు దూతవధనీత్యుచితము కాదని రావణుని వారించియుండుటచే నతఁడు జన్మచే రాక్షసుఁడైనను గుణముచే రాక్షసుఁడు కాఁడనియు, నతనిని దయతో గ్రహించుటయే యుక్తమనియుఁ దెల్పి రాముని మన్ననకు బాత్రుఁడయ్యెను. ఇది యాతని బుద్ధిమత్తను, ఇంగితజ్ఞానమును, కార్యాకార్యనిర్ణయసామర్థ్యమును, ఔదార్యసంపదను సూచించుచున్నది.

ఉత్తమములైన మానవ లక్షణములన్నియు హనుమంతునియందు సమగ్రముగాఁ గానిపించును. సీత దైన్యమును జూచి యాతని మనస్సు ద్రవించెను. లంకాదహనానంతరము సీతకేమైన హాని జరిగినదేమోయని యాతఁడు చింతావ్యగ్రమానసుఁడై తన యవివేకమును వేయివిధముల నిందించుకొనెను. రావణుని కుమారుఁడైన అక్షుఁడు తనతోఁ బోరాడుటకు వచ్చినప్పు డాతఁ డాతనియెడ ద్వేషమునకు బదులు జాలి ప్రదర్శించెను. ఆత్మరక్షణార్థమాతఁ డతనిని సంహరింపవలసివచ్చెను గాని లేనిచో మందలించి విడిచిపుచ్చెడివాఁడే. మైనాకు నాతఁడు మొదట విఘ్నకారియని శంకించినను దరువాత గౌరవపూర్వకముగా నాదరించెను. సీతాక్షేమవార్త తెల్పి శ్రీరాముని ప్రాణములను, శ్రీరాముని సేనాసమేతముగఁ గొనివచ్చెదనని యూరార్చి సీత ప్రాణములను నిల్పిన మహనీయుఁడతఁడే. అతని

యుత్తమగుణములకు మెచ్చియే రాముడు చిరంజీవిగా నాశీర్వదించుటయే కాక తన చరిత్రము లోకమున స్మరింపబడునంతవఱకు నాతని కీర్తి నిర్మలమై ప్రకాశించునని యభినందించెను.

హనుమంతుఁడు కాంచనాద్రి కమనీయ విగ్రహుఁడు, అతిపాటలాననుఁడు, సూర్యసమ తేజస్కుఁడు, పరమసుందరుఁడు. సుందర కాండమున నాపేరు కల్గుట నాతని సౌందర్యమును నొక కారణము.

వైరాగ్యమహిమ కీ వడుగు నివాసంబు
వినయంబునకు నీతఁ డునికిపట్టు
శమదమౌన్నతులకీచతురుఁ డాధారంబు
దాక్షిణ్యమునకు నీతడుండుచోటు
సౌశీల్యమునకీ ప్రశాంతశాలి బిడారు
పరహితక్రియకీ ప్రసన్నుఁడిక్క
విక్రమస్ఫురణకీవీరవర్యుఁడు తావు
గాంభీర్యగరిమకీఘనుఁడు ప్రాపు

బ్రహ్మవిద్యకు నిమ్మోటి పట్టుఁగొమ్మ
ఘనతపోధనమునకు నీయన నిధాన
మతులధైర్యంబునకు నీమహాత్ముడిమ్ము
రామ నీ భక్తి కీపుణ్యరాశి నెలవు.

ఉ. రా. V 140

అని యుత్తరరామాయణమున కంకంటి పాపరాజగస్త్యునినోట హనుమంతుని గుణగణముల కతురరూప మొసంగినాఁడు.

విశుద్ధభక్తాగ్రేసరుడు - విభీషణుడు

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ కేశవతీర్థ స్వామివారు

విభీషణుడు విశుద్ధభక్తాగ్రేసరుడు. ప్రపత్తియోగనిష్ఠాగరిష్ఠుడు. ధర్మపరాయణుడు. రాక్షసకులములో బుట్టినను, రావణుని సహోదరుడైనను, దనగుణసంపదచేత రామానుగ్రహపాత్రుడైన ధన్యజన్ముడు. రామాయణమున విభీషణునకు గలస్థానము విశిష్టమైనది. త్రిజగద్గురువు నారదస్వామి, భక్తి సిద్ధాంతాచార్యవర్యులలో విభీషణుని నొకనిగా బేర్కొనినాడు. "విభీషణస్తు ధర్మాత్మా" అని ప్రస్తుతికెక్కిన మహాపురుషుడు విభీషణుడు.

కాని సూక్ష్మదృష్టి లేని పామరులుమాత్రము "విభీషణుడు భ్రాతృవిద్రోహి; అతడు తన యన్నను, బితృతుల్యుని, బాల్యమునుండి రక్షించినవానిని, ఆపత్సమయములో వదలిపోవచ్చునా? పోయినను, దనయన్నను సంహరింపనున్న శత్రువుకడకు బోవచ్చునా? రాజ్యతృష్ణయే యతని రామాశ్రయమునకు గారణము. సీతాదేవి నపహరించుటకు ముందు గూడ, రావణాసురుడు పరస్త్రీల నెందఱినో యపహరించి చెఱబెట్టెనుగదా! అప్పుడు విభీషణుడు ధర్మనిష్ఠుడే యయి, రావణుని ద్యజింపవచ్చుగదా? అప్పుడు లేని యధర్మవైముఖ్య మిప్పు డెందుకు వచ్చినది? ఇంద్రజిత్కుంభకర్ణాదులతో బాటుగ నాతడు కూడ భ్రాతృభక్తి - రాజవిశ్వాసముల జూపుటయే ధర్మ"మని విభీషణుని విమర్శించి దూయబట్టుటకు వెనుకాడరు. ఇట్టి విమర్శలకు సమాధాన

మిందు సంగ్రహప్రాయముగా సర్వచింపబడుచున్నది :

విభీషణుడు పామరుడు కాడు; పండితుడు. బ్రహ్మవేత్త. బ్రహ్మదేవుని వరప్రసాదముచేత, తాతయైన విశ్రవసుని కృపావిశేషముచేత, విశేషజ్ఞానసంపన్నుడైనందున – సర్వవేదాంతవేద్యుడు, సర్వలోకేశ్వరుడు, సర్వలోకశరణ్యుడు, ముక్తప్రాప్యుడు. సాక్షాత్పరబ్రహ్మమునైన నారాయణుడే శ్రీరాముడుగా బృథ్వీరంగమందు ధర్మసంరక్షణార్థ మవతరించినాడని-విభీషణునకు విస్పష్టముగా దెలియును. సామాన్యధర్మమేదో, విశేషధర్మమేదో, యెట్టి సందర్భములో సామాన్యధర్మమును సంత్యజించి విశేషధర్మమునే సమాశ్రయింపవలసియుండునో – వివేకశాలియైన విభీషణునకు విదితమే. లౌకికధర్మములన్నియు సామాన్యధర్మములు. పరమాత్మసమాశ్రయణమో పరమధర్మము. సామాన్యధర్మములన్నియు బరమధర్మమును బొందుటకొఱకే. పరమధర్మమున కడ్డువచ్చినప్పుడు సామాన్యధర్మములన్నియు సంత్యజింపదగినవే. లోకధర్మముల ప్రయోజనము లోకేశ్వరుని జేరుటయే. తన శరీరము, సమస్తబాంధవ్యములు, సమస్తధర్మములు స్వస్వరూపమైన, సత్యబాంధవుడైన, సర్వాధిష్ఠానమూర్తియైన పరమేశ్వరుని బొందుటకే. పరమేశ్వరప్రాప్తితో నీలోకధర్మములకు ప్రత్యేకస్థానము పోవును. సూర్యోదయమువఱకే దీపాలసాయము. సూర్యోదయముతో నవి వెలవెలపోవును. సర్వేశ్వరప్రాప్తిసాగరములో సర్వసామాన్యధర్మనదీనదములు విలీనములై యదృశ్యము లగును. భ్రాతృసేవ భగవదుపాసనకు పరంపరాసాధనమైనందున నది సామాన్యధర్మము. పరంధాముడైన సాక్షాద్రాముని సేవించుట విశేషధర్మము. రెంటికిని సమన్వయము కుదిరినప్పుడు రెంటిని సేవింపవలసినదే. సమన్వయము కుదరనప్పుడు సామాన్యధర్మమును విడిచి, విశేషధర్మము ననుష్ఠింపవలె. అందుననే విభీషణు డింతకాలము రావణుని విడువకయే రామునిగూడ సేవింపవలెననెడి యాశయముతో, నన్నయైన రావణున కెంతో హితబోధచేసినాడు. దుర్మదాంధుడైన రావణుడు తనమేలును నిజముగా నాసించుచున్న విభీషణుని సత్యసౌభ్రాత్రమును గుర్తింపలేకపోయినాడు. ఇచ్ఛకములతో దనకు గీడు తెచ్చిపెట్టనున్న మిథ్యాబాంధవుల నాత్మీయులనుగా నెంచుకొనెను. విభీషణుని ధర్మప్రబోధములను నిర్లక్ష్యముచేసి, విభీషణుని నిండుపేరోలగములో నవమానించి, వెళ్ళిపొమ్మని మండిపడినాడు. అప్పుడు దన్నవమానించినందులకు రోషపడి విభీషణుడు రావణుని బరిత్యజింపలేదు; కాని, ధర్మము నవమానించినందుల కతడు బాహ్యబాంధవ్యములను మాత్రమే పరిత్యజించినాడు. సత్యనిష్ఠులకు ధర్మమే తండ్రి; ధర్మమే తల్లి; ధర్మమే యన్న; ధర్మమే సమస్తబాంధవులు; ధర్మమే సంపద; ధర్మమే సర్వస్వము. సత్యనిష్ఠుడు, ధర్మనిష్ఠుడునైన విభీషణుడు ధర్మదేవతయు, సత్యబాంధవుడునైన రాముని సమాశ్రయించుటద్వారమున విశేషధర్మము ననుష్ఠించి, సామాన్యధర్మములనన్నిటిని సఫలీకృతముల చేయగలిగినాడు. సముద్రములో స్నానముచేసినచో సమస్తనదులలో స్నానము చేసినట్లేగదా పరమధర్మనిర్వహణములో సర్వధర్మసమాచరణము జరిగినట్లే. విభీషణుడు పరదృష్టితో రాముని సమాశ్రయింపలేదు; నారాయణదృష్టితో సమాశ్రయించినాడు. అందుచేత నతనిచేష్ట యధర్మము కాకపోగా పరమధర్మమే యగుచున్నది. గోపికలకు శ్రీకృష్ణుడు

పరమాత్మయనెడి జ్ఞానముండుటచేత గోపికలు జారిణులు కారు - అని నారదులవా రన్నట్లు, రాముడు పరంధాము డన్నజ్ఞానముతో సమాశ్రయించుటచేత, విభీషణుడు శత్రుపక్షమున జేరిన భ్రాతృద్రోహికాడు. విభీషణుడు రావణుని వదలినను వదలకపోయినను రావణసంహారము జరిగితీరును. రామశరణాగతిపొందినప్పుడే రావణునికి బ్రదుకుదెరువు. విభీషణుడు మిగిలినవారితోఁబా టిచ్చకము లాడియున్నట్లయిన రావణుని యహంకారరోగము మఱింత అభివృద్ధికాగల యవకాశ ముండును. విభీషణుడు వెళ్ళిపోవుటవలన, రావణుడు పశ్చాత్తాపపడి దారికి వచ్చిన రావచ్చును. ఇందుచేతగూడ విభీషణునిచర్య సమంజసమైనదే.

తనధర్మప్రబోధముల నిర్లక్ష్య మొనర్చి, రావణుడు తన్ను బహిష్కరించిన సమయములో విభీషణుడు రామసమాశ్రయణమునకు వెళ్లునపుడు పలికినమాట లివి :

జ్యేష్ఠో మాన్యః పితృసమో
నచ ధర్మపథే స్థితః,
ఇదం తు పరుషం వాక్యం
న క్షమా మ్యనృతం తవ.

తా. ఓ రాజా, పరుషోక్తు లాడిన నీవు నాకన్నవైనందున బదులుచెప్పుట నా కిష్టము లేదు. నీవు నోటికి వచ్చినట్లు నిందింపవచ్చు. అన్నవగుటనీవు పితృసమానుడవు, పూజ్యుడవు. అయినను నీవు ధర్మమార్గములో లేవు గనుక, నీవు చెప్పిన యనృతవాక్యములను గఠినోక్తులను సహించి యిక్కడ నే నుండలేను.

సునీతం హితకామేన
వాక్య ముక్తం దశానన,
న గృహ్ణంత్యకృతాత్మానః
కాలస్య వశమాగతాః.

తా. రావణా, నీహితమెంచి చక్కని నీతివాక్యములు నీకు జెప్పితిని. కాలవశులైన యాత్మజ్ఞానశూన్యు లట్టిమాటలు గ్రహింపజాలరు.

సులభాః పురుషా రాజన్,
సతతం ప్రియవాదినః
అప్రియస్య తు పథ్యస్య
వక్తా శ్రోతా చ దుర్లభః.

తా. రాజా, సర్వదా జేని చిత్తానుసారము ప్రియములైనమాటలు చెప్పువా రెందఱో యుందురు. వినునప్పుడుమాత్ర మప్రియమై, యచిరకాలముననే హితము కలిగించు మాటలను జెప్పెడివాడుగాని, వానిని వినెడువాడుగాని లభించుట కష్టాతికష్టము.

బద్ధం కాలస్య పాశేన
సర్వభూతాపహారిణా,
న నశ్యంత ముపేక్షేయం
ప్రదీప్తం శరణం యథా.

తా. కాలిపోవుచున్న కొంపను చూచుచు మిన్నకుండుటకు బుద్ధిపుట్టని మాదిరి, సర్వభూతాపహారక కాలపాశముచే గట్టబడి నశించిపోవుచున్న నిన్ను చూచుచు మిన్నకుండుటకు నాకు మనస్సు రాకున్నది.

దీప్తపావకసంకాశై
శ్శితైః కాంచనభూషణైః
న త్వా మిచ్ఛా మ్యహం ద్రష్టుం
రామేణ నిహతం శరైః.

తా. దీప్తాగ్నిసంకాశములైన, పదునైన, బంగారుకట్లుగల బాణములతో రాముడు నిన్ను సంహరించునప్పుడు నిన్ను జూచుచుండుట నా కిష్టము లేదు.

శూరాశ్చ బలవంతశ్చ
కృతాస్త్రాశ్చ రణాజిరే,
కాలాభిపన్నా స్సీదంతి
యథా వాలుకసేతవః.

తా. శూరులైనను, బలవంతులైనను, సర్వాస్త్రవిదులైనను, గాలవశులై యిసుకతో నిర్మింపబడిన యడ్డుకట్టలవలె నాశమగుచున్నారు.

త న్మర్షయతు య చ్చోక్తం
గురుత్వా ద్ధిత మిచ్ఛతా,
ఆత్మానం సర్వధా రక్ష
పురీం చేమాం సరాక్షసా

తా. నీవు నా కన్నవయి యున్నందున నీహితముగోరి నేనీమాటలు చెప్పితిని. తప్పయినచో క్షమింపుము. నిన్ను, రాక్షసాశ్రయమైన యీలంకాపురిని, సర్వవిధముల రక్షించుకొనుము.

స్వస్తి తేఽస్తు గమిష్యామి
సుఖీ భవ మయా వినా,
నూనం న తే రావణ, కశ్చి దస్తి
రక్షోనికాయేషు సుహృ త్సఖా వా,
హితోపదేశస్య సమంత్రవక్తా
యో వారయే త్వాం
స్వయమేవ పాపా

తా. నీకు క్షేమము కలుగుగాక! సెలవు. నన్ను విడిచి సుఖపడుము. (ఓ రావణా, రాక్షసకోటిలో నీకు మంచియాలోచన చెప్పుటకును, హితోపదేశము చేయుటకును, పాపాచరణమునుండి నిన్ను వారించుటకును నిజముగా నీమేలు గోరు స్నేహితుడుగాని సామాన్య స్నేహితుడుగాని యొక్కడును గానరాడు.)

నివార్యమాణస్య మయా హితైషిణా
న రోచతే తే వచనం నిశాచర,
పరీతకాలా హి గతాయుషో నరా
హితం న గృహ్ణంతి సుహృద్భిరీరితమ్.

తా. నిశాచరా, నీహితముగోరు నేను పాపకార్యమునకు దలపడవలదని యెంతగ నడ్డగించినను నీకు రుచించుటలేదు. ఎందుకనిన, మృత్యువు సమీపించినప్పుడల్పాయువు లయినవారు, విహితుల హితప్రబోధములను గ్రహింపరుసుమా!

ఈవిధముగా జెప్పి విభీషణుడు తత్క్షణమే శ్రీరామసన్నిధికి నిర్గమించెను పై విభీషణుని పరిత్యాగవాక్కులలో నా మహాపురుషుని ధార్మికస్వరూపమును మనము విస్పష్టముగా సందర్శింపగలము

విభీషణుడు రాజ్యకాంక్షతో రామసమాశ్రయణము చేయలేదనుటకు రామశరణాగతి సందర్భమున ''త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః'' – అన్న విభీషణుని వాక్కులలో నాతని మహోన్నతవైరాగ్యము ద్యోతితమవుచున్నది. విభీషణుడు రామసన్నిధిలో—

పరిత్యక్తా మయా లంకా
మిత్రాణి చ ధనాని చ
భవద్గతం చ మే రాజ్యం
జీవితం చ సుఖాని చ.

నివాసభూమియైన లంకను, స్నేహితులను, సంపదలను – సమస్తప్రాప్యాంతరపదార్థములను బరిత్యజించితిని. రాజ్యాది సమస్తైశ్వర్యములు, ధారకపోషకభోగ్యములైన సర్వపదార్థములు, ఐహికాముష్మికసుఖములు – ఇవియెల్ల నీ కైంకర్యములో నిమిడియున్నవి. (నీకైంకర్యము తప్ప నితరసుఖములను నే నపేక్షించుటలేదు) అని శ్రీరామశరణాగతినే సర్వవిధపురుషార్థముగా విన్నవించుకొనినాడు. ఇట్టి సర్వభరన్యాసి

మైన విభీషణుడు రాజ్యకాంక్షి యనుట మహా దోషము. అవివేకమూలము. శ్రీరాముడు సర్వభూతశరణ్యుడు గనుక, శ్రీరాముని శరణుజొచ్చి విభీషణుడు సకల ధర్మఫలమును సులభముగా బడయగలిగెను. విభీషణుని యుద్ధకర్మ రాజ్యతృష్ణారూపకమైనది కాదు. రామకైంకర్యరూపమైనది మాత్రమే. అందుకనియే యుత్తరకాండములో రాముని బలవంతముచేతనే లంకారాజ్యమును స్వీకరించినట్లు చెప్పబడినది. రామాజ్ఞాబద్ధమైన రాజ్యపాలనముకూడ విభీషణునకు రామకైంకర్యమే. పరమధర్మతత్త్వమెఱిగిన లక్ష్మణుడు, తలిదండ్రులను, భార్యను, భోగములను విడిచి, నిరుపాధిక సర్వవిధబాంధవుడైన రామచంద్రుని సేవనే సర్వదా యాకాంక్షించెను. అదేరీతి విభీషణుడుకూడ సోదరుని, సమస్తబాంధవులను బరిత్యజించి, సత్యబాంధవుడైన శ్రీరాముని సమాశ్రయించెను. ఇట్లు "సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ" - అన్న భగవదాదేశమును సమాచరింపగలిగిన మహాభాగ్యశాలి గనుకనే, ఆశ్రయింపదగినవస్తువు నాశ్రయింపగలుగుచున్నాడు గనుకనే, రావణుని బరిత్యజించుచున్న సమయములో "అంతరిక్షగతః శ్రీమాన్" అని విభీషణుని "శ్రీమంతు"నిగా శ్రీ వాల్మీకి మహర్షి కీర్తించినాడు. మిథ్యావస్తుప్రపంచమును బరిత్యజించి సత్యపరమాత్మను సమాశ్రయింపగలవారేకదా యథార్థశ్రీమంతులు! అట్టి శ్రీమంతుని సమస్తసంపదలు తమయంతనవియే సమాశ్రయించితీరును. విభీషణుడు కోరకముందే, తనకై తానే శ్రీరామభగవానుడు-

అహం హత్వా దశగ్రీవం
సప్రహస్తం సబాంధవమ్
రాజానం త్వాం కరిష్యామి
సత్య మేత ద్బ్రవీమి తే.

ప్రహస్తునితో, సమస్తబాంధవులతో రావణుని సంహరించి నీకు లంకలో బట్టాభిషేకము చేయుదును. ఇది సత్యమని నీకు దెలుపుచున్నాను - అని యఖండప్రేమను వర్షించినాడు. విశుద్ధభక్తాగ్రేసరుడైన విభీషణునకు, లోకేశ్వరుడైన రాముడే వశుడైనప్పుడు, లోకసంపదలు వశమగుట యేమిలెక్క?

"శ్రీరామచంద్రభగవానుని చరణపద్మస్పర్శభాగ్య మొందగలిగిన నాయీశిరస్సునిక నేస్థానములోగూడ వంచను" అని శ్రీ విభీషణుని ప్రతిజ్ఞయట! ఆరామచరణశరణాగతిమహాభాగ్య మెవరికి లభింపగలదు?

ఓం తత్సత్

సీ త క థ

శ్రీ కొమాండూరి కల్యాణరాంగారు

అనేకసంవత్సరములు పరపాలనలో నుండినను, ఆకలిని తీర్చుకొనలేని బీదజనులు కల్గినదియేమైనను, మన భారతదేశమునకు ఏ యితర దేశములకును లేని శక్తి మహిమలు గలవు. ఆ శక్తి మహిమలే సీత. ఈ పేరులో నున్న శక్తి ప్రభావములు ఎన్ని యుగములకును తఱుగదు; కాలమునకును, చరిత్రకును అతీతములు. "మంచికిని, పారిశుద్ధ్యమునకును, పవిత్రతకును మాఱుపేరు సీత" అన్న స్వామి వివేకానందుని మాటలు ప్రతి భారతీయుని

హృదయములోను ప్రతిధ్వనించును. మన పురాణేతిహాసములు, మన వేదములు, కడకు మన సంస్కృతభాషయే అంతరించినను, భారతీయులు జీవించియున్నంతవఱకు సీతకథ విస్మరింపబడదు, అది భారతీయుల రక్తములో ఆ విధముగ కలిసిపోయి యున్నది.

సీత ఎప్పుడో యుండి గతించిన ఒక రాణి కాదు. సీత మరణింపలేదు; మరణింపదు, భూమిలో ప్రవేశించిన ఆమె అజరామర. ఆది మధ్యాంత రహితముగ సర్వకాలములందును గుబాళించు ఒక కోమల వినూత్న పుష్పము. బాధలుపడు ప్రతి భారతీయుడును సీత పడిన బాధలను చూచి తన బాధలను సహించుటకు వలయు ఓర్పు బలములను పొందును. కనుక అనంతములైన బాధలను సహించిన యామె యితరుల బాధలకు అంతమైనది. మానవలోకమునకు ఒక నూతన ధర్మప్రవృత్తిని జూపి మార్గదర్శకురాలైనది. జీవితములో ఓర్పు బలములకు గల ప్రాధాన్యమును చూపి వాని ఉత్కృష్టతను నిరూపించినది. వివేకానందుల వారన్నట్లు ఆమె పతివ్రత; శీలమునకును, పవిత్రతకును మాఱుపేరు. కనుకనే ఎవరుగాని ఒక అమ్మాయిని దీవింపవలసినప్పుడు "సీతవలె నుండువుగాక" యని యందురు. అంతకన్న గొప్ప ఆశీర్వాదము కలదా ?

సీత అయోనిజ, యజ్ఞభూమిసంభూత, పురాకృతపుణ్యమువలన జనకమహారాజునకు దొరకి, ఆయనసౌధమున రాజోపచారములతో పెరిగినది. శివధనుర్భంగ మొనర్చిన శ్రీరామునికి జనకమహారాజు నిర్ణయము ప్రకారము భార్యయైనది, "ఇది సీత, నాసుత, నీకు ఎల్లప్పుడు సహధర్మచారిణిగ నుండును. గైకొను"మని జనకునిచే శ్రీరామునికి కన్యాదానము చేయబడినది. సీతయు శ్రీరామునికి సర్వవిషయములలోను, ముఖ్యముగా ఆయన అవతరించిన ధర్మసంస్థాపన కార్యములో సహధర్మచారిణి గనే యుండినది. సీత లేకున్న శ్రీరాముని అవతారోద్దేశ్యము సఫలము కాదుగదా !

కైకేయి వరముల ప్రకారము వనములకు పయనమై చెప్పి పోవుటకు వచ్చిన రామచంద్రునితో రాజ్యము రాజభోగములు పోయిన విషయమును ఈషన్మాత్రమైన ప్రస్తావింపక, క్రొత్తదంపతులు క్రొత్తవాహనములో ఉల్లాసముగ షికారుకు పోవునట్లు వనమునకుబోవ సిద్ధపడినది. ఒక రాజసౌధమున పుట్టి మఱియొక రాజసౌధమున మెట్టిన సీత, వనమునకు తన్ను కొనిపోవ వెనుకాడిన శ్రీరామునితో తన కర్తవ్యము తనకు తెలియుననియు, భర్తే తనకు గతి యనియు, భర్తతో కాననమున నుండుట రాజసౌధములో నున్న దానికన్న ప్రియమనియు, అచంచలమైన భక్తి ప్రేమలతో వాదించి, రాముని నిరుత్తరునిజేసి, అతనిని అనుగమించినది.

"అడవులలో నీకన్న అడుగుముందుగ నేను నడచి బాటలో నుండు రాళ్ళను ముళ్ళను తొలగించి సుగమము చేయుదును" అని రాముని హెచ్చరించిన పల్కులలో నన్నది. ఆమె ఔన్నత్యము సహధర్మచరత్వము, ఒక విధముగా ఆమె చెప్పినట్లే జరిగినది. లోకకంటకుడైన రావణుని పెకలించుటకు ఆమెయే గదా ముందు లంకను చేరినది! రాముని బాటలో మరియొక ముల్లు, రావణునికన్న గట్టిది, తారసిల్లినది. అది ప్రజాభిప్రాయము; చాలకాలము రావణుని బందిగా నుండిన సీత శీలమును గూర్చిన శంక. దానిని కూడ తొలగించుటకు తానుగా తాను అగ్నిప్రవేశము చేసి తన పాతివ్రత్యమును పవిత్రతను చాటుకొనుటయే గాక ధర్మసంస్థాపనా కార్యమున శ్రీరామునికి

వేదోడు అయినది. నీవెనుక నీ నీడవలె నిన్నంటి యుండగలదు అనిన, జనకమహారాజు పల్కునకు అనుగుణముగా ఎన్ని కష్టములు వచ్చినను 'నీవు లేనిది స్వర్గమైనను నాకు వలదు'' అని శ్రీరాముని అంటిపెట్టుకొని యుండిన దానిని ఎవరెఱుగరు ?

సహధర్మిణియే యైనను ధర్మమును గుఱించి ఆమెకు వేఱు నిర్వచనము కలదు. దండకారణ్యమున విరాధుని వధానంతరము ఆమె రామునితో నిట్లు చెప్పెను. ''లోకమున మూడు మహాపాపము లున్నవి. మొదటిది, అసత్యము పల్కుట, రెండవది పరస్త్రీసంగమము, మూడవది పరులను హింసించుట, ఇందు మొదటి రెంటిని నీవు చేయవు. మూడవదానిని ఇప్పుడు విరాధుని చంపినందువలన, చేసిన వాడవైతివి. రాక్షసుల బాధనుండి ఋషులను కాపాడునట్లు మాటయిచ్చి ఆ మాటప్రకారము అస్త్ర శస్త్రములతో ఈ అరణ్యమును ప్రవేశించినావు. ఇట్లుండుట నా కిష్టము లేదు. మనము ఋషుల వలెనే యుండవలయును, నీకు చెప్పగలదానను కాను. కాని నాఅభిప్రాయమును తెల్పుచున్నాను.'' సీత మాటలతో తాను ఏకీభవింపకున్నను, వానిలోని గొప్పతనమును శ్రీరాముడు గ్రహింపక పోలేదు. ధర్మము కత్తివలె దార్ఢ్యముచేసి తన్ను స్థాపించుకొనకూడదు. కుసుమము వలె అతిపేలవముగను ఉండకూడదు.... రెంటికి కలయికగా నుండవలెను. అట్టి కలయికయే సీతారాముల సంగమము. సీత లేని రాముడు నిర్వీర్యుడు. వారిరువురిని ముల్లోకములలోని ఏ శక్తియు వేఱుపఱుపలేవు. రావణుని సీతాపహరణము మాటమాత్రమే. రావణుడు అపహరించినది మిథ్యాసీత. ఆనిమిషమునుండి నిజమైన సీత రాముని హృదయాంతరాళమందు పాతుకొనిపోయినది.

శ్రీమద్రామాయణమును చదివినవారికిని, ఎఱిగినవారికిని, రావణునిచే సీతాపహరణము, సీతావిమోచనమునకై రామరావణయుద్ధము, రావణవధ మొదలగునవి సుపరిచితములైన విషయములే. కాని యిందు రావణుని గూర్చియును ఒక మంచిమాట చెప్పవలసి యున్నది. అతడు మనకు మహోపకారి. అతడు సీతను అపహరింపకున్న, సీత గొప్పతనము లోకమున కెట్లు ప్రకటితమైయుండును ? భర్తను ప్రేమించి భర్తచే ప్రేమింపబడు ఒక సాధారణ గృహిణిగానే సీతమ్మ యుండిపోయెడిది. మనము ఇప్పుడెఱిగియున్న సీత మనకు లభించెడిది కాదు. ఒక సామాన్య గృహిణిగా నుండిపోవలసిన సీతను రావణుడు పుటమువైచి మేల్మి బంగారముగ చేసి మనకు ప్రసాదించెను గదా!

నిర్మలమైన సీత గుణశీలములలో ఒక చిన్న మచ్చయున్నది. రామబాణ నిహతుడైన మాయలేడి రూపుడు మారీచుడు చనిపోవుచు రాముని కంఠము ననుకరించి 'హా! సీతా, హా లక్ష్మణా' యని యఱచెను. రామునికి ఏదో యాపద కల్గినదని స్త్రీ సహజమగు బేలతనముతో అనుకొనిన సీత లక్ష్మణుని సహాయముగ నుండ పొమ్మనెను. శ్రీరాముని శౌర్యమును, రాక్షసుల మాయాజాలములను ఎఱిగిన లక్ష్మణుడు తన అన్నకెట్టి ఆపదయు రాదని, వదిన రక్షణమే తన ముఖ్య కర్తవ్యమని పోవ వెనుకాడెను. అప్పుడు సీత లక్ష్మణుని అనరాని మాటలు అని నొప్పించి పంపును. అదియే ఆ మచ్చ, అతి పరిశుద్ధచిత్తుడును పరమభాగవతుడును అగు లక్ష్మణుని అట్టిమాటలన్నందుకు సద్యః ఫలముగ ఆమెకు కష్టములు వచ్చినవని అనెడువారు లేకపోలేదు. కాని యిందు సీత తన సౌఖ్యమును గూడ చూచుకొనక ఒంటరి యైన తనకు రాబోవు ఇబ్బందులను సరకు

గొనక, భర్తకై తన సర్వస్వమును త్యాగము చేసిన ఔదార్యము ప్రేమ పతిచింతన – గమ నార్హములు. అట్లుండుట తప్పిదమైన, సీత అప రాధినియే.

సీతయొక్క అత్యున్నతములైన తేజశ్శక్తి మహిమలను ఇంకను కూలంకషముగా నరయ వలయునన్న రావణుని బందిగా ఆమె అశోక వనమున నుండినప్పుడు చూడవలెను. రాక్షస స్త్రీలచే పరివేష్టితయై ఉపవాసముచే కృశించి నదై మూర్తీభవించిన శోకదేవతవలె, రాముని స్మరించుచు సర్వప్రపంచమును విస్మరించి పతి ధ్యానములోనే నిమగ్నయై యుండిన సీత గొప్ప తపస్విని. ఆ తపస్సే ఆమెకు అపరిమితమైన శక్తిని ప్రసాదించినది. నయమునను భయము నను తన్ను పొందగోరు రావణునితో "ఓ దశ ముఖా, నన్ను మఱచిపోయి నీవారినే పొందు. నేనట్టిదానను కాను. నేను తలచుకొన్న నిన్ను భస్మము చేయగలను. కాని ఆపని శ్రీరాముడే చేయవలయును. నిన్ను రూపుమాపి నన్ను విడి పించికొని పోవుటయే పురుషసింహుడగు ఆయ నకు గౌరవము. ఆయననుండి నన్ను వేఱు చేయు శక్తి లేనేలేదు. విధి వైరుధ్యమువలన నన్ను అపహరింప గల్గితివి. అదియే నీ వినాశ మునకు దారితీయును" అన్న సీతాదేవి మాటల లోని గాంభీర్యము, పతిపారతంత్ర్యము గమ నార్హములు. రాముని బాణములకు గుఱికావ లసిన రావణుని వానినుండి తప్పించి వాని పనిని తానే చేయుటకు ఆమెకు శక్తియున్నను ఇష్టములేదు. తన్ను తప్పింతునన్న హనుమం తునికిని ఆ మాటలే చెప్పినది. అపారమైన పతి భక్తియే ఆమె ఔన్నత్యమునకును సాహసము నకును మూలము. సర్పాస్త్రబంధితులై మూర్ఛలోనున్న రామలక్ష్మణులను చూచి తనకైగాక వనవాసానంతరము రాగలపుత్రుని ఎదురుచూచుచు దినములను లెక్కించుకొను చున్న కౌసల్యను తలంచి చాల దుఃఖపడెను. రావణవధానంతరము తన్ను కాపలాకాయు చుండిన రాక్షసస్త్రీలను హనుమంతుడు చంప నుద్యుక్తుడైనప్పుడును అట్టి కారుణ్యమునే కన పఱచి, అపకారికి ప్రత్యపకారమునకంటె ప్రత్యుపకారము చేయుట గొప్పదన్న ఉత్తమధర్మమును బోధించి, ఆ స్త్రీలను కాపాడెను.

రావణ నిర్మూలనానంతరము రాముడు సీతాదేవి నుద్దేశించి, సుగ్రీవాది స్నేహితుల సాహాయ్యమువలన తాను చేయవలసిన కార్యము నిర్వర్తింపబడెననియు, మోహావేశుడగు రావ ణుని బందిగా నుండిన యామె పరిగ్రహింప యోగ్యురాలుగాదనియు, ఆమె తనయిష్టము వచ్చినచోటికి పోవచ్చుననియు చెప్పెను. అందు లకు సీత, అశ్రుపూరితనయనయై మనోవాక్కాయ కర్మల తాను నిర్దోషి నిష్కళంకి నని చెప్పి పంచభూతములను, దేవతలను సాక్ష్యముగొని ప్రతిజ్ఞ జేసి అగ్నిప్రవేశముచేసెను. అగ్నిదేవుడు ఆమె నిష్కళంకతను లోకమునకు చాటి శ్రీరామునికి అర్పించెను. లోకాపవాదభీతిచే అట్లు తాను చేసితినిగాని సీత శీలమును శంకించి కాదని పశ్చాత్తాపము చెంది, అశ్రుపూరిత నయనములతో శ్రీరాముడును ఆమెను గ్రహించెను. ఈ సంఘటనవలన సీత, పాతి వ్రత్యమునకును పవిత్రతకును పర్యాయపద మయ్యెను.

సీతాదేవి ఇదిగాక మరియొకపరీక్షను ఎదు ర్కొనవలసివచ్చెను. పట్టాభిషిక్తుడై రాజ్య పాలనముచేసిన కొన్ని సంవత్సరములకు శ్రీరా మునికి "రావణుని బందిగా అన్నిసంవత్సరము లుండిన సీతను తెచ్చుకొని రాము డెంత సుఖముగా నున్నాడు. మనముకూడ మన

యాడువారియం దేవేని లోపములున్న సర్దుకొని పోవలయు''నని పౌరులాడుమాటలు చెవిలో పడెను. వెంటనే నిష్కళంకయు పూర్ణగర్భిణియు నగు ఆ మహాసాధ్విని రాముడు పరిత్యజించి కానలకు బంపెను. ఆమెయు వాల్మీకిమహర్షి ఆశ్రమములో ఆశ్రయముపొంది అట కుశలవులనబడు కవలపుత్రులను కనెను. వాల్మీకి వారికి యుక్తవయస్సు రాగానే పంచసంస్కారములనుచేసి రామాయణకథను నేర్పెను. ఇంతలో శ్రీరాముడు స్వర్ణసీతాద్వితీయుడై అశ్వమేధయాగముచేసెను. ఆ యాగగోష్ఠిలో వాల్మీకి కుశలవులచే రామాయణమును గానము చేయించెను. పశ్చాత్తప్తహృదయుడైన శ్రీరాముడు వాల్మీకితో జానకి తన నిష్కళంకతను ఆ సభలో రుజువుచేసికొనిన తానామెను పరిగ్రహింతు ననెను. సీతయు వాల్మీకివెంటవచ్చి ఋషులు బ్రాహ్మణులు భూపాలకులు క్రిక్కిఱిసియున్న ఆ సభలో తన పాతివ్రత్యము పైని నిష్కళంకత పైని ఒట్టిడి భూదేవి తన్ను తనలోనికి తీసికొనిపోవుగాక యని అంజలి ఘటించి ప్రార్థించెను. భూమి రెండుగా చీలెను. భూగర్భమునుండి యొక సింహాసనముమీద భూదేవి ప్రత్యక్షమై సీతాదేవిని తనలో ఐక్యముచేసికొని అంతర్ధానమయ్యెను. శ్రీరాముడు శోకమూర్ఛితుండై దుఃఖించెను. బ్రహ్మాదిఋషులు శ్రీరాముని ఓదార్చి ఆయన మహావిష్ణువనియు కార్యాంతరమున భూలోకమున అవతరించెననియు జ్ఞాపకముసేసి దుఃఖోపశమనము చేసిరి.

యజ్ఞభూమి సంభూతయు, సహధర్మచారిణియు, తపస్వినియు అయిన సీత, కడకు సన్న్యాసినియు అయ్యెను. తన పాతివ్రత్యమును పవిత్రతను స్థాపించుకొనిన మఱుక్షణములోనే యీమె యీ లోకమునుండి అదృశ్యమైనది. ఆమె వచ్చినపని యైనది. ఒక చక్రవర్తి అనుంగుబిడ్డగా పరిచయమై మన యెదుటనే సహధర్మిణియగు సతియు, తపస్వినియు, కడకు సన్న్యాసినియు అయి మన దృష్టికి అంతర్ధానమైనది. కాని ప్రతిస్థితిలోను అనంతమైన శక్తి ఆమెలో నుండియు, ఒక మధురమైన కోమలమైన సామాన్య స్త్రీమూర్తిగనే మనకు కనిపించుచుండినది. ఇదియే సీతాదేవి పవిత్రగాథ.



మహర్షి భరద్వాజుడు

శ్రీమత్కాంచీ ప్రతివాదిభయంకర అణ్ణంగరాచార్యస్వామి

ఆదికావ్యవిఖ్యాతమహర్షివర్యుడైనయట్టి భరద్వాజు నతిశయములఁ
బ్రస్తుతించెద వాక్కు సాఫల్య మొంద, చిత్తగింపుడు, విబుధులు, చేత మలర.

ప్రాచేతసమునిప్రణీతమైన ఆదికావ్యమగు శ్రీరామాయణమున కథానుబంధవశమున పెక్కండ్రుమహర్షుల ప్రస్తావము వచ్చుచుండు నని ఆ గ్రంథమును పారాయణముచేయువా రంద ఱెఱుగుదురు. అందు భరద్వాజ మహర్షి నిగూర్చి తెలియవచ్చిన విశేషములను ఇచట వివరించుచున్నాను. మొదట ఈ ఇతిహాసమున భరద్వాజప్రస్తావము ఎన్ని పర్యాయములు

వచ్చినదో చూతుమేని ఐదుపర్యాయములు వచ్చియున్న దని తెలియనగును. సంక్షేప రామాయణాత్మకమగు ప్రథమసర్గమున (31) "చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్, రమ్య మావసథం కృత్వా రమమాణా వనే త్రయః." "చిత్రకూటమునకు చేరుకొని భరద్వాజునానతిచొప్పున రమ్యకుటీరమును నిర్మించుకొని మువ్వురును వనమున విహరించుచుండిరి." అని చెప్పియుండుచోటు మొదటిది. సంక్షేపరామాయణములోనే (87) "భరద్వాజాశ్రమం గత్వా రామ స్సత్యపరాక్రమః। భరతస్యాన్తికం రామో హనూమన్తం వ్యసర్జయత్" "సత్యపరాక్రముడగు రాముడు భరద్వాజాశ్రమమునకు వచ్చి భరతునొద్దకు హనుమంతుని పంపెను." అనునది రెండవచోటు. అయోధ్యాకాండమున సీతారామలక్ష్మణులు భరద్వాజాశ్రమమును చేరుకొనుటను చెప్పెడి ఏబదినాలుగవసర్గ మూడవచోటు. అయోధ్యాకాండములోనే భరతభరద్వాజ సమాగమము నభివర్ణించు తొంబదియవసర్గము నాల్గవచోటు. యుద్ధకాండమున రావణ వధానంతరము పుష్పకవిమానమున వచ్చుచున్న శ్రీరాముడు భరద్వాజాశ్రమమునకు వచ్చుటను తెలుపు నూటయిరువదియేడవసర్గము ఐదవస్థలము.

బాలకాండద్వితీయసర్గములో "అకర్దమ మిదం తీర్థం భరద్వాజ నిశామయ" "భరద్వాజా, చూడవోయి బురదలేని నీటిని" అను చోట భరద్వాజప్రస్తావ మున్నను ఆ భరద్వాజుడు వేఱు. అతడు వాల్మీకిశిష్యుడు. అను విషయము అందే (21) "భరద్వాజ స్తత శ్శిష్యో వినీతః శ్రుతవాన్ మునిః కలశం పూర్ణమాదాయ పృష్ఠతోఽనుజగామహ" "అంతట వినయవంతుడు వేదజ్ఞుడు మౌని యునైన భరద్వాజుడను శిష్యుడు పూర్ణకలశమును చేతగొని వాల్మీకి ననుగమించెను." అనుశ్లోకమువలన తెలియుచున్నది.

వీనిలో కడపటి సందర్భమునమాత్రమే భరద్వాజుని యోగమహిమ అతనిమాటలచేతనే చక్కగ తెలియుచున్నది. అచ్చట "పూర్ణే చతుర్దశే వర్షే పంచమ్యాం లక్ష్మణాగ్రజః। భరద్వాజాశ్రమం ప్రాప్య వవన్దే నియతో మునిమ్॥ సోఽపృచ్ఛ దభివా ద్యైనం భరద్వాజం తపోధనమ్ శృణోషికచ్చి ద్భగవన్ సుభిక్షానామయం పురే కచ్చిచ్చ యుక్తో భరతో జీవ న్త్యః చ మాతరః" "పదునాలుగేండ్లునిండిన పిమ్మట పంచమినాడు లక్ష్మణాగ్రజుడు భరద్వాజాశ్రమమునకు చేరుకొని నిష్ఠతో మునికి మ్రొక్కెను. ఆతపోధను నిట్లడిగెను. "భగవంతుడా, నగరమున క్షేమ సుభిక్షములు ఉన్నవార్త వినవచ్చెనా? భరతుడు బాగున్నాడా, తల్లులు జీవించియున్నారా" అను రెండున్నరశ్లోకములలో సాకేతకుశలవృత్తాంతమునుగూర్చిన రాముని సంప్రశ్నము నిబద్ధమై యున్నది. అంతట "ఏవముక్త స్తు రామేణ భరద్వాజో మహామునిః ప్రత్యువాచ" "రాము డిట్లనగా భరద్వాజ మహాముని బదులుచెప్పె" నని నారంభించి "పఙ్కదిగ్ధ స్తు జటిలో భరత స్త్వామ్ ప్రతీక్షతే పాదుకే తే పురస్కృత్య సర్వంచ కుశలం గృహే." "జటామండలధారియై అడుసంటిన మేనితో భరతుడు నీకై వేచియున్నాడు. నీ పాదుకల పరిపాలనమున ఇంట సర్వమును కుశలమే" అని సాకేతకుశలోదంతనివేదనము పొందుపఱుపబడినది. అంతట "సర్వంచ సుఖదుఃఖ స్తే విదితం మమ రాఘవ యత్త్వయా విపులం ప్రాప్తం జనస్థానవధాదికమ్ బ్రాహ్మణార్థే నియుక్తస్య రక్షితు స్సర్వతాపసాన్ రావణేన హృతా భార్యా బభూ

వేయ మనిన్దితా। మారీచదర్శనం చైవ సీతో న్మథనమేవ చ । కబంధదర్శనం చైవ పంపాభి గమనం తథా। సుగ్రీవేణచ తే సఖ్యం యచ్చ వాలీ హత స్త్వయా। మార్గణం చైవ వైదేహ్యాః కర్మ వాతాత్మజస్య చ । విదితాయాంచ వైదేహ్యాం నలసేతు ర్యథా కృతః। యథా వా దీపితా లంకా ప్రహృష్టై ర్హరియూథపైః।

సపుత్రబాంధవామాత్య స్సబల స్సహవాహనః। యథా వినిహత స్సంఖ్యే రావణో దేవకంటకః సమాగమ శ్చ త్రిదశై ర్యథా దత్తశ్చ తే వరః। సర్వం మ మైత ద్విదితం తపసా ధర్మవత్సల "రాఘువా నీ వనుభవించిన సుఖదుఃఖము లన్నియు నే నెఱుగుదును. జనస్థానమున బ్రాహ్మణులు నియోగింపగా తపస్వుల సంరక్షణకై వేలకొలది రాక్షసులను చంపుట, మారీచదర్శనము, సీతాపహరణము, కబంధ దర్శనము, పంపాభిగమనము, సుగ్రీవసఖ్యము, వాలివధ, సీతాన్వేషణము, హనుమంతుడు సాధించిన పనులు, సేతుబంధనము, వానరులు లంకనుతగులబెట్టుట, దేవకంటకుడగు రావణుడు సపుత్రబాంధవామాత్యుడుగను సహవాహనుడుగను రణమున నిహతుడగుట, వేల్పులతో సమాగమము, నీకు వారిచ్చిన వరము—ఇంత వఱకుసర్వము తపశ్శక్తిచే నేనెఱిగియున్నాను." అని భరద్వాజుడే చెప్పిన మాటలలో ఆయన తపశ్శక్తి ప్రకాశితమగుచున్నది. అంతటి తపస్వికి ఆపాటిశక్తియుక్తులు ఆశ్చర్యజనకములు కావు.

మఱొకచోట మఱొకవిప్రతిపత్తి కలుగుచున్నది. అయోధ్యాకాండమున భరతభరద్వాజసమాగమసందర్భమున మహర్షి భరతుని "కచ్చి న్న తస్యాపాపస్య పాపం కర్తు మిహేచ్ఛసి। అకంటకం భోక్తుమనా రాజ్యం తస్యానుజస్య చ" "పాపరహితుడగు ఆరాముని విషయమున ఏమేని పాప మొనర్ప సంకల్పింప లేదు కదా, రాజ్యానుభవమునకు ఆయన్నదమ్ముల తోడును లేకుండ చేసికొనుటకు?" అని ప్రశ్నించును. ప్రశ్నార్థము సులభమే కదా. "తమ్మునితో అడవికి వచ్చియున్న రాముని జంపి రాజ్యమును నిష్కంటకముగ చేసికొన గోరి బయలు దేఱియున్నావా? రాముడు సాధువును సాత్త్వికుడును. అతనికి కీడుచేయుట ఉచితమా" అనుట కదా యోగివరేణ్యుడైన భరద్వాజుని ప్రశ్నార్థము. ఎనుబదియైదవ సర్గలో గుహుడు భరతుని "కచ్చి న్న దుష్టో వ్రజసి రామస్యాక్లిష్టకర్మణః। ఇయం తే మహతీ సేనా శంకాం జనయతీవ మే" "సుచరితుడగు రాముని విషయమున దుస్సంకల్పముతో నీవు చనుట లేదు కదా. నీ వెంట నున్న ఈపెద్దసేన నా కనుమానము కలిగించు చున్నది." అని అడిగియుండెను. గుహుడు, అజ్ఞానులలో అగ్రగణియు పామరుడు నైనందున అత డాలా గడిగినందుకు విచారము విస్మయము అక్కఱలేదు. మఱి భరద్వాజమహర్షి తపోబలవిదితనిఖిలవేదితవ్యుడు కదా. జరిగిపోయిన దానిని జరుగనున్నదానిని హృద్గతమైనదానిని ఎఱుగుటకు వలసిన అసమాభ్యధికశక్తికల వాడు కదా. పదునాలుగేండ్ల శ్రీరామచరిత్రమును సర్వము నెఱుగుదునని చెప్పుచున్న ఈయన "విలలాప సభామధ్యే జగర్హే చ పురోహితమ్। రాజ్యం చాహం చ రామస్య ధర్మం వక్తు మి హార్హసి; కథం దశరథా జ్జాతో భవే ద్రాజ్యాపహారకః" "సభామధ్యమున విలపించెను. పురోహితుని నిందించెను. నేను రాముని సొమ్మును. రాజ్యమును రాముని సొమ్మే. ఇచట ధర్మమును నీవే చెప్పుము. దశరథుని కడుపున పుట్టినవాడు ఎట్లు రాజ్యాపహర్త కాగలుగును." ఇట్లంతయు చెప్పిన

భరతునివృత్తాంతము ఈయనకు తెలిసియే యుండవలయును కదా. ఈయన తపోబల మీవిషయమున ప్రసరింపదా ?

ఇంతే కాదు. శంకకు గుఱియైన భరతునితో కూడ వసిష్ఠమహర్షియు వచ్చియుండెను. ఆప్రకరణములోనే "వసిష్ఠ మథ దృష్ట్వైవ భరద్వాజో మహాత్మనః సంచచా లాసనా త్తూర్ణం శిష్యా నర్ఘ్య మితి బ్రువన్" "వచ్చిన వసిష్ఠుని చూచినంతనే మహామతియగు భరద్వాజుడు అర్ఘ్యము తెండి అర్ఘ్యము తెండి అని శిష్యులను తొందరించుచు ఆసనమునుండి లేచెను" అని చెప్పబడినది. భరతుడు కుటిల మనస్కుడే యగుచో తపస్తేజస్సంపన్నుడగు వశిష్ఠుడు అతని వెంబడి వచ్చియుండడుకదా. ఇట్లుండగా ఆ సాధువునకు పాప మొనర్పకోరవు కదా" అని భరద్వాజు డడుగుట ఎట్లు పొసగును ?

ఇందులకు చక్కని సమాధానము : ఈ ఘట్టములోనే పై శంకను తీర్పగలట్లు వాల్మీకి మహర్షి "భరద్వాజో మహాతపాః, భరతం పృష్టవా నేవం రాఘవస్నేహబంధనాత్" మహాతపస్వియైన భరద్వాజుడు శ్రీరాముని మీది స్నేహబంధముచే భరతు నిట్లడిగె" నని చెప్పియున్నాడు. స్నేహవైఖరి మితమతుల కర్థముకాదు. ష్యముమీది శ్రుతప్రకాశిక యను వ్యాఖ్యలో ఆచార్యులు "సంబంధ విశేషాన్వితులందున్న ప్రీతి స్నేహ మనబడును. అస్థానమున శంకలు, భయములు, దోషములను గుర్తింపలేమి,దోషములుసైతము గుణములుగ కనపడుట–మున్నగునవి ఆ స్నేహవిపాకములే" అని సెలవిచ్చియున్నారు. దోషములు కనబడ కుండుటయు దోషములు గుణములుగ కనబడుటయు అటుండు గాక, అస్థానభయశంకిత్వమని మొదట చెప్పబడెనే దాని నిట గొనవలయును స్నేహవిపాకముచే అస్థానభయ శంకిత్వము కలుగుచుండు ననుట ఫలితార్థము "స్నేహా దస్థానరక్షావ్యసనిభి రభయం శార్ఙ్గచక్రాసి ముఖ్యై రానందైకార్ణవం శ్రీ ర్భగవతి యువయో రాహు రాస్థానరత్నం". "ఓ లక్ష్మీదేవీ, శ్రేష్ఠమైన మీ యుభయుల ఆస్థానమున స్నేహముచే భయమును శంకించు దివ్యాయుధములచే ఎట్టిభయమునకును అవకాశ ముండ" దనియు మీ యునికి పట్టు ఆనందైకార్ణవముగ నుండు ననియు చెప్పుదురు." అనెడి గుణరత్నకోశమందలి (24) శ్రీ పరాశర భట్టారకుల శ్రీసూక్తి, ఈ సమన్వయమునకు ప్రమాణము.

ఈ సూక్తి శ్రీవైకుంఠదివ్యలోకచర్యను తెలుపునది కదా. అజ్ఞానము అన్యథాజ్ఞానము సంశయము విస్మృతి మున్నగు పురుషదోషముల గంధమైనను లేని నిత్యసూరులు సైతము అస్థానమున కలవరపడుచు భగవంతుని రక్షింప ముందున కుఱుకుచుందురు కదా. విపాకదశ నందిన స్నేహమే అందుకు కారణ మని శ్రీపరాశరభట్టారకులు "స్నేహా దస్థానరక్షావ్యసనిభిః" అనుదళముచే సూచించిరి. విమలవిశద జ్ఞాననిధులైన సజ్జనులకు సైతము ప్రేమోత్కటతచే అస్థానమున భయశంక కలుగు ననుటను హార్దస్నేహము కలవారే గ్రహింప సమర్థులు.

సామాన్యప్రజ్ఞ గల మనము సమస్తమునకును రక్షకుడు భగవంతుడు అనుటనుమాత్రమే ఎఱుగుదుము. భగవంతునియునికిని రక్షకతను అంగీకరింపని నాస్తికులతో మనము చేరమనుట అటుండ నిండు. భగవంతుని రక్షకత్వమందు ప్రామాణికున కెవనికి గాని, విప్రతిపత్తి లేశ మేని ఉండదు. దేవుడు రక్షకుడు మనము రక్ష్యు

లము అని, సర్వశాస్త్రములును ఘోషించుచున్నవి. "వినతవివిధభూతవ్రాత రక్షైకదీక్షే" "ప్రణమిల్లిన సకలప్రాణులను రక్షించు ముఖ్య దీక్ష కలవాడు". "సర్వావస్థసకృత్ప్రపన్న జనతాసంరక్షణైకవ్రతీ" "ఏ దశయందుగాని ఒక్కసారి శరణన్న చాలును, శరణన్న వారిని సంరక్షించుటే ముఖ్యవ్రతముగ గలవాడు." ఈ మొదలగు ఆచార్యశ్రీసూక్తులు సదా మనము వల్లించుచుందుమనవే. అటువంటి ఆర్త త్రాణపరాయణుడైన భగవంతుని స్వతము తాము కాపాడ గోరి కొందఱు మహామతులు ముందునకు ఉఱుకుదురని చెప్పినచో అల్పమతులకు అది సులభముగ నర్థము కాదు. ఏదశయందైనను సరే రక్షకుడు భగవంతుడే. మనము రక్ష్యులమే. భగవంతునకు మనము రక్షకులము కాము. "లక్ష్మ్యా సహ హృషీకేశో దేవ్యా కారుణ్యరూపయా రక్షక స్సర్వసిద్ధాంతే వేదాంతేఽపిచ గీయతే" "కారుణ్యరూపయైన లక్ష్మీదేవితో కూడిన హృషీకేశుడే రక్షకు డని సకలసిద్ధాంతములును వేదాంతమును గీర్తించుచున్నవి." "నహి పాలనసామర్థ్య మృతే సర్వేశ్వరం హరిం" "సర్వేశ్వరుడగు హరికి తప్ప రక్షణసామర్థ్యము మఱొకరికి లేదు. ఇత్యాది ప్రమాణ సహస్రములచే సర్వజగద్రక్షణవిచక్షణుడు సర్వేశ్వరుడే అనుట నిర్వివాదము. దాని నెవ్వరును కాదనరు గాని రక్షకుడైన భగవంతునకు రక్ష్యత్వమును ఉపపాదించుచున్నాము, చిత్తగింపుడు.

అల్పశక్తులమును అల్పజ్ఞులము నగు మనము అప్రమేయశక్తియు సర్వజ్ఞుడును సర్వాపదలను పోగొట్టువాడు నగు భగవంతుని రక్షింతుమనుట మనస్సుచే తలంచుటకైనను శక్యము కాదు, యోగ్యము కాదు; నిజమే భక్తప్రవరులగోష్ఠులలో మంగళాశాసన మను నొక మాట సుప్రథితమే. పరమభక్తవరేణ్యులకు మంగళాశాసనపరు లనియే వ్యపదేశము. 'మంగళాశాసన మనగా నేమి? మంగళములను ఆశాసించుటకు కారణమేమి' అనుటను విమర్శించి తెలిసికొందు మేని రక్షకుడగు భగవంతునిస్సితము రక్ష్యునిగా భావించుట అవ్యాహత మను విషయము నిర్ధారిత మగును. కావున దీనిని వివరించుచున్నాము

భక్తచేతనులకు జ్ఞానదశ అనియు, ప్రేమదశ అనియు రెండుదశలు తప్పవు. సర్వేశ్వరుడే రక్షకుడు మనము రక్ష్యులము, రక్షింపబడుచున్నాము అని భావించుచుండు దశ జ్ఞానదశ. ఈదశలో భక్తులు "మాం రక్ష హరే" "అస్మాన్ పాల యాచ్యుత" ఇత్యాది రీతులలో భగవంతుని రక్షకత్వమును అనుసంధించుచుందురు. ఈదశలో చేతనులు రక్ష్యులు. పరమచేతనుడు రక్షకుడు అను ప్రమాణశత ప్రతీతమైన విషయము నిరూపితమగుచున్నది. ఇక ప్రేమదశను వివరింతుము. భగవంతుడు నిరవధిక సౌందర్య లావణ్య సౌకుమార్యాది నిధి. ఆగుణముల ననుసంధించు నుద్రేకమున "అయ్యో, ఈ భగవంతునకు ఏ అసురప్రకృతి వలన ఎట్టియాపద వాటిల్లునో" అని అస్థానమున భయశంక కలుగుచున్నది. అప్పుడు అతని రక్షకత్వము విస్మృతమై అతనిని మనము రక్షింపవలె నను అధ్యవసాయము కలుగును. "జయ విజయీభవ చిరంజీవ భద్రమస్తు భవతః" ఈ రీతుల వాక్యములు నోట వెలువడును. దీనినే ప్రేమదశ కార్యమందురు. అప్పుడు రక్షింపబడువాడు ఈశ్వరుడనియు రక్షించువాడు తా ననియు విపర్యస్తభావము కలుగును. ఇందులకు కారణము అస్థాన భయశంకయే.

శ్రీరామాయణమున ఈప్రేమదశ అనేక వ్యక్తులలో కననగుచుండును. (1) "అహం వేద్మి

మహాత్మానం రామం సత్య పరాక్రమమ్'' "సత్యపరాక్రముడును మహాత్ముడును నగు రాముని నే నెఱుగుదు'' నని చెప్పి దశరథ రాముని తన యజ్ఞసంరక్షణకై పిలుచుకొని పోవుచున్న విశ్వామిత్రుడు తాటక వచ్చిపై బడు సందర్భమున కలవరపడి శ్రీరాముని వీర్య పరాక్రమాదికములను మఱచి కేవల మతని సౌకుమార్యమును మాత్రము తలంచి దిగులు పడి "స్వస్తి రాఘవయో రస్తు'' "రామలక్ష్మ ణులకు శుభము కలుగును గాక'' అని మంగళా శాసనము కావించెను. (2)శివుని వింటెని విఱిచిన శ్రీరాముని అతిమానుషశక్తిని ప్రత్యక్షముగ చూచిన జనకమహారాజు శ్రీరాముని వైవా హికవేషరామణీయకమును విలోకించి "ఈ సౌందర్యనిధికి ఆపదలు కలుగకుండవలయునే'' అనెడి అక్కఱకలవాడై కన్యాప్రదానకాల మున "ప్రతీచ్ఛ చైనాం భద్రం తే'' "ఈమెను గైకొనుము. నీకు శుభ మగుత'' మని మంగళా శాసనము చేసెను. (3) సీతాదేవి విభుని నిస్సమాభ్యధికమహిమ నెఱింగినదైనను సింగారించుకొన్న అతని మేని సోయగమును చూచి విహ్వలయై "పతి సమ్మానితా సీతా భర్తార మసితేక్షణా ఆద్వార మనువవ్రాజ మంగళా న్యభిదధ్యుషీ'' "భర్తృసమాదరవతియు నలుపుడాలుగల చక్కనినేత్రములు కలదియు నగు సీత మంగళముల నాసించుచు భర్తను తలవాకిలివఱకు అనుగమించెనట.'' అచ్చట "పూర్వాం దిశం వజ్రధరో దక్షిణాం పాతు తే యమః వరుణః పశ్చిమా మాశాం ధనద స్తూత్తరాం దిశమ్,'' "నిన్ను తూర్పువైపు ఇంద్రుడు కాపాడును గాక. దక్షిణపువైపు యముడు రక్షించును గాక. పడమటివైపు వరుణు డోమునుగాక. ఉత్తరదిశవైపు కుబేరుడు పాలించునుగాక'' అని దిక్పాలకులను శ్రీరామరక్షణమందు నియమించినది. "భీషాస్మా ద్వాతః పవతే భీషోదేతి సూర్యః భీషాస్మా దగ్నిశ్చేంద్రశ్చ మృత్యు ర్ధావతి పంచమ ఇతి'' అను నుప నిషత్తున చెప్పినట్లు భగవంతు నెదుట గడగడ లాడుచు పనులు నిర్వర్తించు దేవతలు ఎట్లు భగవంతుని తాము రక్షింపగలుగుదు రని నైదేహి ఆలోచింపదాయెను.

(4) వే యెందులకు? అయోధ్యావాసిజను లందఱును రామునకు మంగళాశాసనము చేయుట నిత్యకృత్య మని వాల్మీకిమహర్షి వ్రాక్కుచ్చుచున్నాడు. "స్త్రియో వృద్ధా స్తరుణ్యశ్చ సాయంప్రాత స్సమాహితాః సర్వాన్ దేవాన్ నమస్యన్తి రామస్యార్థే యశస్వినః'' "ముదిసినమగువలు యువతులు సాయంప్రాతర్వేళలందు యశస్వంతుడగు రామునికి మంగళములు కలుగవలయునని సకలదేవతలకును మ్రొక్కుకొనుచుండెడివారు'' రామప్రభావమును చక్కగ నెఱిగిన పౌర జనులు రామునకు క్షేమము ఎడతెగకుండుటకై ప్రతిదినము క్షుద్రదేవతలను ప్రార్థించుచుండి రని చెప్పుటచే అస్థానమున వారికి కలిగిన భయశంక కదా సూచితమైనది. పైనుదాహ రింపబడిన రామాయణశ్లోకమున 'యశస్వినః' అనునది షష్ఠ్యంతము రామవిశేషణము. "స హి దేవై రుదీర్ణస్య రావణస్య వధార్థిభిః అర్థితో మానుషే లోకే జజ్ఞే విష్ణు స్సనాతనః'' "దర్పితుడైన రావణుని వధించుటకై వేల్పులచే ప్రార్థితుడై మానవలోకమున అవతరించిన సనా తనుడగు విష్ణువేకదా-ఈరాముడు''అని రాముడు విష్ణ్వవతారమనుట విఖ్యాత విషయమే. దాని నెఱిగియుండియు పౌరజనులు ఆ రాముని మేలు నకై క్షుద్రదేవతలను ప్రార్థించిరట. ఇందుకుకార ణము అస్థానభయశంకిత్వము తప్ప వే ఱేమి?

(5) శ్రీరామునిప్రభావము చక్కగ నెఱిగిన కౌసల్యాదేవియు "యన్మంగళం సుపర్ణస్య వినతా కల్పయత్ పురా అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్" "అమృతము తేబోవునప్పుడు గరుత్మంతునకు వినత ఏ మంగళమును సమకూర్చెనో ఆ మంగళము నీకును కలుగుత" అని అస్థానభయవిహ్వలయై మంగళాశాసనము చేసెను.

(6) ఇక దండకారణ్యవాసిమహర్షుల నడవడిని కనుడు. వీరు తపోధనులు కదా. "తే వయం భవతా రక్ష్యా భవద్విషయవాసినః" నీదేశములో వసించు ప్రజలము మేము. మమ్ము కాపాడు బాధ్యత నీది" "రక్షితవ్యా స్త్వయా శశ్వ ద్గర్భభూతా స్తపోధనాః" "తపోధనులము బిడ్డలను కాపాడినట్లుగా సదా నీవు కాపాడవలెను.' ఇట్లంతయు ప్రార్థించిన వీరికి రాముడు రక్షకుడనుటయు తాము రక్ష్యులనుటయు చక్కగ తెలిసినవిషయమే కదా. అటువంటి వీరు "తే తం సోమ మివోద్యంతం దృష్ట్వా వై ధర్మచారిణః మంగళాని ప్రయుఞ్జానాః ప్రత్యగృహ్ణన్ దృఢవ్రతాః" "చంద్రుడుదయించినట్లుగా లోచనగోచరుడైన శ్రీరాముని కన్నంతనే దృఢవ్రతులును ధర్మచారులునగు ఆ మునులు మంగళములను ఆశాసించి ఆదరించిరట." ఈ మంగళాశాసనమునకు కారణము అస్థానభయశంకిత్వమే.

(7) జటాయుచరితమును కనుడు. సీతను కాపాడుటకై ఇతడు రావణునితో పోరాడినిహతుడయ్యెను. ఆసన్నమరణదశలో జటాయు వుండగా సీతను వెదకుచు రామలక్ష్మణు లటు వచ్చిరి. అప్పుడు రామునితో జటాయువు పల్కిన వాక్యము "యా మోషధి మివాయుష్మ న్నన్వేషసి మహావనే సా దేవీ మమ చ ప్రాణా రావణేనో భయం హృతమ్" "ఆయుష్మంతుడా, కారడవిలో ఓషధిని వెదకినట్లుగా ఎవతెను వెదకుచున్నావో ఆమెను నా ప్రాణములను ఈ యుభయమును రావణుడు హరించెను." ఇచ్చట "ఆయుష్మన్" అనుటకు "అబ్బాయీ" అనుటమాత్ర మర్థము కాదు. "దీర్ఘాయుష్మంతుడవుక" మ్మనెడి ఆశీస్సు ఇందు వ్యంజితము. జనస్థానమందుండిన పదునాలుగువేల రాక్షసులను జంపినప్పటి శ్రీరాముని అసహాయశూరత్వమును అనపాయసాహసత్వమును జటాయువు చక్కగ నెఱుగును. ఐనను ప్రస్తుతము సీతావిరహముచే రాముని మేన గనవగుచుండిన వాడుపాటును, సౌకుమార్యాతిశయమును, అసురులతో పొసగిన దీర్ఘ ద్వేషమును జూచినప్పుడు "అయ్యో, ఏ యనర్థముకల్గునో"అని అకాండభయావిష్టుడై జటాయువుకావించిన 'ఆయుష్మంతుడా' అను సంబోధనలో అతనికి గలిగిన అతిశంక ద్యోతిత మగుచున్నది.

అట్లే భరద్వాజమహర్షికిని రామప్రభావము చక్కగ తెలిసియున్నను ప్రేమపరవశుడై నీటిని జూచి నిప్పని భ్రమించినట్లుగ ఆయన భరతుని జూచి రామునకు ప్రతికూలుడు కాబోలునని శంకించెను. ఆయన భరతు నడిగిన ప్రశ్నలో ఈ యతిశంక కనవగుట ఎంతయు ఉపపన్నమే.

తైత్తిరీయబ్రాహ్మణమున కాఠకశాఖలో 'భరద్వాజో హి త్రిభి రాయుర్భి ర్బ్రహ్మచర్య ముపాస' "మూడుజీవితకాలాలు చెల్లెను భరద్వాజుని బ్రహ్మచర్య మని యామ్నాతమైన యుపాఖ్యానముకూడ ఇతని ప్రభావాతిశయమును ప్రఖ్యాపించుచున్నది.

శ్రీమదణ్ణంగరాచార్య శేఖరుండు పెద్దవారల యానతిఁ బ్రీతితోడ
వరభరద్వాజముని ప్రభావంబు నెల్ల పొందుపఱచెను వ్యాసంబునందు నిచట.
ఆ భరద్వాజుఁ గీర్తించు వ్యాజమునను మంగళాశాసనపు మహిమంబుఁ దెల్పె.



ఆదర్శపురుషుడు శ్రీరామచంద్రుడు

శ్రీ చిలువూరి మాధవకృష్ణకవి

ఉ. శ్రీరమణీయ జీవనము శిష్టజనావళికెల్లఁ గొల్పనెం
తే రహి సద్గుణంబులకు నెందును లక్ష్యము లక్షణంబునై
ధారుణి రామచంద్రుఁడయి దాసులఁ బ్రోచిన తండ్రి సత్కృపా
వారి యవారిగాఁ గురిసి వారని సంపదలిచ్చి ప్రోచుతన్.

భగవల్లీల లనంతములు, గోచరములు. ఈ విషయమునే "యతోవాచో నివర్తన్తే అప్రాప్యమనసాసహ" అని పెద్దలు వచించిరి. సనాతనమతమునకు వేదములు మూలస్తంభములు. వేదవాఙ్మయము సిద్ధపురుషులకే అవగతము. ఋషితుల్యులు సయితము వేదార్థముల ప్రవచించునెడ భిన్నాభిప్రాయముల వెలిబుచ్చుచుందురు. ఇక పామర జనసమూహము వేదవాఙ్మయమును యథాతథముగ గ్రహింపజాలదన నం దావంతయు సందియము లేదు. కావుననే వేదవాఙ్మయమును లక్ష్యలక్షణ సమన్వితముగ జనసామాన్యమునకు వివరింపనెంచి పూర్వులు ఇతిహాసపురాణాదులను కథారూపమున రచించిరి. ఇట్టి పవిత్రగ్రంథములలో రామాయణము ఆదికావ్యమని పేరెన్నికగన్నది రామాయణ పారాయణమున జన్మతరింపగలదని పూర్వులు హృదయపూర్వకముగ విశ్వసించెడివారు. నేడును ఈ మహాకావ్యమును మహానుభావు లెందరో పారాయణము చేయుచున్నారు. ఇందులకే క్రింది శ్లోకమే సాక్షి:

శ్లో. చరితం రఘునాథస్య
శతకోటి ప్రవిస్తరం
ఏకైకమక్షరం ప్రోక్తం
మహాపాతకనాశనం.

తా. శ్రీరామచంద్ర చరిత్ర విస్తృతి యెన్నియో కోట్లు గలవు. అందలి ప్రత్యక్షరమును మహాపాతకముల నశింపజేయగలదు. ఇట్టి విశ్వాసముతో భక్తజనులు ఈరామాయణమును మహాపుణ్యప్రదమని యనుదినము పారాయణము చేయుచుందురు.

మోక్షదాయకములగు గ్రంథములలో హిందువులకు భారత భాగవత రామాయణములు ముఖ్యములు భక్తులెల్లరు తమయిష్టదైవమును ధ్యానించి పూజించినట్లే యాగ్రంథములను ప్రార్థనపూర్వకముగ పూజించి పారాయణము చేయుదురు. అట్టి పారాయణము వలన తమకు మేలు చేకూరునని వారి విశ్వాసము. ఈమూడు గ్రంథములందును రామాయణము అత్యంతము ప్రాచీనమయినది. రాముడు అన్నశబ్దమునందే రామాయణ ప్రాశస్త్య మిమిడియున్నది. ప్రజలను రంజింపజేయువాడే రాముడు అని యీశబ్దమునకు వ్యుత్పత్తి.

రాముడు ప్రజలనెట్లు రంజింపజేసెనో అతడు ఎట్టిజీవనమును గడపెనో, అతని శీలమువలన మనము గ్రహింపదగినవియు, అనుసరింపదగినవియునగు మార్గములెవ్వియో గమనింతము.

శ్రీరాముని వాల్మీకి 'సర్వలక్షణ సంపన్న' అన్న విశేషణమును ప్రయోగించెను. ఈ ఒక్కసమాసమే రాముని గుణగణములను వేనోళ్ల జాటుచున్నది. నిజముగా మానవుడు ఎట్టిగుణముల నలవఱచుకొని ప్రపంచమున జీవింపవలయునో ఆయాగుణములెల్ల శ్రీరామునియందు నిక్షిప్తములై యున్నవని

యీ భావము మనకు తేటతెల్లము సేయు చున్నది.

శ్రీరామచంద్రునిగూర్చి రాజ్యముసంపలి ప్రజలు ఆస్థానమునందలి గురువులు, బుధులు, ఉద్యోగులు-పలికిన పలుకులు విన్నచో శ్రీరాముడు సర్వలక్షణ సంపన్నుడనియు, ఆదర్శ పురుషుడనియు నవగాహనమగును.

శ్లో. రామసత్పురుషో లోకే
సత్యధర్మపరాయణః
సాక్షాద్రామాద్వినిర్వృత్తో
ధర్మశ్చాపి శ్రియాసహ. అయోధ్య 2-29

శ్లో. వ్యసనేషుమనుష్యాణాం
భృశంభవతి దుఃఖితః
ఉత్సవేషుచసర్వేషు
పితేవ పరితుష్యతి. అయోధ్య-2-40

శ్లో. ప్రజాపాలనతత్త్వజ్ఞో
న రాగోపహతేన్ద్రియః
శక్తస్త్రైలోక్యమప్యేకో
భోక్తుం కిన్ను మహీమిమామ్.
అయోధ్య-2-44

శ్లో. శాన్తై స్సర్వప్రజాకాన్తైః
ప్రీతిసజ్జననైర్నృణామ్
గుణైర్విరురుచేరామో
దీప్తస్సూర్య ఇవాంశుభిః.
అయోధ్య-2-47

తా. లోకంబున రాముడే సత్పురుషుడు సత్య ధర్మంబులయందు మిక్కిలి యాసక్తిగలవాడు. ధర్మమును సంపదయు నాతని నెడబాయ జాలక యాతనియాందె నిక్షిప్తములయినవి.

తా. బంధువులు, మిత్రులు, ధనికులు దరిద్రులు మొదలగు భేదములు లేక, మనుష్యసామాన్య మునకు కష్టము సంభవించినను నెంతయో దుఃఖమును పొందును. అట్లే మనుష్య సామాన్యమున కేమాత్రము సుఖముగలిగినను పుత్రోత్సవమువలన తండ్రి సంతసించునట్లు మిక్కిలిగ సంతసించును.

తా. రాముడు జనులను చక్కగపాలింప దెలిసినవాడు. ఇతడు స్వయముగా ముల్లోకము లను బాలింపగలడు. ఈభూమిని పాలించుట గూర్చి వింతయేల ?

తా. శాంతిప్రధానములును సమస్తప్రజలకు కోరదగినవియు మానవలోకమునకు సంతోష దాయకంబులునునగు గుణములుగలిగి సహస్ర భానునివలె శ్రీరామచంద్రుడు ప్రకాశించు చున్నాడు.

ఇట్లు ప్రజాభిరాముడయిన శ్రీరాముడు తన సోదరులయందు ఎట్టి ప్రేమాదరములు గలిగి యుండెనో గమనింతము. నిజముగా శ్రీరాముడు తన సోదరులయందు జూపిన ప్రేమ యనన్య సదృశము. తన సోదరులలో ఆయన ఎవరినిగాని ఎన్నడుగాని అసంతృప్తి పరచినట్లు ఎక్కడను గనిపింపదు. ఆ సోదరులును అన్న యెడ సంపూర్ణభక్తిభావము గలిగియే యుండిరి. ఏవిషయమునందుగాని ఎన్నడుగాని వారిలో ఎవరయినను ఆయనయందు న్యూనత నాపాదించిన వారుగారు. మీదుమిక్కిలి తమ్ము తమ ఘనతకు మిక్కిలిగా గౌరవించి యాదరించెననియే పలికెడివారు. అట్లని తామెట్లు మెలగినను తమ్ము ప్రేమతోనే జూచెడివాడని తలంచెడివారుకారు. ఏమాత్రము దోషము తమయందున్నను ఆయన సహింపజాలనివాడని నిశ్చయముగ బలికెడివారు. శ్రీరామచంద్రుని అడవులకు బంపిన కైకేయిని వధింపబూనియు భరతుడు వెనుదీసెను. అందులకు కారణ మిట్లు వెల్లడించెను.

శ్లో॥ అపాపదర్శనం శూరం
కృతాత్మానం యశస్వినం
ప్రవ్రాజ్యచీరవసనం
కిం ను పశ్యసి కారణమ్' అయోధ్య 73-12

తా. మనస్సునందయినను పాపమునుదలపని వాడును శూరుడును బుద్ధిమంతుడును కీర్తి శాలియునగు రాముని నారచీరలుకట్టుకొని యడవికి బోవునట్లు చేసితివే దీని కేమి కారణము?

శ్లో. 'హన్యామహమిమాం పాపాం
కైకేయీం దుష్టచారిణీం
యదిమాం ధార్మికో రామో
నాసూయే న్మాతృఘాతుకమ్.'
అయోధ్య 78-22

తా. ధర్మస్వరూపుడగు శ్రీరామచంద్రుడు మాతృఘాతుకుడనని నన్ను నిందింపకుండు నేని నేనే పాపచారిణియు దుష్టురాలునగు నీకైకేయిని జంపియుందును.

మంథరను జంపదలంచిన శత్రుఘ్నునితో భరతుడు పలికిన యీ క్రింది పలుకులు ఇందు గమనార్హములు.

శ్లో. ఇమామపి హతాం కుబ్జాం
యదిజానాతి రాఘవః
త్వాంచమాం చ హి ధర్మాత్మా
నాభిభాషిష్యతే ధ్రువమ్.
అయోధ్య 78-23

తా. ఈమంథరనైనను మనము చంపినట్లు వినునేని ధర్మాత్ముడు గావున శ్రీరామచంద్రుడు స్త్రీవధ గావించితిమని నీతోగాని నాతోగాని ఎంతమాత్రము భాషింపడు. ఇది నిశ్చయము.

పె పలుకులవలన)రామచంద్రుడు సోదరులయందే మాత్రము దోషము కనిపించినను ఓర్వజాలనివాడనియు, ధర్మముతో నవినాభావసంబంధము గలవాడనియు దెలియ వచ్చుచున్నది. ఇచట శ్రీరామచంద్రుడు తమ్ములను ప్రేమించుటయందే గాక వారి శీల సంరక్షణమునందును నత్యంతబాధ్యతవహించి యుండెనను సత్యము స్ఫురించుచున్నది.

సుగుణాభిరాముడగు శ్రీరామచంద్రుని హితులుమాత్రమే పొగడుచుండెడివారు కారు. శత్రుపక్షీయులు సయితము ఆ మహానుభావుని కీర్తించుచుండెడివారు. ఒకపరి తన బాణ వేగమును-తనకోపమును-రుచిచూచినవారును గూడ ఆయన ధర్మస్వరూపుడనియే కొనియాడిరి. ఇందులకు ఈక్రింది సన్నివేశమే దృష్టాంతము :

"మాయామృగమవై శ్రీరామచంద్రునుటంకింపు" మన్న రావణునితో మారీచుడిట్లు పలుకుచున్నాడు. ఈమారీచుడిదివరకు శ్రీరామచంద్రునిచే గొట్టబడి తప్పించుకొని పారిపోయిన వాడు; శ్రీరామచంద్రుని రూపమును నడవడిని కన్నారజూచినవాడు.

శ్లో. 'రామోవిగ్రహవాన్ధర్మ
స్సాధుస్సత్యపరాక్రమః
రాజాసర్వస్యలోకస్య
దేవానాం మఘవానివ. ఆరణ్య 37-13

తా. శ్రీరాముడు రూపుదాల్చిన ధర్మము. సత్పురుషుడు, సత్యపరాక్రముడు. దేవతల కందరకును ఇంద్రుడు ప్రభువగునట్లు ప్రజల కందరకును ప్రభుసత్తముడు.

'శ్రీరాముని కికురింపబోవేని నిన్నిపుడే చంపెద' నన్న రావణునితో మారీచుడు పలికిన పలుకులు గమనింపుడు.

శ్లో. మాం నిహత్యతు రామశ్చ
నచిరా త్త్వాం వధిష్యతి

అనేనకృతకృత్యోఽస్మి
మ్రియే య దరిణా హతః ఆరణ్య–41–17

శ్రీరాముడు నన్ను వధించిన యనంతరము శీఘ్రముననే నిన్నును వధించును. ఇప్పుడు నీచే చచ్చుటకంటె శ్రీరామునిచే చచ్చుట వలన కృతార్థుడ నయ్యెదను.

చూచితిరా శత్రుపక్షమునందలివాడును రాక్షసాధముడును నగు మారీచుడు తాను శ్రీరామునిచే జచ్చుటవలన మోక్షమునంద గల నన్న తన దృఢవిశ్వాసమును ప్రకటించెను.

శ్రీరామచంద్రుని అడవులకు బంపుటకు కారణభూతురాలయిన కైకేయి సయితము శ్రీరాముని ఎంతగనో ప్రేమించి అతనియం దాదరాభిమానములు గలిగియుండెను. శ్రీ రామచంద్రుని పట్టాభిషేక వార్త దుఃఖ వార్తగా గల్పించి చెప్పవచ్చిన మంథరను జూచి కైకేయి పలికిన పలుకు లరయుడు.

శ్లో. రామే వా భరతే వాహం
విశేషం నోప లక్షయే
తస్మాత్తుష్టాఽస్మి యద్రాజా
రామం రాజ్యేఽభిషేక్ష్యతి

శ్లో. న మే పరం కించి దిత స్త్వయా పునః
ప్రియం ప్రియార్హే సు వచం వచః పరమ్
తథా హ్యవోచ స్త్వ మతః ప్రియోత్తరం
పరంవరం తే ప్రదదామి తం వృణు.
అయోధ్య. 7–35, 36.

తా. నాకు భరతుడుగాని, రాముడుగాని ఇరువురు నొక్కటియే. నాకే భేదమును లేదు. దశరథుడు రాజ్యమునందు రాముని కు పట్టాభిషేకము చేయింపబోవుచున్నాడని వినుటవలన నెంతయో సంతసించితిని. మంథరా, నీవు సంతోషమునకు తగినదానవు. ఈ రామాభిషేక వార్తకన్నను ఇతరమయిన ప్రియ తమ వార్తను నీవు నాకింక చెప్పజాలవు. అట్టి ప్రియవార్తను నీ విప్పుడు చెప్పితివి గావున నీకు అన్నిటికన్న నెక్కువగా సంతోషంబు గలిగించు వస్తువు నిచ్చెదను, కోరుకొనుము.

ఇక శ్రీరామచంద్రుని గూర్చి–అతనియందు మాత్సర్యము వహించిన – మంథర పలికిన పలుకులు గమనింపుడు.

శ్లో. విదుషః క్షత్ర చారిత్రే
ప్రాజ్ఞస్య ప్రాప్త కారిణః. అయోధ్య8–8

తా. శ్రీరాముడు మహాబుద్ధిమంతుడు, రాజనీతిని జక్కగా నెఱిగినవాడు, ఏకాలమున దేనిని చేయవలయునో అప్పుడే దానిని తప్పక చేయువాడు.

ఇట్లు రామాయణమును జదువుచు బోవుదుమేని శ్రీరామచంద్రుని గుణగణములు ప్రవాహమునందలి రత్నములవలె ప్రకాశించుచు పరువులు వారుచుండును. శ్రీరామచంద్రుడు పుత్రుడుగా, భ్రాతగా రాజుగా ఎట్లు జీవించెనో పయి యుదాహరణముల వలన మనకు విశదమగుచున్నది గదా! తమ్ముల ప్రేమించుటయందు ఎంతటి దయాళువో వారి శీలమును చక్కబెట్టుటయందును శ్రీరాముడంతటి సమర్థుడు. "లోకాభిరామం శ్రీరామం" అన్న వృద్ధవాక్యము సత్యసమ్మతముగదా! సమస రంగములయందును శ్రీరామచంద్రుడు శ్రేష్ఠుడు. అట్టి ఉత్తమస్థానము నలంకరించుటకు మనము మన శీలమును పదేపదే పరిశీలించుకొనుచు నందలి దోషముల చక్కబెట్టుకొనుచు జీవితమును సార్థకము చేసికొనుటకు ప్రయత్నింపవలయును.

ఈ విషయమున స్వయముగా పరబ్రహ్మస్వరూపుడయిన (శ్రీ)రామచంద్రుడే లక్ష్మణునికి దెలిపిన పరమార్థము గమనార్హము :

శ్లో. యావన్నపశ్యే దఖిలం మదాత్మకం
తావ న్మదారాధన తత్పరో భవేత్
శ్రద్ధాళు రత్యూర్జిత భక్తిలక్షణో
య స్తస్య దృశ్యోఽహ మహర్నిశం హృది.
శ్రీరామగీతా-58.

తా. మానవు డెంతవఱకు సమస్త ప్రపంచమును లయముచేసి దాని కధిష్ఠానభూతుడ నయిన నన్ను దెలియకుండునో యంతపర్యంతము నన్నారాధింపవలయును. శ్రద్ధయు పరిశుద్ధ మయిన భక్తియు గలవాని హృదయమున రేయింబవలును నేను ప్రత్యక్షమగుచుందును. అట్లు నాయందు భక్తిగలిగి నన్ను సేవించినచో ఆ సత్పురుషుడు వివేక వైరాగ్యాదుల పడసి మదైక్యజ్ఞానము నందగలడు.

శ్లో. య స్సేవతే మా మగుణం గుణాత్పరం
హృదా కదావా యదివా గుణాత్మకమ్
సోఽహం స్వపాదాఞ్చిత రేణుభి స్స్పృశ
న్పునాతి లోకత్రితయం యథారవిః.
శ్రీరామగీతా-61.

తా. ఏ పుణ్యాత్ముడు నన్ను నిర్గుణునిగను, గుణాతీతునిగను తెలిసి పరిశుద్ధహృదయంబున నుపాసించునో అతడు నాయం దైక్యము నొందును. అతడు సూర్యుడు తన కిరణముల చేతంబోలె తన పాదరేణువులచేత ముల్లోకములను పవిత్రము చేయును.

పరబ్రహ్మస్వరూపుడయిన శ్రీరామచంద్రుని పాదారవిందముల సేవించుచు ఆదర్శమానవులమై జీవించి శ్రీరామ సాయుజ్యమునందుటకు ప్రయత్నింతము గాక.

శ్లో. ఆపదా మపహర్తారం దాతారం సర్వ సంపదామ్
రామం శ్రీరామం భూయో భూయో నమా మ్యహం.

అ ను న య ము

(శ్రీ ఊర్మిళాభ్యుదయము)

కవికిశోర, ఆంధ్ర కవిహంస మహాకవి, పుల్లకవి శేషగిరి రాయకవి.

(సీతారామలక్ష్మణులు అరణ్యవాసమునకు వెళ్లిన తరువాత ఊర్మిళ విచారముతో నిద్రాహారములు మానినందున సోదరీమణులగు మాండవీశ్రుతకీర్తులు అనునయింతురు.)

మ. తగునే నీ కిటు చింతనొందఁ? దగవుల్ ధైర్యంబు గోల్పోయి నె
వ్వగచే దేహము నొవ్వఁజేసి పరితాపం బొందఁగా మేలె ? వ
మ్మ్మగదే! యీ క్రియ బేలవైన బ్రదుకున్ మూఢత్వమే గాదె ? నీ
వగపుల్ నీవె దలంచుకొమ్ము స్థిరతల్ బాటించి భావమ్మునన్.

చ. ధరణి జనించు వారలకుఁ దప్పవు కీడును మేలు జంటగాఁ
బరఁగుచునుండు వారిదగు ప్రాకృతకర్మవశంబుచేత నె
త్తఱిని వివేకవంతు లతి ధైర్యముతో నవి యోర్చి మోద సం
భరిత మనస్కులయ్యెదరు, పామరు లందు నశింత్రు బేలలై.

ఉ. పుట్టితి మా విదేహ నృపపుంగవు వంశమునందు; దానిపై
మెట్టితి మీరఘూద్వహుల మేలి కుటుంబము గీర్తినొందఁ; జే
పట్టితి మమ్ము గార్యపరివర్ధిత మానవ భవ్యమూర్తులన్;
బుట్టినచోట, మెట్టునెడఁ బొందవలెన్ యశమెల్లభంగులన్.

ఉ. కాంతుఁడనంగ నింద్రియసుఖంబును గూర్చెడు యంత్రమంచు నీ
స్వాంతమునన్ దలంచి యెడఁబాటు సహింపఁగ లేక ముగ్ధవై
వంతను గుందెదీవకట! భావమచంచల లక్ష్యసిద్ధి న
త్యంతముఁ గూర్పఁగా సగుణ తత్త్వవిభావముగాదె భర్తయున్?

మ॥ పతినిన్ దైవముగాఁగఁ గొల్వవలె సద్భావంబుతో నాతియం
చిత భక్తిన్ గొనియంచుఁ బల్కు నుడులన్ జింతింపవో? భర్త సం
చిత రక్తిన్ హృదినుంచి శక్తిమెయి శాసింపంగ విన్నార ము
న్నతి మాత్రిత్రితయంబె యాత్మకును బ్రజ్ఞాదీప్తి సిద్ధించుటన్.

మ॥ పతిచెంతన్ వసియించు సాధ్వి చనవున్ బాటించి సేవాదిక
ప్రతతిన్ నాథు నలర్చుకొంట యొకటే భావించి యెవ్వేళ జీ
వితమెల్లన్ సగుణార్చనంబు కొఱకే వెచ్చింపఁగా నౌనుగా
ని తలంపన్ పరమాత్ము నిర్గుణప్రభా నిర్ణీతి సాధ్యంబొకో?

గీ. కోరుకొన్నట్టి వస్తువు దూరమైనఁ బ్రబలమగు వాంఛ దానిపైఁ బరగుచుండి
సాధనంబున దీక్ష విస్తారమగుచు, నవిరళంబైన కృషికిఁ బ్రోత్సాహమిచ్చు.

గీ. కోరికలడంచి, భావముఁగుదురుపఱచి, యింద్రియోద్వేగమునుమాన్పి యిహపరమ్ము
లందున నసూయ వెలయ జీవాత్మనెపుడు భవ్యపరమాత్మ సంయోగ పాత్రముగను
సిద్ధపఱుచుట దాంపత్య చిహ్నమగును.

చ. ఎఱుగనివార లెల్లపుడు నింద్రియ భోగములందు మున్గి కా
పురములు తీర్చి, తృప్తిఁగనఁ బోవక నిందును నందు సౌఖ్యముల్
కరవయి, గర్భవాస నరకమ్మున మ్రాల్గుచుఁ బుట్టి చచ్చుచున్
పురుగులబోలె జీవితముఁ బోవిడుచుందురు మాటిమాటికిన్.

గీ. సగుణ నిర్గుణరూప ప్రసన్నుఁడగుచుఁ గల్పవృక్షమ్ము సతులకుఁ గాంతుఁడనఁగ
నతఁడు దూరమ్ముగా నున్న నతివ కెపుడు, గలుగ దపచారమును ధ్యాన గరిమమించు
భవము తరియింప నది రాచబాట యగును.

ఉ॥ నిద్దురమాని భుక్తియును నీరము గొంటయు మాని దేహ మా
పద్దశ నొందఁజేసి దృఢభావము లేక కృశించు నంత నీ
కొద్ది గడించు దానవో? యొకింత తలంపుము, ధర్మసాధనన్
పెద్దశరీర పోషణము; వృద్ధినొసంగెడు నద్ది బుద్ధికిన్.

ఉ. భౌతిక దేహమున్ దగిన పద్ధతి నిల్పుచు నిశ్చలమ్ముగాఁ
జేతమునందునన్ విభుని శ్రీపదరాజము లెంచి కొల్చు నా
నాతియె యామె భర్తకు ననంతసుఖంబిడు భావనా బలం
బాతత దీప్తితో జగతియందున వ్యాప్తమునొంది మించఁగన్.

గీ. భావనాశక్తి సృజియించు బ్రహ్మయెపుడు, భావపటిమను విష్ణుండు పరఁగఁ బ్రోచు
భావనాశక్తి సర్వ సౌభాగ్యము లిడు, భావవైరుధ్యమే జగత్ప్రళయము సుమ.

భరత మహిమ

(కీ. శే.) మహోపాధ్యాయ దుర్భా సుబ్రహ్మణ్య శర్మగారు

భరతుఁడు నందిగ్రామమునఁ బాదుకా ముఖమున రాజకార్యములు నిర్వర్తించుచుండెను. ఆతఁడు సూర్యోదయమునకన్న మున్న నిద్ర లేచి క్షత్రియోచితములైన కల్య కర్మముల నాచరించి ౮, ౯, గంటలకుఁ బాదుకాధిష్ఠితమైన సింహాసనమునొద్దకు వచ్చెడు వాఁడు. అక్కడఁ దన దర్శనమునకు వేచియున్న సామంతులకును, ఇతర జనులకును దర్శనమిచ్చి పాదుకలు ప్రమాణముగాఁ దన యంతరాత్మ కెవ్వి శాస్త్రవిహితములని తోఁచునో యట్టి యాజ్ఞలఁ బ్రతిపాదించి మధ్యాహ్నమునకు లోని కేఁగెడు వాఁడు. అప్పుడు ఋషివృత్తికొఱకైన యల్ప ఫలమూలముల భుజించి తక్కు కాలము పూర్వ రాజర్షి చరిత్రములు వినుటయందును, వేద శాస్త్ర పురాణప్రసంగములయందును, వృద్ధ జనులతోడం గాలమ్ము గడపుచుండెను. భ్రాతృ విరహ దుఃఖమువలనఁ గలిగిన శరీర వైవర్ణ్యమునకుఁ దోడు జటాధారణాదులవలననైన మార్పులవలన, భరతుని గుఱుతించుటయే యసాధ్యముగా నుండెను. అల్పాహారము వలనను, ఎన్నఁడు నలవాటులేని యితర వ్రత చర్యలవలనను, ప్రకృతి సుకుమారుఁడైన భరతుఁడు కృశించి తోల్త శల్యావశిష్టుఁడయి నప్పుడు, ఈ నియమములు మార్చుకొనుమని మిత్రులు పెక్కు తెఱఁగుల బోధించిరి. కాని, రామునితోడి పునస్సమాగమ మగునంతదనుక, నీ నియమములవలన నేమైన నగుఁగాక వానిఁ ద్యజింపవలనుపడదనియు, రాజ్యాధికార యోగ్యుఁడైన యగ్రజుఁడరణ్యమున దపోవృత్తినుండఁ దాను భోగానుభవము సేయుట గురుద్రోహమనియుఁ జెప్పి భరతుఁడు తన పట్టు వీడకుండెను. భరతుని యుల్లాసముకొఱకు సామంతులు నాటకాదులు నృత్యాదులు పెక్కులు కల్పించుచుండిరి. కాని తాను రాజుగాఁడనియు బాదుకలు కార్యనిర్వహణము సేయుచున్నవనియుఁ జెప్పి తాను, అట్టివాని దర్శింపకుండెను. సుఖహేతువులైన వస్తు దర్శనములు గూడ భరతునకుఁ జింతనే గావించుచుండెను. 'జానకీసహితుఁడైన రామున కుండ వలసిన యీభోగములు నాకేల? ఆయన పాద ధూళి ధరించుటకుఁగూడ నే నర్హుఁడనుగాను' అని భరతుఁడు చెప్పుచుండెను. ఇట్టి మహానీయుని సాన్నిధ్యమునఁ రాష్ట్రమెల్ల ధర్మమయమై పోయెను. అహింసాపరులయిన మహర్షుల యాశ్రమములఁ గ్రూరసత్త్వములు జాతి వైరమునుదక్కి కరుణగలిగి యుండునని

మనము విందుముగదా! భరతరాజ్యమున నట్టిదియే ఘటిల్లెను. చోరులు దొంగతనము మానుకొనిరి. జారత్వ మనునది దుష్కావ్యాలాపములయందుఁ జూడవలసినదే. స్వప్రయోజన పరత్వము నామమాత్రావశేషమయ్యెను. రాజభక్తి మిన్నందెను. 'భరతుని యాజ్ఞ' యన్నఁజాలును. అది బ్రహ్మాస్త్రమే. ధర్మము యొక్క శక్తి యప్రతిద్వంద్వమని యెల్లరకుఁ దోఁచిపోయెను. వర్ణాశ్రమాచారములు, గురుదేవతాభక్తి, వేదవిశ్వాసము, అన్నియును బ్రస్ఫుటములయ్యెను. ఇఁక సామంతరాజులు భరతుఁడన్న భగవచ్ఛబ్దమునకుఁ బర్యాయపదమని వాడుకొనఁ జొచ్చిరి. పుణ్యతీర్థావగాహనమునకన్నఁ, బుణ్యక్షేత్ర దర్శనమునకన్న, భరతునిజూచుట యెక్కువ ఫల మిచ్చునదియని ప్రజలు దలంపఁదొడఁగిరి. దండనీతితోఁ బనియే లేకబోయెను. ధర్మాతిక్రమణ మసాధ్యమయ్యెను.

భరతుఁడు నందిగ్రామమున రాజ్యము చేయుచుండెను. తొల్తటివిషాదవేగము కాలక్రమమున గొంత తగ్గినను రామసందర్శనేచ్ఛ భరతుని మనస్సును విడనాడక తాండవమాడుచుండెను, 'అరణ్యవాస మెప్పుడు పూర్తియగునా? శ్రీరాముఁ డయోధ్యకు మరల నెప్పుడు వచ్చునా? చతురంగబల కోశవసుధాన్యములతోడ నేనీరాజ్యము నాయన కెప్పుడప్పగింపఁ గలుగుదునా?' యని భరతుఁడు దినములు లెక్కపెట్టుకొనుచుండెను. ఐననొక్కదినమా? రెండుదినములా? పదునాలుగేండ్లు గడవవలయు!

చిత్రకూటమునుండి మరలివచ్చిన కొన్ని దినములవఱకు భరతునకు శ్రీరాముల వార్త తెలియుచుండెను. ఆవల వార్తలు వచ్చుటుడిగెను. ఆరణ్యకుల నెవ్వరి నడిగినను వారు చెప్పనేరకుండిరి. రామలక్ష్మణు లే దిక్కున కేగిరో, యేమైరో యెవ్వరికిని దెలియకుండెను. వారు దండకారణ్యము ప్రవేశించినదిగాని, పంచవటికి వచ్చి యక్కడ శ్రీరాముఁడు సీతను గోల్పోయినదిగాని, పాపము! భరతున కేదియుఁ దెలియదు. సీతానిమిత్తమై రామ రావణులకుఁ బాటిల్లిన ఘోరసంగ్రామముగాని, యందు హనుమదాది సాహాయ్యమున శ్రీరామున కొడఁగూడిన జయముగాని, సీతాపరీక్షణము పరిగ్రహముగాని, భరతునకు నేమియుఁ దెలియదు. యథార్థములైన యిట్టి యుదంతములు దెలియకున్నను, శ్రీరాముఁడు సముద్రమును దాఁటి రావణునితోడి యుద్ధమున కుపక్రమించిన తర్వాత నపకారతత్పరులైన రక్కసులు కొన్ని మాయలు పన్ని భరతునకు సంశయ విషాదముల వెలయించుచుండిరి. ఒకపరి, దండశూకుఁ డను రాక్షసుఁడు మునివేషధారియై వచ్చి లక్ష్మణుఁ డరణ్యమునఁ గ్రూరసత్త్వముల పాలయ్యెనని చెప్పి మిక్కిలి యలజడి కలిగించెను. వేఱొక్కపరి, నింకొక్కఁడు శ్రీరాముఁడు రావణాసురునిచేత హతుఁడయ్యెనని నమ్మకము పుట్టఁబల్కి భరతునిఁ బ్రాయోపవేశముసేయింప నుద్యమించెను. ఇట్టి రాక్షసమాయలు దైవానుకూల్యమున బయల్పడి గార్యము మించుటకు మున్న మాయావులైన యచ్చెనఁటి రక్కసులే మ్రందుచుండిరి. ౧౦ సంవత్సరములు–; ౧౧ సంవత్సరములు–; శ్రీరాముల వార్త దెలియకుండెను. పాపము; మన భరతుఁ డేమిసేయగలఁడు? పదునాల్గవ సంవత్సరముగూడఁ గడచిక్కుచుండెను. రామలక్ష్మణుల పోఁబడి లేదు.

(సశేషము)

వార్తలు - విశేషాలు

శ్రీరామకృష్ణమఠము మదరాసు-4.

శంకరరామానుజ జయంతి మహోత్సవములు

శ్రీ శంకరాచార్యులయు శ్రీ రామానుజాచార్యులయు జయంతులు ఈ సంవత్సరం (1970) మే నెల 10 వ తేదీనాడు సమకూడినవి. ఆనాడు శ్రీరామకృష్ణమఠంలో ప్రత్యేకపూజ నిర్వర్తితమైనది. శ్రీశంకరజయంతి సంబంధంగా పౌరమహాసభ మే నెల 24 వ తేది భానువారం వివేకానందహాలులో సమావేశమైనది. ప్రార్థన గేయం మంత్రపుష్పం ముగిసిన వెంటనే మఠాధ్యక్షులు శ్రీమత్కైలాసానందస్వాములు సదస్యులకు స్వాగతమంగళం అనుగ్రహిస్తూ ఇలా గన్నారు. తత్త్వశాస్త్రప్రపంచంలో శ్రీ శంకరాచార్యులస్థానం అనన్యాదృశమైనది. వారి జీవితచరిత్రం వారిగ్రంథాలు ఈనాటికీ ప్రజలకు ఉత్తేజం కలిగిస్తున్నాయి. 8-వ 9-వ శతాబ్దాల క్లిష్టసమయంలో భారతదేశసముద్ధరణం కావించినవారు శ్రీశంకరులు. వేదాలను దేవాలయాలను సారస్వతమును భారతదేశంలో విలువగల సమస్తమును కాపాడి భద్రపఱచినవారాయన. వారిభాష్యాలు అవిస్మరణీయములు. పరమార్థం తెలుసుకోగోరిన ఎవరుగాని శ్రీశంకరులను సమాశ్రయింపక తప్పదు. వారితత్త్వశాస్త్రగ్రంథాలు ఉత్తమకావ్యాలుకూడ. సన్న్యాసులలో దశనామి సంప్రదాయంలోకానికి ఆయన ప్రసాదించిందే. ఆయన గొప్పసంస్కర్త, అమోఘప్రచారకుడు. కాబట్టి ఆయన సాధించిన కార్యాలు చరిత్రపై ప్రసరింపజేస్తున్న ప్రభావం ఇంతంత కాదు. భారతదేశైక్యాన్ని ఆయన సాక్షాత్కరించుకొన్నందుకు నిదర్శనాలు నలుమూలలలో ఆయన నెలకొల్పిన మఠాలే. శ్రీశంకరులలో భక్తినిష్ఠ జ్ఞాననిష్ఠకు తీసిపోదు. ఆయన భక్తి గంభీరతకు తత్ప్రణీతములైన స్తోత్రరాజములు తార్కాణములు.

మద్రాసు యూనివర్సిటీ తత్త్వశాస్త్రపరిశోధనాసంచాలకులైన డాక్టర్ టి. ఎమ్. పి. మహాదేవనుగారు ఆధునికలోకానికి ఆదిశంకరులు సంక్రమింపజేసిన ఆధ్యాత్మికవిజ్ఞాననిధులనుగూర్చి ఉపన్యసించారు. ప్రొఫెసరు కె. శేషాద్రిగారి వందనసమర్పణంతో నాటి కార్యక్రమం ముగిసింది.

వివేకానందహాలులోనే జూన్ నెల 7-వ తేదీ భానువారం నాడు శ్రీరామానుజజయంతి సంబంధంగా పౌరమహాసభ కూడినది. ప్రార్థన గేయం మంత్రపుష్పం ముగిసిన వెంటనే శ్రీరామకృష్ణవిజయ తమిళ పత్రికాసంపాదకులైన శ్రీమత్పరమాత్మానందస్వాములు నాటి వక్తకు సదస్యులకు స్వాగతాశీస్సులనుగ్రహిస్తూ ఇలా గన్నారు—పరిసరాలలో మానవమనః ప్రవృత్తులలో మార్పులు కలిగి ప్రాతవడిన సముదాచారాలస్థానంలో క్రొత్త సముదాచారాలు నెలకొంటున్నప్పుడు లోకకల్యాణనిర్వర్తనార్థం ఆచార్యులవతరిస్తుంటారు. శ్రీరామానుజులవారియవతారమును ఆయనకు ముందుండిన దివ్యసూరులు ముందుగనే సూచించారు. మానవచరిత్రలో భగవద్రామానుజులవారు యుగకర్త కావడంలో ఆశ్చర్యం లేదు. ఆయన సాధించిన ఘనకార్యాలు బహుముఖములు. ఆయన ఉభయవేదాంతి, మహాప్రతిభావంతులగు ముఖ్యశిష్యులు కలవాడు. యదార్థములైన బిరుదములు అనేకములాయన కల్పితములై చరితార్థములైనవి.

రామానుజుల జీవితచరిత్రమును ఉపదేశాలనుగూర్చి డాక్టర్ వి. వి. రామానుజంగారు ఉపన్యసించారు. డాక్టర్ ఎస్. వేణుగోపాలం

గారి వందనసమర్పణంతో సభాకార్యక్రమం ముగిసింది.

శ్రీవివేకానందస్వామికి స్మారకం

ప్రస్తుతం భారతదేశంలో పెక్కుచోట్ల శ్రీవివేకానందస్వామికి స్మారకములు నిర్మిస్తున్నారు. కన్యాకుమార్యగ్రమున కెదురుగా వివేకానందశిలపై ప్రారబ్ధమైన స్మారకనిర్మాణం పరిసమాప్తిని సమీపిస్తున్నది.

దక్షిణపుకొనన వివేకానందశిలవలెనే హిమాలయనగరమైన అల్మోడాలో స్వామిజీ సంబంధంచేత పరిపూతములైనవి అనేకములున్నవి. అల్మోడాపై స్వామీజీకి ప్రత్యేక ప్రేమ. మూడుపర్యాయములో ఇంకను ఎక్కువ సార్లో ఆయన అక్కడికి విజయంచేసి ఆ నగరమును పవిత్రీకరించారు. కాబట్టి అల్మోడాలో సమర్థమైన స్మారక మొకటి నిర్మింపబడిందంటే ఎంతయు సమంజసమే. విశ్వమహాపురుషులుగా వెలుగొందేందుకు ముందు స్వామి పరివ్రాజకసన్యాసిగా పాదచారిగా నైనిటాలు నుండి అంతదూరం నడిచి వచ్చి అల్మోడాలో మహామ్మదీయుల సమాధుల మిట్టకు చేరుకునేటప్పటికి ఆకలిచేత దప్పిచేత ఆయన పరవశుడగుచుండెను. ఆ ఒలికిమిట్టవద్ద నున్న ఫకీరుచేత ఒకదోసకాయ తప్ప నే తేదియు లేదు. దాని నతడు స్వామీజీకి సమర్పించాడు. అది 1890 సంవత్సరపు వేసవి. భారతదేశసముద్ధరణానికి అధఃపతితుల పేదల సంక్షేమానికి తన జీవితము నర్పింపవలెననెడి అంతరాత్మప్రబోధము స్వామీజీకి కలిగింది అక్కడే అప్పుడే. ఏడేండ్లకు తరువాత 1897 లో వివేకానంద స్వామి అల్మోడాకు మరల విచ్చేశారు. అప్పటి కాయన భారతదేశాధ్యాత్మికసందేశప్రవక్తగా ఖండఖండాంతరప్రశస్తి నంది యుండెను. పౌరులందఱు స్వామీజీకి గొప్పఊరేగింపు చేశారు. "ఊరేగింపు మహామ్మదీయుల సమాధులమిట్ట యొద్దకు వచ్చింది. మునుపటి ఫకీరు అక్కడే ఉన్నాడు. స్వామి అతనిని గుర్తించి గుఱ్ఱము మీద నుండి దిగి పరుగున పోయి కౌగిలించుకొని "ఒకనాడు నా ప్రాణమును కాపాడిన దితడు" అని అందఱి ఎదుట ఉద్ఘాటించారు. స్వామి అల్మోడాకు మూడవసారి విచ్చేసింది 1898 లో. అప్పు డాయనతోకూడ ప్రాచ్య పాశ్చాత్యశిష్యులు చాలమంది ఉండినారు.

కొన్నాళ్ళక్రితం అల్మోడా నగరప్రజలు ఒకపరిషత్తు నేర్పఱచారు. అల్మోడాలో శ్రీవివేకానందస్వామితో సంబంధపడినప్రాంతాలన్నిట తగినస్మారకములు నిర్మించా లని అందుకు ధనం సేకరించా లని ఈపరిషత్తువారి ముఖ్యోద్దేశాలు.

మహామ్మదీయుల సమాధులమిట్ట సమీపంలో ఒక చలువరాతివిశ్రాంతిభవనమును నిర్మించా లని మొకటనిశ్చయించుకున్నారు. స్మారకనిర్మాణపరిషదధ్యక్షులైన శ్రీజోషీ సేనుగారు 1970 మే 8-వ తేదీ శుక్రవారం నాడు శంకుస్థాపనం చేశారు. అప్పుడు శ్రీపూర్ణాత్మానందస్వామి వేదమును మౌలానా అబ్దుల్ వహాబుగారు కొరానును శ్రీ బి. ఎస్. మాస్సేగారు బైబిలును పారాయణం చేశారు. శ్రీవివేకానందస్వాముల విశ్వమానవసౌభ్రాత్రసందేశమును గూర్చి శ్రీజోషీసేనుగారు ఉపన్యసించారు. పరిషత్ కార్యదర్శి శ్రీహరికిషన్ లాల్ షాగారు స్మారకనిర్మాణానికి హృదయపూర్వకంగా సహకరించా లని సదస్యులకు విన్నవించారు. అలహాబాదు రామకృష్ణమిషను సెక్రటరీ శ్రీవ్యోమానందస్వామి అల్మోడానగర చారిత్రికాధ్యాత్మికప్రాముఖ్యాన్ని ప్రస్తుతించి "ఈసమీపంలోఒకగుహలో ధ్యానసమాధిలో

జీవిత శేషం గడపాలని శ్రీవివేకానందస్వాములభిలషించారు. కాని విశ్వమానవసముద్ధరణకై జీవితము నంకితమును చేసికోమని ఆయన ఆజ్ఞప్తుడైనాడు. ఇదే ఆజ్ఞ ఆయనకు కన్యాకుమారిఅగ్రంవద్దనుఅందింపబడింది.'' అన్నారు జిల్లా మేజిస్ట్రేటు శ్రీమాతాప్రసాదుగారు వివేకానందస్వాములు కోరినట్లుగా ప్రజలలో ఐక్యం పెంపొందాలి'' అన్నారు.

ఉదారమహాజనులు శ్రీవివేకానందస్వాముల పట్ల భక్తిని కృతజ్ఞతను చరితార్థ మొనర్చు కొంటూ స్మారకనిర్మాణాలకు విరాళము లిచ్చి తోడ్పడవలసిం దని పరిషత్తువారు ప్రార్థిస్తున్నారు. విరాళాలు అందింపవలసిన విలాసం శ్రీగోపాల్‌షా, ట్రెషరర్, స్వామి వివేకానంద మెమోరియలు కమిటీ, అల్మోడా, ఉ.ప్ర.

పూర్ణాత్మానందస్వామి
అల్మోడా శ్రీరామకృష్ణ కుటీరాధ్యక్షులు

జోషీ సేను
వివేకానందస్వామి మెమోరియలు కమిటీ
ప్రెసిడెంటు
అల్మోడా. ఉ.ప్ర.

గ్రంథ పరిచయం

శ్రీసప్తశ్లోకి భగవద్గీత

ఇందు భగవద్గీతనుండి ఏడుశ్లోకాలు గ్రువ్వబడి ఉన్నాయి. వానికి కళింగపట్నం గీతా కుటీరం పరమహంస పరివ్రాజకాచార్య త్రిదండి శ్రీరామానుజజీయరుస్వామివారు పదవిభాగ ప్రతిపదార్థ, తాత్పర్యాలను ఇందు అనుగ్రహించియున్నారు. ఇది ఆర్ష సాహితివారి 18 వ ప్రచురణం. ప్రాప్తిస్థానం: ఆర్ష సాహితి, సనాతన ధర్మప్రచారసంస్థ, 25-7-18 ఆమంచివారి వీధి, విజయనగరం 2. దీనికి వెల లేదు. వలయువారు తపాలాఖర్చులకై 20 పైసలు పంపిన చాలును. చిన్నసైజు, మంచిఅచ్చు, ఆకర్షకమైన తయారింపు.

చెంగల్పట్టు రామకృష్ణమిషను విద్యాలయ హైస్కూళ్ళ క్యాలెండరు 1970-71

వ్యవస్థాపక ప్రిన్సిపాలు శ్రీ టి. ఇ. వి. శర్మగారు అపూర్వమైన పద్ధతిలో క్యాలెండరును రూపొందించియున్నారు. పుస్తకరూపమున కాక, స్కూలు క్యాలెండరు గోడకు తగిలించుకోదగిన రూపంలో తయారు చేయబడి ఉంది. తొలిపుటలో ధ్యానసమాధి స్థితిలోని శ్రీరామకృష్ణపరమహంసదేవుని చిత్రం కంటికి చల్లగా అమర్చబడిఉంది. విద్యాలయాల అధికారవర్గాలనుగూర్చిన వివరాలు ఆక్రిందే పొందుపఱుబడిఉన్నాయి. లోపలి పుటలలో ప్రతిదానిలోను శ్రీశారదా రామకృష్ణవివేకానందుల చిత్రపటాలతోను వారి సూక్తిరత్నాలతోను రెండేసి నెలల తేదులు ఉత్సవవిశేషాలు పొందుపఱుపబడి యున్నవి. జనవరినుండి డిసంబరువఱకు ఉండే 12 నెలల క్యాలండరు కాదిది. 1970 జూన్ నుండి 1971 ఏప్రిలు వఱకు నుండు పదకొండు నెలల క్యాలండ రిది. చూస్తే పదిలపఱచుకోవాలనిపిస్తుందే కాని, ఏ పేజిని కాని చించిపాఱవేయ బుద్ధి రాదు. ప్రభాకర్

భక్తియోగము

అనువాదకులు :
శ్రీ చిరంతనానందస్వాములవారు

ఆధునికుల చిత్తము నాకర్షించురీతిని, అమోఘవచనములతో, విమర్శకదృష్టితో, శాస్త్రప్రమాణములతో భక్తితత్త్వమును శ్రీ వివేకానందస్వాములవా రిందు విపులముగా ప్రదర్శించి యున్నారు. మూలగ్రంథములలోని ప్రమాణవచనములును వానికి టిప్పణములును సులభశైలియందు వ్రాయబడి యున్నవి.

121+4 పుటలు ఆఱవ కూర్పు వెల : రూ. 1-50

కర్మయోగము

అనువాదకులు :
శ్రీ చిరంతనానందస్వాములవారు

ఇందు శ్రీ వివేకానందస్వాములవారు కర్మయోగతత్త్వము నరటిపండొలిచినరీతిని విశదీకరించియున్నారు. కర్మమెటుల మోక్షసాధనమో స్పష్టీకరించియున్నారు. కర్మయోగ రహస్యము నెఱుగగోరు జిజ్ఞాసువుల కిది కల్పతరువు.

146+8 పుటలు ఏడవ కూర్పు వెల : రూ. 1-50

ఇట్లు వ్రాయుడు : మేనేజరు, శ్రీ రామకృష్ణమఠము, మైలాపూరు, మద్రాసు-4

జ్ఞానయోగము

అనువాదకులు :
కీ. శే. కందుకూరు మల్లికార్జునంగారు, బి. ఏ.

అద్వైతజ్ఞానము "సిద్ధులకు, బద్ధులకు, స్త్రీలకు, పురుషులకు, శిశువులకు, పండితులకు, పామరులకు — అందఱికిని సమానాధికారముగల సొమ్ము" కావలెనని శ్రీ వివేకానంద స్వాములే యిందు పలికియున్నారు. అందుల కనుగుణమగు విషయ విన్యాసముతో శ్రీ స్వామివారీ యుపన్యాసముల కావించియున్నారు. ఈ గ్రంథము సరళమధుర భాషయందు ఆంధ్రీకరింపబడి యున్నది.

(480+8) పుటలు | రెండవ కూర్పు | వెల : రూ. 4-00

నూతన ముద్రణము : | ఇప్పుడే వెలువడినది :

రాజయోగము

అనువాదకులు :
శ్రీ చిరంతనానందస్వామి

ఇందు ప్రథమభాగము శ్రీ వివేకానందస్వాములవారు న్యూయార్కు పట్టణములో కావించిన వివిధోపన్యాసములు. ద్వితీయభాగము – రాజయోగమునకు ప్రమాణములయిన పాతంజలయోగసూత్రముల విపుల వివరణము. పాఠకుల కిది రాజయోగదర్పణమే.

(320+8 పుటలు) | ఆఱవ కూర్పు. | వెల : రూ. 2-50

అడ్రెసు : మేనేజరు, శ్రీరామకృష్ణమఠము, మైలాపూరు, మద్రాసు–4

సంపాదకులు : శ్రీ హిరానందస్వామి, శ్రీ నేలటూరి భక్తవత్సలము.
శ్రీ ఎమ్. బాలసుందరంగారిచే ఫ్రీడమ్ ప్రెస్, (మద్రాసు-21) న ముద్రింపబడి,
శ్రీ హిరానందస్వామిచే శ్రీ రామకృష్ణమఠము (మైలాపూరు) నుండి ప్రచురింపబడినది.